# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 43 సంచిక : 20 విజయవాడ 20-2-2011 పేజీలు : 16 వెల: రు 5.00


లోపలి పేజీల్లో...


- భారత ప్రజా విముక్తి పోరాటానికి దారిచూపుతున్న ఉజ్వలమైన పోరాటాలు, రాజకీయ–సిద్ధాంత సంఘర్షణలు
- సూడన్‌లో చమురు వనరులపై ఆధిపత్యం కొరకు రక్తపాతం
- జపాన్ : నూతన రక్షణ విధాన పరమార్థం
- ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రజల నిరసనాందోళనలు
- ప్రపంచ వ్యాపితంగా కార్మికుల ఆందోళనలు
- దోపిడీ వడ్డీకి ఆమోద ముద్ర వేసిన మాలేగావ్ కమిటీ
- వృత్తి, సాంకేతిక కళాశాలల విద్యార్థుల జీవితాలతో చెలగాటం
- అమెరికాలో భారత విద్యార్థులకు బేడీలు


### కౌలు రైతాంగానికి రుణపరపతి

## మరో ప్రదర్శనాత్మక చర్యకు కసరత్తు

**కౌలు** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ఇటీవల బాగా చర్చకు వచ్చాయి. రాష్ట్రంలో నానాటికీ కౌలురైతుల సంఖ్య పెరుగుతున్నది. నూతన ఆర్థిక విధానాల పర్యవసానంగా రాష్ట్రంలో సాగిన, సాగుతున్న రైతాంగపు ఆత్మహత్యలలో కౌలురైతులు గణనీయంగా వున్నారు. ఇటీవలి అతివృష్టితో పంటలు దెబ్బతిని రైతాంగం కష్టాలపాలయ్యారు.

కౌలు రైతుల సమస్యలను రుణపరపతి సౌకర్యం లభ్యంకానందువల్ల తలెత్తిన సమస్యగా మాత్రమే పరిగణిస్తూ పాలకవర్గ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. వీరికి రుణ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవటం గురించి చర్చలు సాగిస్తున్నాయి. చివరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చేందుకుద్దేశించిన ముసాయిదా బిల్లును రాష్ట్రప్రభుత్వం చర్చలకు విడుదల చేసింది. జిల్లా కలెక్టర్లు సమావేశాలు జరిపి అభిప్రాయాలు తెలుసుకునే తంతును మొక్కుబడిగా పూర్తిచేశారు. ఈ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బిల్లులో అవసరమైన సవరణలు చేసి అసెంబ్లీలో ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

### కౌలుదార్ల దుస్థితి

ముసాయిదా బిల్లు గురించి చర్చించే ముందుగా కౌలురైతుల పరిస్థితినీ, దానికి కారణాలనూ చూడాలి. దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా వ్యవసాయరంగంలో విప్లవ భూసంస్కరణలు అమలు జరిగినప్పుడే, కాలంచెల్లిన భూస్వామ్య సంబంధాలు బ్రద్దలై రైతాంగం విముక్తిచెంది, దేశ పురోభివృద్ధికి మార్గం సుగమమౌతుంది. భూస్వామ్య దోపిడీ, పెత్తనాలక్రింద నలిగిపోతున్న రైతాంగం భూమికోసం సాగించిన వీరోచిత పోరాటాల ఫలితంగా పాలకులు భూగరిష్ట పరిమితి చట్టాలను చేశారు. ఏనుగులు దూరే కంతలతో రూపొందించిన చట్టాలు భూస్వామ్య, పెత్తందారీ వర్గాలు భూమిని కోల్పోకుండా అనేక అవకాశాలనిచ్చింది. ఈ అరకొర చట్టాలను కూడా పాలకులు చిత్తశుద్ధితో అమలు జరపలేదు. భూసంస్కరణలు అమలు జరగలేదు.

రైతాంగ పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం కౌలురైతాంగానికి రక్షణ చర్యలు తీసుకోవాల్సిన స్థితిలో పడింది. కౌలుదారీ రక్షణ చట్టాన్ని చేసింది. అయితే ఈ చట్టం కౌలుదారుల హక్కులకు పూర్తిరక్షణ కల్పించలేదు. ఒక భూమిని 12 ఏళ్లపాటు సాగుచేసిన కౌలుదారుకు మాత్రమే కొన్ని పరిమిత హక్కులు యిచ్చింది. అవి: భూమి యజమాని స్వంత సాగుచేయదలిస్తేనే కౌలుదారుని తప్పించాలి; భూమి అమ్మదలిస్తే, మొదటి అవకాశం కౌలుదారుకివ్వాలి; అతను కొనలేకపోతే ఇతరులకు అమ్మాలి. భూమిని కొన్నవారు కౌలు కివ్వదలుచుకుంటే అప్పటి వరకూవున్న కౌలుదారుకే ఇవ్వాలి.

దీనితో ప్రతి ఏడాదీ కౌలుదారును మార్చటం; అమరకం రికార్డులలో కౌలుదారు పేరుచేర్చకుండా మూజువాణిగా కౌలుకివ్వటం సాగింది. ఈ చట్టంలో కౌలురేట్ల నిర్ణయానికి సంబంధించి నిబంధనలు లేనందున కౌలురేట్లు పెరగటం ప్రారంభమైంది. పండిన ధాన్యంలో కొంతభాగం కౌలుగా చెల్లించే పద్ధతి క్రమంగాపోయి, డబ్బు రూపంలో కౌలు చెల్లించే పద్ధతి వచ్చింది. అలాగే భూయజమాని సాగుపెట్టుబడులలో కొంతభాగం సమకూర్చే పద్ధతికూడా క్రమంగా కనుమరుగైపోయి, కౌలుడబ్బు చెల్లించి భూమిలో కౌలుచేసే పద్ధతి వచ్చింది. సస్యవిప్లవంతో ఈ క్రమం ఊపందుకుంది. ముందుగా డబ్బు రూపంలో కౌలుచెల్లించి ఆ తర్వాత భూమిలోకి దిగి సాగుచేసే పద్ధతే ఈనాడు రాష్ట్రంలో ఏర్పడింది.

ప్రణాళికా సంఘం మాటల్లోనే కౌలుదారీ చట్టాల పని తీరు ఇలావుంది:

"తమ హక్కులను రక్షించుకోగోరిన కౌలుదార్లను నిరాఘాటంగా ఉద్వాసన చెప్పేందుకు ఈ చట్టం అనుమతించింది. ఆవిధంగా చట్టం యిచ్చిన హక్కులపట్ల ఉదాసీన వైఖరి వహించే పరిస్థితికి కౌలుదార్లను నెట్టివేసింది. మరోవైపున కౌలుచెల్లింపు ఏమాత్రం ఆలస్యమైనా కౌలుదార్లను వెళ్లగొట్టే అవకాశం ఈ చట్టం భూస్వాములకిచ్చింది. కోర్టులకెళ్ళటం నిష్ప్రయోజనమైంది. ఈ విధంగా చట్టంలోని అంశాలు నిరుపయోగం చెయ్యబడ్డాయి. తత్ఫలితంగా కోరుకున్న మార్పులు సాధించబడలేదు" (తాకట్టులో భారతదేశం పేజి:365)

మధ్యతరగతి రైతాంగం భూమికోల్పోయి పేద రైతాంగంగా మారటం, పేదరైతాంగం భూమి హీనులై వ్యవసాయకూలీల సంఖ్యపెరగటం, అదే సమయంలో భూమి పెద్దఎత్తున చేతులు మారి సంపన్నవర్గాల చేతుల్లోకి వెళ్లటమన్న క్రమంలోని కీలక అంశాలను ప్రభుత్వ గణాంకాలే తెలుపుతున్నాయి. పారిశ్రామిక వృద్ధి కుంటినడకన సాగుతూ, ప్రత్యామ్నాయ ఉపాధి లభ్యంకాక వ్యవసాయకూలీలు, పేదరైతాంగం కౌలుచేయటానికి తప్పనిసరిగా పూనుకొనే స్థితి ఏర్పడింది. భూమిపై వత్తిడి పెరిగింది. దీనితో కౌలురేట్లు పెరిగాయి. నూతన ఆర్థిక విధానాలు అమలుకాకముందే "జనశక్తి" నిర్వహించిన సర్వేలో తూర్పుగోదావరి జిల్లాలో కౌలురైతుల దుస్థితి తేటతెల్లమైంది. మొదటి పంట ధాన్యమంతా కౌలుచెల్లింపుకూ, రెండవ పంట ధాన్యం చేతికందితే పెట్టుబడులకూ సరిపోయి, కౌలురైతుకు గడ్డిమాత్రమే మిగిలేంతగా కౌలురేట్లు పెరిగాయి. గడ్డితో పాడిపశువులు పెట్టుకుంటే పాలఅమ్మకంతో వచ్చే ఆదాయంతో ఇల్లుగడపవచ్చన్న ఆశతో కౌలు చేసేస్థితి ఆనాటికే ఏర్పడింది. ఇంతేకాక భూమి కొరకు పోటీపెరిగి భూమి యజమానికి రోజూ లీటరుపాలు అందజేయటం కూడా కౌలు ఒప్పందంలో భాగమైంది.

నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన తర్వాత ఈ పరిస్థితి మరింత తీవ్రరూపం దాల్చింది. ఎగుమతి ఆధారిత అభివృద్ధి వ్యూహంతో అమలుజరిగిన ఈ విధానాలు పారిశ్రామిక రంగంలో పెట్టుబడులనూ, పెట్టుబడుల సాంద్రతనూ పెంచాయి తప్ప ఉద్యోగ కల్పన సాగలేదు. కొన్ని రంగాలలో ఉపాధి తగ్గిపోయింది. చేనేతవంటి సాంప్రదాయక వృత్తులు దెబ్బతినటం త్వరితంకావటంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయి. ప్లాంటేషన్ల పెంపకం, ఆక్వా కల్చరు పెరుగుదలవంటి పరిణామాలు కూడా వ్యవసాయభూమినీ, అందులోని ఉపాధి అవకాశాలనూ తగ్గించాయి. దీనితో ప్రత్యామ్నాయ ఉపాధిలేక గ్రామసీమలలో భూమికోసం వెంపర్లాట పెరిగింది.

అదే సమయంలో ప్రభుత్వ విధానాలు (ఎరువులు, విద్యుత్తు, డీజిలు, విత్తనాలు, సాగునీరు రేట్లను పెంచటం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్టుపై ప్రభుత్వ నియంత్రణను వదలివేసి మార్కెట్టు శక్తులకు స్వేచ్ఛనివ్వటం, ప్రభుత్వ కొనుగోలు సంస్థలను రంగంనుండి తప్పించటం–వీటన్నింటినీ మించి వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడి మదుపును తగ్గించివేయటం) సాగును సంక్షోభంలోకి నెట్టాయి. ఆహార పంటల స్థానంలో రైతాంగాన్ని పరిశ్రమకు బంధించివేసే పంటలను ప్రోత్సహించేందుకు పూనుకోవటం, రైతాంగం ఆ పంటల సాగుకు అలవాటుపడ్డ తర్వాత తన మద్దతును ఉపసంహరించి పరిశ్రమాధిపతుల ముందు నిస్సహాయులుగా ఉంచటం చేసింది. పొగాకు, చెరకు, పామాయిలు, సుబాబుల్ వంటి పంటలలో జరిగిందిదే. తాను సృష్టించిన ఈ సంక్షోభానికి పరిష్కారంగా కాంట్రాక్టు, కార్పోరేటు సాగును ప్రభుత్వం ముందుకు తెచ్చింది. ఈ విధానాల ఫలితంగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి రెండున్నర లక్షలమంది పేద, కౌలురైతాంగం ఆత్మహత్యల పాలబడ్డారు.

దీనితో సాగు దండగమారి, లాభసాటికాదన్న పాలకుల దివాళాకోరు వాదనలకు గురైన రైతాంగం కౌలుకివ్వటం పెరిగింది. ఉన్న భూమికి మరికొంత భూమి తోడయితే పరిస్థితి మెరుగుపడుతుందన్న ఆశతో భూమిలేని, పేద, మధ్యతరగతి రైతాంగం కూడా కౌలుకు తీసుకోవటం పెరిగింది. ఏతావాతా కొన్ని జిల్లాల్లో, కొన్ని పంటలలో కౌలురైతాంగం సంఖ్య 60 నుండి 70 శాతం వరకూ పెరిగింది. సాగునీటి సౌకర్యం ఏర్పడిన జిల్లాల్లోనూ, మెట్టప్రాంతాల జిల్లాల్లో కూడా కౌలురైతుల సంఖ్య పెరిగింది.

ఈ పరిస్థితి కౌలు రైతుల సమస్యను క్లిష్టతరం చేసింది. గ్రామసీమలలో వర్గ వైరుధ్యాలు తీవ్రమై నివురుగప్పిన నిప్పులా వున్నాయి. వ్యవసాయ ఉత్పత్తిలో కౌలురైతుల భాగం పెరిగిపోతూ అర్ధభూస్వామ్య సంబంధాలు (తరువాయి 2వ పేజీలో)

### సంపాదకీయం

## దారిద్ర్య నిర్మూలన పేరిట వంచన

***గత*** ఎన్నికల్లో చంద్రబాబునాయుడు పేదలకు నగదు బదిలీపథకాన్ని ముందుకు తెచ్చాడు. తన కొడుకు లోకేష్ ఇచ్చిన సమాచారాల మేరకు ఈ పథకాన్ని రూపొందించినట్లు చెప్పాడు. ప్రతినెలా అతి పేదవారికి రు. 2000, పేదవారికి రు. 1500, మధ్యతరగతి వారికి రు.1000 కుటుంబ యజమాని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పాడు. దానికోసం నమూనా ఏటిఎం కార్డులు కూడా విడుదల చేసి హడావుడి చేశాడు.

ఈ పథకాన్ని పరిశీలించమని ప్రధాని ప్రణాళికా సంఘాన్ని కోరారు. దీనిపై సంతోష్ మెహతా నివేదిక డిసెంబరులో కేంద్ర ప్రభుత్వానికి అందింది. దీనినమలులోకి తెచ్చేందుకు కేంద్రం సిద్ధమౌతుందనీ, ఏకీకృత గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు ఏర్పరచిన సంస్థ అధ్యక్షుడు నందన్ నీలేంకనీని దీని సాధ్యాసాధ్యాలను పరిశీలించమని కోరినట్లు వార్తలు వచ్చాయి.

వాస్తవానికి ఈ పథకాన్ని 2007లోనే ప్రభుత్వానికి ప్రపంచబ్యాంకు సూచించింది. దేశంలో పేదలకు ప్రతి ఏడాదీ అందజేస్తున్న రూ॥ 2 లక్షల కోట్ల సబ్సిడీ దుర్వినియోగ మవుతున్నదనీ, లాటిన్ అమెరికాలో అమలవుతున్న నగదు బదలీ పథకాన్ని అమలు చేయాలనీ సూచించింది. ఎలాగూ ప్రపంచబ్యాంకు సూచనలు శిరోధార్యం గనుక చంద్రబాబు కోడి తెల్లవారకుండానే కూసింది. ఇక పథక మెవరిదన్న రగడకు అంతుండదు.

ఇంతకీ సంతోష్ మెహతా కమిటీ ఏం చెప్పింది? అధికార మార్పిడి జరిగిన నాటి నుండీ నేటివరకూ దారిద్ర్య నిర్మూలన పేరిట అమలు జరిగిన డజన్ల కొలదీ పథకాలు ఎలా నిరుపయోగమయ్యాయో ఏకరువు పెట్టింది. మధ్యదళారులూ, నేతలూ ఎలా లబ్ధిపొందారో చెప్పింది. వీటిలో తాజాదైన గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కూడా అంతంత మాత్రమేనని తేల్చింది. ఇంతకు ముందు కమిటీల లాగే వైఫల్యాల ఏకరువు తర్వాత దానికి కారణాలు చెప్పకుండానే నగదు బదిలీ పథకాన్ని ప్రతిపాదించింది.

దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన 6 కోట్ల కుటుంబాలున్నాయన్నది తాజా అంచనా. వీటికి నెలకు రూ॥ 2500 చెల్లిస్తే ఒకలక్షా 60 వేల కోట్లు అవుతుంది. మహిళ ప్రసవించినప్పుడు కొంత సొమ్ము; ఆరు నెలలపాటు; పుట్టిన బిడ్డకు పోషకాహారాన్ని అంగన్‌వాడీల బదులుగా నేరుగా కొంతసొమ్ము; యువత నైపుణ్యం పెంచుకొనే శిక్షణ కొరకు నెలనెలా రూ॥ 500 అందజేస్తే మరో రూ॥ 20వేల కోట్లు సరిపోతాయి. ఇప్పుడు అనేక పేర్లతో దేశమంతటా అమలవుతున్న దారిద్ర్య నిర్మూలనా పథకాలన్నింటినీ రద్దు చేసి, వాటికి ఖర్చవుతున్న రూ॥ 2 లక్షల కోట్లు నేరుగా పేదలకంది సద్వినియోగమవుతాయని కమిటీ సూచించింది.

పరోక్షంగా ఇచ్చే సబ్సిడీల కన్నా నేరుగా నగదు బదలీ వల్ల రాజకీయ లబ్ధి అధికంగా వుంటుందన్నది ప్రజాకర్షక పథకాల ద్వారా పాలకులు నేర్చుకున్న అనుభవం. దీని చాటున సబ్సిడీలను ఎంతదిగకోసినా ప్రజలడగబోరని వారి అంచనా. కమిటీ దీనికనువైన సూచనే చేసింది. ఎరువులు, కిరోసిన్, తదితర సబ్సిడీలవల్ల మధ్యదళారులెలా లాభపడుతున్నారో ఏకరువు పెట్టి వాటిని పూర్తిగా ఎత్తివేయవచ్చుననీ సూచించింది. సబ్సిడీలు లేక ధరలు పెరిగినా చేతికొచ్చిన నగదుతో కావాల్సిన దానినే కొనుక్కుంటారనీ, పేదలకు లబ్ధి చేకూరుతుందనీ కమిటీ వాదించింది.

దారిద్ర్య నిర్మూలన పేరిట సాగుతున్న అన్ని పథకాలనూ ఆపివేస్తారు. దారిద్ర్యరేఖ దిగువనున్న కుటుంబాలకు ఆ పథకాల క్రింద ఖర్చవుతున్న నిధులనే పంచుతారు. ఇక, సబ్సిడీలు–డీజిలు, ఎరువులు, విద్యుత్తు, ఆహార ధాన్యాలు మొదలైనవి–అన్నింటికీ మంగళం పాడతారు. వీటికిప్పుడు యిస్తున్న దాదాపు 2 లక్షల కోట్లూ మిగుల్చుకుంటారు.

ఈ సబ్సిడీల తొలగింపు ప్రధానంగా వ్యవసాయ రంగాన్నే ప్రభావితం చేస్తుంది. నగదు బదలీ పథకంలోకి సన్నకారు రైతులు చేరతారని ఊహించుకున్నా, సబ్సిడీ లేని యూరియా పెరిగిన ధరకు కూడా అది సరిపోదు. ఇప్పుడు ఫుడ్ కార్పోరేషన్ విడుదల చేస్తున్న బియ్యం ధర దాదాపు 17 రూ॥లు వుంది. దీని సబ్సిడీ దిగకోస్తే దాని ధర రూ. 20 దాటుతుంది. దీనితో పేదవర్గాలకు ఆహారం కొనుగోలుకు నగదు బదలీ సరిపోదు.

దారిద్ర్య రేఖకు దిగువనున్న జనుల సంఖ్య ప్రభుత్వ గణాంకాలలో పంచ పాడవులెందరంటే మంచంకోళ్ళలా... చందంగా తగ్గిపోతూ వస్తున్నది. అధికార అంచనాలు తగ్గినప్పుడల్లా నగదు బదిలీ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే కసరత్తుతో ప్రజలను తమ చుట్టూ త్రిప్పుకుంటారు. మరోసారి భ్రమలు కల్పించి ప్రజలను సహాయం కోసం ఎదురు చూసే బిచ్చగాళ్లుగా నిరంతరం వుంచే గత పథకాల స్వభావమే నగదు బదిలీలో కూడా కొనసాగుతుంది. దారిద్ర్యం నిర్మూలన కాకపోగా, మరింత పెరుగుతుంది. ప్రభుత్వానికి మాత్రం బడాబూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ ప్రజా ధనాన్ని కట్టబెట్టేందుకు "మిగులు" సొమ్ము దొరుకుతుంది. మార్కెట్టు ధరలపై నియంత్రణ లేనందున బడా వాణిజ్యానికి లాభాలు పెరుగుతాయి. ఏతావాతా త్రిశంకు స్వర్గంలో వుంటున్న మధ్య తరగతి ప్రజల స్థితి పేదరికంలోకి దిగజారుతుంది.

నేటికీ 60 శాతం జనాభా జీవనాధారమైన వ్యవసాయ రంగంలో వృద్ధిరేటు కుంటి నడకన సాగుతుండగా, దానికందిస్తున్న సబ్సిడీలను సాంతం ఎత్తివేయటం రైతుల, వ్యవసాయకూలీల ఆదాయాలను తగ్గించి వేస్తుంది. భూమి యాజమాన్యంలో వున్న వర్గ వ్యత్యాసాన్ని మరింతగా పెంచే దిశగానే ప్రభుత్వ విధాలున్నందున వ్యవసాయరంగ ఆదాయంలో కూడా ధనాఢ్య వర్గపు ఆదాయం పెరుగదల (తరువాయి 2వ పేజీలో)

**కౌలు ...** (మొదటి పేజీ తరువాయి)

రూపంమారి బలీయమవటాన్ని సూచిస్తున్నది. వ్యవసాయ రంగంలోకి నానాటికీ చొచ్చుకు వస్తున్న స్వదేశీ, విదేశీ పెట్టుబడి దీనినే పటిష్టంచేస్తున్నది.

ఈ స్థితిలో దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూపంపిణీ జరిపితేనే తప్ప వ్యవసాయరంగంలో పాలకులు సృష్టించిన సంక్షోభం ముగిసి సమాజ పురోగమనానికి మార్గం ఏర్పడదు. కానీ భారత దోపిడీ పాలకవర్గాలు అలాంటి విప్లవకర సంస్కరణలకు సిద్ధంగా లేవు . ఒక క్రమపద్ధతిలో అత్యంత నెమ్మదిగా సామ్రాజ్యవాదుల, భారత గుత్తపెట్టుబడులకు లాభాల పంటనందించేదిగా వ్యవసాయ రంగాన్ని పరివర్తన చెందించేందుకు పూనుకున్నాయి. తాము సృష్టించిన సంక్షోభానికి పరిష్కారంగా ఈ క్రమాన్నే సూచిస్తూ అమలు జరుపు తున్నాయి. కా॥టి.ఎన్.చెప్పినట్లు, నెమ్మదిగా సాగే ఈ క్రమం "రైతాంగంపై అంతులేని దోపిడీ పీడనలను పెంచుతుంది. దారిద్ర్యాన్ని పెంచుతుంది. అసంతృప్తితో గ్రామ సీమలలో ఉద్రిక్తతలూ, వర్గవైరుధ్యాలూ పెరుగుతాయి. భూమి తగాయిదాల్లో దళితులపై హత్యాకాండ పెరుగుతుంది. ఈ పరిణామాన్నీ కమ్యూనిస్టులు హర్షించరు. భూస్వామ్య విధాన సంపూర్ణ రద్దుకై పోరాడే రైతాంగానికి అండదండలివ్వటం ద్వారా ఈ నెమ్మదిగా సాగే క్రమ పరిణామాన్నీ వ్యతిరేకించటం కమ్యూనిస్టుల విద్యుక్త ధర్మం".

## ముసాయిదా బిల్లు

ఈ నేపథ్యంలోనే కౌలురైతులకు గుర్తింపు కార్డులనిచ్చే బిల్లును పరిశీలించాలి. ఈ బిల్లుప్రకారం రెవిన్యూ యంత్రాంగం ప్రతి ఏడాదీ కౌలుచేస్తున్నరైతులను గుర్తించి ప్రభుత్వ రికార్డుల్లో నమోదుచేసి, వారికి రుణంపొందే అర్హత కార్డులిస్తుంది. ప్రభుత్వ ద్రవ్యసంస్థలనుండి ఈ కార్డువున్న కౌలుదారు పంట రుణాన్ని పొందుతాడు. పంటల బీమానూ, ఇన్‌పుట్ సబ్సిడీనీ, పంటకు జరిగిన నష్టానికి ఇతర పరిహారాన్నీ పొందవచ్చు. అయితే ఈ కార్డు కలిగివున్నందున, భూమిపై కౌలుదారుకు ఎలాంటి హక్కులూ ఏర్పడవు. ఈ కార్డు ఒక సంవత్సరానికే వర్తిస్తుంది. ప్రతి ఏడాదీ దీనిని పునరుద్ధరించుకోవాలి. కౌలుదారీచట్టం క్రింద భూమిపై సాగుహక్కు కలిగినవారికీ, పట్టాదారు పాసుబుక్కు చట్టం క్రిందనున్న వారికీ ఈ కార్డు జారీచెయ్యరు.

బిల్లు తీసుకురావటానికి పూర్వరంగాన్ని ప్రభుత్వం ఇలా వివరించింది : "భూమి కలిగిన వారు ప్రభుత్వ, ప్రవేటు రంగంలో వృత్తినెంచుకుని, సాగువదలివేసి కౌలు కిస్తున్నారు. భూమి రికార్డులలో కౌలుదారుల పేర్లు చేర్చటానికి భూమి యజమానులు ఇష్టపడనందున రెవిన్యూ అధికారులు కౌలుదారులను నమోదు చెయ్యలేక పోతున్నారు. ఫలితంగా కౌలుదారులు బ్యాంకులనుండి రుణం పొందలేకపోతున్నారు; పంటకు బీమాసౌకర్యం పొందలేకపోతున్నారు. ప్రత్యామ్నాయంగా ప్రైవేటు వడ్డీవ్యాపారుల నాశ్రయించి అప్పుల ఉచ్చులో కూరుకు పోతున్నారు. దీనిని పరిశీలించేందుకు కోనేరు రంగారావు కమిటీ నియమింపబడింది. 2007లో కమిటీ సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. కౌలుదారులకు భూమిపై హక్కు కల్పించకుండా పంటపై హక్కును కల్పించవలసిన అవసరముందని ప్రభుత్వం గుర్తించింది. కనుక ఈ చట్టాన్ని ప్రతిపాదిస్తున్నది." ఈ మొత్తం క్రమంలో కౌలుదార్లను గుర్తించి, రిజిస్టరుచేసి కౌలుదారీ చట్టం కల్పించిన పరిమిత హక్కులనైనా అమలుచెయ్యాల్సిన చట్టవిహిత బాధ్యత తనకున్నదన్న అంశాన్ని ప్రభుత్వం చర్చలోకిరాకుండా ప్రక్కనుంచింది.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి లభ్యమైనందున సాగును వదలివేస్తున్నారనటం పూర్తిగా సరికాదు. రైతు బిడ్డలలో కొందరికి మాత్రమే ఇలాంటి ఉపాధి ఏర్పడుతున్నది. ఉపాధి ఏర్పడిన ఆ కొద్దిమంది తండ్రులూ, అలా ఏర్పడని అత్యధిక రైతుకుటుంబాలూ సాగులోనే వుండాల్సివుంటుంది; వుంటున్నాయి. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ విధానాలవల్ల సాగు లాభసాటి కాకుండాపోయింది. ప్రతి ఏడాదీ నష్టాలు పేరుకుంటూపోయి కొన్నేళ్ళకు వారి ఆస్తుల విలువను మించిపోయాయి. దీనితో పెరిగిన కౌలు పుచ్చుకుని ఇతరులకు కౌలుకివ్వటమే మంచిదన్న నిర్ణయానికి చిన్నరైతులు కూడా వచ్చేపరిస్థితి ఏర్పడింది. సమస్య మూలాన్నే ప్రభుత్వం కప్పిపుచ్చింది.

రికార్డుల్లో నమోదు కానందున బ్యాంకులనుండి రుణం పొందలేక అప్పుల ఊబిలో కూరుకుపోయారనీ, వారికి బ్యాంకు రుణాలందిస్తే సమస్య తీరి పోతుందన్నట్లు ప్రభుత్వం వాదిస్తున్నది. ఈ వాదనతో ప్రభుత్వం రెండు వాస్తవాలను కప్పిపెడుతున్నది. ఒకటి: కొనబోతే కొరివి-అమ్మబోతే అడవి చందంగా రైతాంగం పరిస్థితి వుంది కౌలురైతాంగంతో సహా. సాగుకు అవసరమైన ఉత్పాదకాలన్నింటి ధరలనూ ప్రభుత్వం పెంచివేస్తున్నది. దీనితో సాగుచేయటానికి పెట్టుబడి మదుపుకు ద్రవ్య అవసరం యిబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. పంట అమ్ముకునేవరకూ చేతిలో డబ్బాడని రైతాంగం రుణపరపతి సౌకర్యంకోసం పరుగులు పెట్టాల్సివస్తుంది. అదను దాటిన తర్వాత రుణమందినా ప్రయోజనముండదు. ఇంతకీ అప్పు చేసి పంటవేస్తే, అమ్మకంలో న్యాయమైన ధర రాకుండా ప్రభుత్వ విధానాలే చేస్తున్నాయి. దీనితో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కాగా సంస్థాగత రుణాలు అందకపోవటమే కారణంగా ప్రభుత్వం కుదించివేసింది.

## ఏమాత్రం చాలని రుణ వితరణ

రెండు: బ్యాంకులందజేస్తున్న సంస్థాగత రుణ సౌకర్యం రైతాంగపు రుణ అవసరాలలో 20శాతాన్ని ఎప్పుడూ మించలేదు. ఇందులో సగం స్వల్పకాలిక (పంట) రుణంకాగా, మిగిలినది దీర్ఘకాలిక రుణం (యంత్రాలు, బోర్లు, మోటార్లు). పంటరుణాలుపోగా మిగిలిన రుణ అవసరాలకోసం రైతాంగం ప్రవేటు వడ్డీవ్యాపారుల మీదే ఆధారపడుతున్నారు. ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఈ రెండు వాస్తవాలను గమనంలో వుంచుకుంటే రైతాంగం ప్రైవేటు వడ్డీవ్యాపారంపై ఆధారపడకుండా తీసుకోవాల్సిన చర్యలు తెలుస్తాయి. మొదటిది: రైతాంగ పంట రుణాల అవసరాన్ని మొత్తంగా సంస్థాగత రుణ సంస్థలు తీర్చేవిధంగా బ్యాంకు, సహకార సంఘాలకు ద్రవ్యవనరులు సమకూర్చటం. ఇది చేయకపోగా, కేంద్రప్రభుత్వం ఇతర రుణాలను కూడా ప్రాధాన్యతా రంగ రుణాలుగా వ్యవసాయానికిచ్చిన రుణాలుగా చూపుకునే అవకాశం బ్యాంకులకిస్తున్నది. అంటే రైతాంగానికిస్తున్న రుణమొత్తం అంకెలలో పెరిగినట్లు కన్పించినప్పటికీ, నానాటికీ పెరుగుతున్న రైతాంగ రుణ అవసరాల్లో 18-20శాతం మధ్యనే వుంటూవస్తున్నది.

ఇక ఉపాధికల్పన పెరగకపోయినా పరిశ్రమలకు ప్రతిబడ్జెట్టులో లక్షల కోట్ల రూపాయలు కట్టబెడుతున్న ప్రభుత్వం యిప్పటికీ 60శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయరంగానికిస్తున్న రాయితీలను మాత్రం భరించలేకపోతున్నామంటూ దిగకోస్తున్నది. ఫలితంగా ఉత్పాదకాల ధరలు పెరిగి రైతాంగ రుణఅవసరాలు పెరుగుతున్నాయి. అలాగే వ్యవసాయ ఉత్పత్తులకు న్యాయమైన ధర విషయంకూడా దోపిడీ మార్కెట్టు శక్తులను అదుపుచేయకపోగా, మిగిలిన ఆంక్షలను ఎత్తివేయటమే పరిష్కారంగా ప్రచారం చేస్తున్నది.

వాస్తవ పరిస్థితిని దాచిపెట్టి, అరకొర చర్యలతో కంటితుడుపు చర్యలను చేపడుతున్నది తప్ప రైతాంగాన్ని సంక్షోభంనుండి బయటపడవేసే చర్యలకు పూనుకోవటంలేదు. కనుకనే రైతాంగం, వారిలో భాగం కౌలురైతాంగం కష్టాల కాపురం చేయాల్సివస్తున్నది. ఇతర రైతాంగంగానికందుతున్న పంట రుణాలు కౌలు రైతులకందకపోవటమే వారికెదురౌతున్న అదనపు సమస్య.

ప్రతిపాదిత చట్టం ఈ విషయంలో తీసుకున్న చర్యలేమీ లేవు. రుణ అర్హత కార్డులందించిన తర్వాత కౌలుదారులకు పంటరుణాలందజేసేందుకు అదనపు నిధులంటూ ఏమీ వుండవు. ఇప్పటికందజేస్తున్న నిధుల మొత్తంనుండే దీనికీ యిస్తారు. కౌలు రైతులకు రుణపరపతి సౌకర్యం విస్తరించినందున పెరిగే రుణ వితరణ అవసరాలకు తగినవిధంగా వ్యవసాయ రుణరంగానికి కేటాయింపులు పెంచరు. ట్యాంకునీళ్లు అవసరమైనచోట బిందెడు మాత్రమే ఇస్తూ, ఇప్పుడు ఆ బిందె నీళ్లలోంచే ఒక గరిటెడు నీళ్లు కౌలురైతుల కిస్తారన్నమాట.

ఈ బిల్లువల్ల లబిపొందే కౌలుదారులెందరు? కౌలుదారీచట్టం క్రింద గుర్తింపు పొందిన వారికి ఈ కార్డుయివ్వరు. వీరిసంఖ్య అతి తక్కువ. బిల్లులో కౌలురైతు బదులు "అనుమతిపొందిన సాగుదారు" అన్న పదాన్ని వాడారు. ఇతరుల భూమిని లిఖిత పూర్వకంగా లేక మౌఖికంగా అనుమతిపొంది, కౌలు చెల్లింపు లేదా పంటలో పాలు చెల్లింపు, లేదా ఇతర పద్ధతిలో చెల్లింపుకు అంగీకరించి ఒక ఏడాది సాగుచేసేవారని 'అనుమతి పొందిన సాగుదారు" అని నిర్వచించారు. మౌఖిక అనుమతిని నిర్ధారించేదెలా? మౌఖిక అనుమతి ఇచ్చినట్లు భూమి యజమాని అంగీకరిస్తాడా? రెవిన్యూ అధికారి మౌఖిక అనుమతి ఇచ్చినట్లు నిర్ధారించినా యజమాని దానిని ప్రశ్నించడా? వంటి లీగల్ చిక్కులకు బిల్లులో సమాధానం లేదు.

అయితే ఈ నిర్వచనం ప్రకారం దేవాలయ భూమి కౌలుకు చేస్తున్న వారందరూ రుణ అర్హతకార్డు పొందే అవకాశం వుంది. దేవాలయ యాజమాన్యం అంటే పరోక్షంగా ప్రభుత్వం కౌలుదారులతో లిఖిత పూర్వకంగా కౌలుఒప్పందం చేసుకుంటుంది. దేవాలయ భూముల కౌలుదార్లకు ఇది వర్తిస్తుందన్న అంశాన్ని బిల్లులో పేర్కొనలేదు. కౌలుదార్లుగనుక బ్యాంకులు వీరికి ఇంతవరకూ రుణాలివ్వటంలేదు. వీరి అంశం బిల్లులో స్పష్టంగా పేర్కొనాల్సిన అవసరముంది.

పట్టాదారు పాసు పుస్తకాల చట్టం 1971 ప్రకారం నమోదైన రైతులకు ఈ కార్డులివ్వరు. కొంత భూమికలిగిన చిన్నరైతులు మరికొంత భూమిని కౌలుకు తీసుకుంటే, తన స్వంత భూమికి పాసుబుక్కు వుందిగనుక కౌలుదారుగా ఈ కార్డు యివ్వరు. పాసుబుక్కు ద్వారా తన భూమికి తప్ప, తాను కౌలుచేస్తున్న భూమికి పంటరుణంకానీ, బీమాకానీ అందదు. మొత్తం కౌలుదారులలో వీరిసంఖ్య గణనీయంగానే వుంది. వీరందరూ ఈ చట్టం నుండి మినహాయింపబడతారు.

ఇక మిగిలిన కౌలురైతులకే కార్డులిస్తారు. వీరి పేర్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలి. ప్రతిఏడాదీ ఇది జరగాలి. బిల్లులో అనేకచోట్ల ఈ కార్డు భూమిపై ఎలాంటి హక్కు యివ్వదు అని చెప్పినప్పటికీ, భూయజమాని అంగీకరించకుండా కౌలుదారుల పేర్లు ఎలా నమోదు చేస్తారన్న దానికి సమాధానం లేదు. అభిప్రాయసేకరణ సమావేశాల్లో ఈ ప్రశ్న అడిగితే, వారి అనుమతి అవసరంలేదు నమోదు చేస్తామనే సమాధానం చెప్పారు తప్ప కౌలుకిచ్చానని యజమాని చెప్పకుండా సాధ్యపడదన్నది స్పష్టమే. ఈ సమావేశాల్లో రైతులకు ప్రతినిధులుగా వున్నవారందరూ కౌలుదారీ రక్షణ చట్టాన్ని రద్దుచేయకుండా నమోదుకు అంగీకరించబోమని చెప్పారు. రైతులనుండి వస్తున్న ఈ వ్యతిరేకతే కౌలురైతులను గుర్తించేందుకు ప్రధాన ఆటంకంగా వుందని కూడా ప్రభుత్వ అధికారులు అంటున్నారు.

ఇంతకు ముందు వివరించినట్లుగానే కౌలుదారీ చట్టాలు చేసినా ఎలాంటి ప్రయోజనమూ నెరవేరలేదు. చట్టం యిచ్చిన కొద్దిపాటి హక్కును కూడా కోరలేని స్థితిలో కౌలుదార్లు వున్నారు. ఈ నామకార్థపు చట్టాన్ని కూడా తాను కౌలుదారుగా గుర్తించినా అతనికెలాంటి హక్కులుండవంటూ నీరు గార్చేందుకు ప్రభుత్వం పూనుకుంది. ప్రజాభిప్రాయసేకరణ సమావేశాల్లో రైతుసంఘాల నాయకులడుగుతున్నట్లు కౌలుదారీ చట్టాన్ని రద్దుచేసినా, చేయకపోయినా, ఇంతకు ముందు పేర్కొన్న ప్రణాళికాసంఘ సమీక్ష చెప్పినట్లు "చట్టమిచ్చిన హక్కుల గురించి ఉదాసీనవైఖరి వహించే స్థితికి కౌలుదార్లను నెట్టివేసింద"న్న పరిణామం మరొకసారి, మరొకస్థాయిలో పునరావృతమౌతున్నది. ఇది ఇప్పటికే గ్రామసీమలలో వున్న వర్గవ్యత్యాసాలను మరింతగా పెంచివేసి, పైపైన కన్పించే ప్రశాంతత మాటన వర్గవైరుధ్యాలను పదునెక్కిస్తుంది.

ఈ పర్యవసానాల్ని అలా వుంచితే, ఈ బిల్లు చట్టమైతే కౌలుదారులకెంత లబ్ధికలిగిస్తుందన్నది ప్రశ్నార్థకమే. పరిమిత హక్కుల నిచ్చిన కౌలుదారీ చట్టవే కౌలుదారులకు రుణసౌకర్యం కల్పించేందుకు అడ్డంకిగా వున్నట్లు చిత్రించటం, ఆ పరిమిత హక్కులను కూడా అడగలేని కౌలుదారుల దుస్థితిని కొనసాగించటం అన్న ప్రయత్నం పేదవర్గాలు సాధించుకున్న హక్కులను పూర్తిగా తిరగతోడే నయాఉదారవాద విధానాలలో (భూగరిష్ట పరిమిత, పట్టణ భూగరిష్ట పరిమితి చట్టాలు) భాగమే యిది. ఈ విషయంలో కౌలుదారుల హక్కులకు హానికలిగించే ప్రతిపాదనలకు అనుకూల వాతావరణం కల్పించటంలో ప్రభుత్వ ప్రయత్నాలు విజయం పొందుతున్నాయనే చెప్పాలి.

## రుణ వితరణకు కసరత్తు

అభిప్రాయసేకరణ సమావేశాల్లో వ్యక్తమైన సూచనల ప్రకారం ముసాయిదా బిల్లును సవరించే పనిలో వున్నట్లు ప్రభుత్వం చెప్పుకుంటున్నది. ఒక దిన పత్రికలో వచ్చిన వార్త ప్రకారం భూయజమానులకూ కౌలుదార్లకూ మధ్య వివాదాల్లో కోర్టులకు వెళ్లకుండా ముసాయిదాలో కొన్ని చర్యలు తీసుకుంటున్నారట. కార్డు మంజూరుపై భూయజమాని అభ్యంతరాలనూ, దానిపై వచ్చే వివాదాలను పరిష్కరించేపని యమ్మార్వోలకు యిస్తారట. దీనికోసం మండల స్థాయిలో వివాద పరిష్కార (ఆర్బిట్రేషన్) కమిటీలను వేస్తారని తెలుస్తున్నది. అంతిమంగా బిల్లులోని అంశాలెలా వుంటాయన్నది వేచి చూడాల్సివున్నా, దాని దిశ కౌలుదారీ చట్టాన్ని పనికిరాని కాగితంగా మిగిల్చే వైపుగా సాగుతుందన్నది స్పష్టమే.

ఎలాంటి హామీలేకుండా గుర్తింపుకార్డు పొందిన కౌలుదారులకు లక్షరూపాయలవరకూ రుణాన్ని అందజేసేందుకు ఈ బిల్లులో నిబంధనలను రూపొందించే కసరత్తు ప్రభుత్వం చేస్తున్నట్లు పత్రికల్లో వస్తున్న సమాచారం తెలుపుతున్నది. ఆచరణలో ఇదెంత వరకూ అమలులోకి వస్తుందన్నది పరిశీలించాల్సి వుంటుంది. అయితే ఈ అర్హత కార్డులాధారంగా బ్యాంకు రుణాల వితరణ పద్ధతి ఏమిటన్నది కీలకమైన ప్రశ్న.

డ్వాక్రా గ్రూపుల్లాగా, కొన్ని రైతుమిత్ర గ్రూపుల్లాగా జాయింటు లయబిలిటీ గ్రూపులుగా కౌలుదార్లను ఏర్పాటుచేసి బ్యాంకు రుణాలు అందజేస్తామని జిల్లా అధికారులు చెబుతున్నారు. లక్షా అరవైవేలమంది కౌలుదారులను 30వేల గ్రూపులుగా ఏర్పాటుచేశామనీ, వీటిలో 6వేల గ్రూపులకు ఇప్పటికే బ్యాంకులు రుణాలందజేశాయనీ కృష్ణాజిల్లా జాయింటు కలెక్టరు ప్రకటించారు. కౌలుదార్ల గుర్తింపు దరఖాస్తులను పంపిణీ చేస్తున్నామనీ, వాటిని పరిశీలించి ఏప్రిల్ నాటికి కార్డుల జారీ పూర్తిచేస్తామనీ, మే నెలలో బ్యాంకులకు సమాచార మందించి జూన్ నాటికి రుణాలందేట్లు చూస్తామని ఆయన తెలిపారు.

ఈ బిల్లు చట్టంగా మారటానికి చాలా సమయం పడుతుంది. అయినా గుర్తింపు కార్డుల జారీ, గ్రూపుల ఏర్పాటు, కొంతమేరకు రుణవితరణ పై వార్తనుబట్టి సాగుతున్నట్లు తెలుస్తున్నది. అంటే చట్టం లేకపోయినా కౌలుదార్లకు బ్యాంకు రుణాలందజేసే పద్ధతి రూపొందిందన్నమాట. దీని నమలుజరుపుతానంటూనే బిల్లును ప్రభుత్వం ఎందుకు ప్రతిపాదించినట్లు? ఈ రుణ వితరణ పద్ధతిపట్ల అనేక సందేహాలు తలెత్తు తున్నాయి.

డ్వాక్రా గ్రూపులకూ, బ్యాంకులు ఆశించిన మేరకు రుణవితరణ చేయలేదు. దీనికి పరిష్కారంగా డ్వాక్రా గ్రూపులకు రుణాలంజేసేందుకు బ్యాంకులు వాణిజ్య ఏజంట్లను నియమించుకునేందుకు రిజర్వుబ్యాంకు అనుమతించింది. ఈ వాణిజ్య ఏజంటు రూపమెత్తిన సూక్ష్మరుణ సంస్థలు ఊడలు దింపి విస్తరించాయి. వీటిపై మాలెగావ్ కమిటీ చేసిన సూచనల ప్రకారం బ్యాంకులు వీటికిచ్చే రుణాలను ప్రాధాన్యతారంగ రుణాలుగా గుర్తించాలి; వాటి రుణాల్లో 75శాతం ఉత్పత్తి కార్యకలాపాలకే యివ్వాలి. ఒక క్రమంలో కౌలురైతులకు రుణవితరణలో సూక్ష్మరుణ సంస్థలకు స్థానం కల్పించబోతున్నారా అన్న సందేహం కలుగుతున్నది. అదే జరిగితే వచ్చే విపరిణామాలు తెలిసినవే.

అలా కాకుండా, ఆర్భాటంగా ఏర్పాటుచేసి, కౌలురైతులకు ఆశలు కల్పించి, వారిని రెవిన్యూ యంత్రాంగం చుట్టూ త్రిప్పుకుని, రాజకీయ లబ్ధిపొందటానికే పరిమితం చేస్తారా? కాలక్రమంలో ఉదాశీనతతో ఆ గ్రూపులను కూడా ప్రయోజన రహితంగా మార్చుతారా? ఈ ప్రశ్నలకు అంతిమ రూపంలో బిల్లు బయటకు వచ్చేవరకూ సమాధానాలు రావు.

ఏది ఎలా జరిగినా, కౌలురైతాంగాన్ని మరో విషవలయంలోకి నెట్టేందుకు మరో ప్రదర్శనాత్మక చట్టానికీ, తద్వారా భ్రమలు కల్పించడానికీ కసరత్తు సాగుతున్నదేతప్ప కౌలురైతాంగం, అలాగే సాధారణ రైతాంగం, ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవటం లేదన్నది స్పష్టం.

**- ప్రశాంత్**

**దారిద్ర్య ...** (మొదటి పేజీ తరువాయి)

హెచ్చిపోతూ రైతాంగపు ఆదాయం తరిగి పోతుంది. నిత్యమూ దారిద్ర్యాన్ని పెంచుతున్న అర్ధఫ్యూడల్ సంబంధాలను రద్దుచేసి భూపంపకం జరపకుండా, ఆ దారిద్ర్యాన్ని పెంచే విధానాలనే ప్రభుత్వం అనుసరిస్తున్నది. ఫలితంగా పారిశ్రామిక రంగం కూడా కునారిల్లి, ఉపాధి కల్పించలేని దుస్థితిలో వుంది. ఈ దారిద్ర్యానికి మూలకారణాన్ని తొలగించకుండా చేపట్టే దారిద్ర్య నిర్మూలనా పథకాలన్నీ నిష్ప్రయోజనమన్నదే గత అనుభవం. ఆశాంతితో ఉడికిపోతున్న సామాన్య ప్రజలను ఆశల పందిళ్లతో పోరాట పంథా చేపట్టకుండా మళ్లించే లక్ష్యంతోనే ఈ పథకాలు అమలుచేస్తున్నారు. కనుకనే పేర్లుమారినా, రూపాలు మారినా ఈ పథకాలేవీ పాలకులు నమ్మబలుకు తున్నట్లు దారిద్ర్య నిర్మూలనా సాధనాలుగా ఎంతమాత్రమూ నిలవవు. ✶




రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)
**రాష్ట్ర మహాసభల సావనీర్ - 2010**
వెల : రు. 30/-
ప్రతులకు : **మైత్రీ బుక్ హౌస్**
28-9-1, జలీల్‌వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ-2

# సూడాన్ చమురు వనరులపై ఆధిపత్యం కొరకు రక్తపాతం




**సూడాన్** దేశంలో జనవరి నెలలో రిఫరెండం జరిగింది. ఫలితంగా దక్షిణ సూడాన్ త్వరలో స్వతంత్ర దేశంగా ఏర్పడాల్సివుంది. ఈ ఎన్నికల ఫలితాలు వెలువడగానే అమెరికా అధ్యక్షుడు ఒబామా "ఇది దీర్ఘకాలంగా వున్న స్వయం నిర్ణయాధికారానికి అనుగుణ్యమైన చారిత్రక ఓటు" అనీ, "ప్రజాస్వామ్యం న్యాయంవైపు ఆఫ్రికా ప్రయాణంలో ముందడుగ"నీ కీర్తించాడు. ఈ పరిణామాన్ని జాతుల స్వయం నిర్ణయాధికారం కొరకు పోరాటంగా చిత్రిస్తున్నారు. రిఫరెండంను శాంతి ప్రదాతగా చూపుతున్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు సామ్రాజ్యవాదుల నోటవస్తున్న ఈ పొగడ్తల అసలు అర్థం తెలియాలంటే సూడాన్ చరిత్రను పరిశీలించాలి.

మానవ సమాజ అభివృద్ధిలో వెనుకబడిన ఆఫ్రికాలో ఆదీవాసీ నుండి ఫ్యూడల్ సామాజిక ఆర్థిక వ్యవస్థలున్న సమయంలో యూరపునుండి ఆఫ్రికా ఖండంలోకి వలసవాదులు ప్రవేశించారు. వలసాధిపత్యాన్ని నెలకొల్పుకునేందుకూ, కాపాడు కునేందుకూ విభజించి - పాలించు సూత్రాన్ని అమలుజరిపారు. ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాలను తమ ప్రభావిత, ఆధీన ప్రాంతాలుగా విభజించుకున్నారు. ఆ విధంగా ఆఫ్రికాలో 50పైగా దేశాలు ఏర్పడ్డాయి. వీటిమధ్య ఏర్పరిచిన సరిహద్దులను కుట్రపూరితంగా వలస పాలకులు రుద్దారు. దేశం లోపలా, సరిహద్దుల వెంటా జాతులమధ్య వైషమ్యాలు రగిల్చి, యుద్ధాలను రెచ్చగొట్టి రక్తపాతంలో ముంచి తమ వలస దోపిడీ ఆధిపత్యాలను సాగించారు. రెండవ ప్రపంచయుద్ధం ముగిసిన తర్వాత ప్రవేశించిన అమెరికా మిగిలిన సామ్రాజ్యవాదులతో కుమ్మక్కు-పోటీపడి తన ఆధిపత్య స్థాపనకు పూనుకుంది. పాత వలస పాలకులను నెట్టివేసి తన ఆధిపత్య స్థాపనకు జాతులమధ్య భాతృహత్యా యుద్ధాలను రెచ్చగొట్టే విధానాన్ని పాటించింది. సామ్రాజ్యవాద ఆధిపత్య స్థాపనకు సాగిన రక్తపాతంతో ఆఫ్రికా దేశాల ఆధునిక చరిత్ర నిండిపోయింది.

1956లో స్వాతంత్ర్యం పొందిన నాటినుండీ సాగిన జాతి వైరాలతో సూడాన్‌లో 20 లక్షలమంది ప్రాణాలు కోల్పోయారు. 40 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. మూడుతరాల బిడ్డలు శరణార్థి శిబిరాలలోనే పుట్టారు; జీవిస్తున్నారు; మరణిస్తున్నారు. అయినా ప్రజలకు శాంతి కనుచూపుమేరలో లేదు. శాంతిని తెస్తుందన్న రిఫరెండంకూడా ఎండమావిగానే వుంది. రిఫరెండం ఫలితాలు వెల్లడైనా ఉత్తర, దక్షిణ భాగాలమధ్య ప్రతిపాదిత సరిహద్దు వెంట సాగిన ఘర్షణల్లో రెండు రోజుల్లో 80మంది మరణించారు. బ్రిటిషు వలస పాలకులు ఒక తెగను మరొక తెగపై రెచ్చగొట్టే విధానాన్నే అనుసరించారు. అమెరికా అదే విధానాన్ని అనుసరిస్తున్నది.

## స్థూల చరిత్ర

క్రీ.పూ. 8000 ఏళ్లనాటికే మానవులు నివసించిన ఆధారాలు లభ్యమయ్యాయి. క్రీ.పూ 2000 నాటి నాగరిక ఆవాసాలు బయటపడ్డాయి. యూరపునుండి క్రిస్టియన్లు, పశ్చిమాసియా నుండి అరబ్బులూ సూడాన్‌కు తరలివచ్చారు. 19 శతాబ్దం ప్రారంభంవరకూ తెగల అమాయక జీవనం సాగింది. నల్లజాతి ప్రజలూ, అరబ్బులు, వందలాది ఆదివాసీ తెగలూ, ముస్లిం, క్రిస్టియన్, ఆదివాసీ మత విశ్వాసాలూ కలగలిసిపోయి జీవించారు. 1821లో సూడాన్ ఉత్తర భాగాన్ని ఈజిప్టు ఆక్రమించుకుంది. దీనితో పాటే బానిన వ్యాపారం మొదలైంది. 1881లో ముస్లిం నాయకుడు మహమ్మద్ ఇబ్ అబ్దుల్లా తనను దూతగా చెప్పుకుని ఈజిప్టు పాలనపై పోరాడాడు. 1885లో ఖార్టూమ్‌ను స్వాధీనం చేసుకుని. ఈజిప్టు పాలనను అంతం చేశాడు. అబ్దుల్లా కొద్ది సంవత్సరాల్లోనే మరణించినా, అతను స్థాపించిన మెహదీ పాలన 1898 వరకూ సాగింది. ఆ ఏడు ఈజిప్టుతో కలిసి బ్రిటన్ సూడాన్‌పై యుద్ధంచేసి ఆక్రమించుకుంది. ఈజిప్టు-బ్రిటన్‌ల సంయుక్త పాలన అని పేరు మాత్రమే తప్ప మొత్తం పరిపాలనంతా బ్రిటన్ సాగించింది.

బ్రిటీషు వలన పాలనకు వ్యతిరేకంగా సూడాన్ ప్రజలు పోరాడారు. ఈజిప్టు, సూడాన్‌లు కలిసి ఒకే రాజ్యంగా ఏర్పడాలని వారు కోరారు. నైలునదీ పరీవాహక ప్రాంతంపై ఆధిపత్యం పోతుందని బ్రిటన్ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంటూ వచ్చింది. 1914లో హుస్సేన్ కమాల్ రాజు ఈజిప్టు-సూడాన్ రాజ్యాన్ని ప్రకటించారు. అయినప్పటికీ పరిపాలనంతా బ్రిటన్ చేతుల్లోనే వుంటూ వచ్చింది.

1952లో ఈజిప్టు విప్లవంతో రాచరికం రద్దయింది. 1953లో అబ్దుల్ నాజర్ అధ్యక్షుడయ్యాడు. సూడాన్‌పై బ్రిటీషు ఆధిపత్యం తొలగాలంటే సూడాన్‌పై ఈజిప్టు సార్వభౌమత్వాన్ని వదులుకోవటమే మార్గమని ఆయన భావించాడు. నాజర్ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు బ్రిటన్ మదేహి రాజవంశ వారసుడిని సమర్థించి, అతనిని సూడాన్‌కు అధిపతిగా చేసి తన పాలన నిలుపుకోవాలని చూసింది. అయితే వారసుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్‌కు ఈజిప్టు నెదరించేంత శక్తిలేకపోవటంతో బ్రిటన్‌కు మరో మార్గంలేక సూడాన్ స్వయం పాలనకు అంగీకరించింది. 1954లో ఈజిప్టు, బ్రిటన్‌లు ఒప్పందం చేసుకుని సూడాన్‌కు స్వాతంత్ర్యమిచ్చాయి. 1956 జనవరి 1న సూడాన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. ఇస్మాయిల్ అల్ అజారీ మొదటి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యాడు.

ఉత్తర సూడాన్‌లో ముస్లింలు, అరబ్బులు ఎక్కువ. ఈజిప్టుతో సన్నిహిత సంబంధాలుంటాయి. దక్షిణ సూడాన్‌లో క్రిస్టియన్‌లు, వివిధ ఆదివాసీ తెగలు ఎక్కువ. మలేరియా వ్యాధి వ్యాపించకుండా నిరోధించటమన్న పేరిట దక్షిణ సూడాన్‌లోని ప్రజలు 10వ అక్షాంశరేఖ దాటి ఉత్తరంగా వలస రాకూడదనీ, అలాగే ఉత్తర సూడాన్ ప్రజలు 8వ అక్షాంశరేఖ దాటి దక్షిణంగా వలసపోకూడదనీ 1924లోనే బ్రిటన్ చట్టాన్ని చేసింది. ఆ విధంగా ఉత్తర, దక్షిణ ప్రాంతాలమధ్య విభజనను పాటించింది. ఆ విధంగా ఆదివాసీ తెగలలో క్రిస్టియన్ మతాన్ని వ్యాపింపచేస్తూ, ముస్లిం మతం దక్షిణానికి రాకుండా నిరోధించింది. భవిష్యత్తులో జాతులమధ్య వైరానికి బీజాలు వేసింది.

ఉత్తర ప్రాంతం వారు ఆధిపత్యం నెరపుతారన్న దక్షిణ ప్రాంత వాసులు భయాలను రెచ్చగొట్టి, దక్షిణ సూడాన్‌కు స్వతంత్రం కావాలన్న డిమాండును బ్రిటన్ ప్రోత్సహించింది. స్వాతంత్ర్యానికి ముందు 1953లోనే ఉత్తర, దక్షిణాల మధ్య ఘర్షణలు సాగాయి. అవి 1972 వరకూ అంతర్యుద్ధంగా సాగాయి. 1972లో ఒక ఒప్పందం కుదిరి దక్షిణ సూడాన్ స్వయంపాలనా ప్రాంతంగా ఏర్పడింది.

సైన్యంలో కమ్యూనిస్టు, సోషలిస్టు భావాలున్న అధికారులు కల్నల్ గఫార్ మహమ్మద్ నిమైరీ నాయకత్వంలో 1969లో అధికారాన్ని కైవశం చేసుకున్నారు. సూడాన్‌ను సోషలిస్టు దేశంగా ప్రకటించారు. దక్షిణ ప్రాంతానికి స్వయంపాలన యిచ్చాడు. అయితే త్వరగానే ప్రభుత్వంలోని కమ్యూనిస్టులను తొలగించాడు. మరో ప్రక్క మతవాదులకూ దూరంగా వున్నాడు. 1985లో సైనిక తిరుగుబాటు, దాన్ని వెన్నంటి జరిగిన ఎన్నికలతో ప్రభుత్వం ఏర్పడింది. ఇదెక్కువ కాలం నడవలేదు. 1989లో సైనిక తిరుగుబాటు జరిపి కల్నల్ ఒమర్ అల్ బషీర్ ప్రభుత్వాధిపతి అయ్యాడు. ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించాడు. రాజకీయ పార్టీలను నిషేధించాడు.

## ఆధిపత్యం కొరకు సామ్రాజ్యవాదుల పెనుగులాట

రెండు దశాబ్దాలపాటు అల్ బషీర్ నిరంకుశపాలన సాగింది. ఈ కాలంలో సూడాన్‌లో రెండు అంతర్యుద్ధాలు సాగాయి. నైరుతీ ప్రాంతంలోని ఆదివాసీ తెగలను పొరుగునున్న ఛాద్ దేశ ప్రభుత్వం, ఫ్రాన్సు రెచ్చగొట్టడం, అల్‌బషీర్ ప్రభుత్వ నిర్బంధం, ముస్లిం ఛాందసవాద శక్తుల హింసాకాండ చెలరేగాయి. అమెరికా దీనికి డాఫుర్ మారణకాండ అని పేరుపెట్టింది. సూడాన్‌లోని చమురు వనరులన్నీ దక్షిణ ప్రాంతంలోనే వున్నాయి. వీటిపై ఆధిపత్యంకోసం దక్షిణ సూడాన్ స్వతంత్ర డిమాండును అమెరికా ప్రోత్సహించింది. అమెరికా అధ్యక్షుడు జిమ్మికార్టర్ సహాయం పేరిట జోక్యం చేసుకునే విధానాన్ని ప్రారంభించాడు. డాఫుర్ కల్లోలం, దక్షిణాన తిరుగుబాటు వల్ల సహాయం అందించటం సాధ్యం కాలేదంటూ ఆయుధేతర సహాయాన్ని సాగనివ్వాలని ఐరాసతో తీర్మానం చేయించింది. ఈ ముసుగులో సూడాన్ ప్రజావిముక్తి సైన్యమనే దానికి అమెరికా ఆయుధాలు చేరవేసింది.

ఇటీవల వికీలిక్స్ బయటపెట్టిన దౌత్య పత్రాలు ట్యాంకులు, శతఘ్నులు, గ్రెనేడ్స్, విమాన విధ్వంసక క్షిపణులను సరఫరాచేసిందనీ తెలిపాయి. సోమాలియా సముద్ర దొంగలు 2008లో పట్టుకుపోయిన అమెరికా నౌకలో యివన్నీ వున్నాయి. ఆనాడు అమెరికా ఇవన్నీ కెన్యా దేశానికి సరఫరా అవుతున్నాయని చెప్పింది. వికీలిక్స్ బయటపెట్టినపత్రాలు, ఇవి సూడాన్ ప్రజావిముక్తి సైన్యం కోసమే చేరవేస్తున్నారని తేటతెల్లం చేశాయి.

దక్షిణ సూడాన్‌లోని చమురు నిక్షేపాలను చైనా వెలికితీస్తున్నది. భారతదేశపు ఓఎన్‌జిసి కూడా ఒక క్షేత్రంలో చమురు వెలికితీతకు పూనుకుంది. "ఆఫ్రికాపై ప్రేమతో చైనా ఇక్కడకు రాలేదు. తన స్వప్రయోజనాల కోసమే ఆఫ్రికాలోకి చొరబడింది. ఇక్కడితో ఆగకుండా సైనిక ఒప్పందాలు చేసుకుంటే అమెరికా కూడా సైనికంగా స్పందిస్తుంది" అని ఆఫ్రికా వ్యవహారాలుచూసే అమెరికా మంత్రి జానీ కార్సన్ అన్నాడు. తన సైనిక ఉనికినీ, జోక్యాన్నీ సమర్థించుకునేందుకు చైనాను సాకుగా చూపుతున్నాడు. సూడాన్‌పై ఆధిపత్య స్థాపనే దాని లక్ష్యం.

రిఫరెండం పూర్తయి దక్షిణ సూడాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ది ఇకనామిస్ట్ పత్రిక ఇలా వ్రాసింది. "దక్షిణ సూడాన్‌లో విశాలమైన సారవంత భూములున్నాయి. ఇక్కడ గోధుమలు, చెరకు, కాఫీ, టీ, పండ్లతోటలు పెంచి ఎగుమతి చేయవచ్చు. ఇదికాక రాగి, బంగారం, ఇనుప ఖనిజాలున్నాయని తేలింది. 6700 కోట్ల బ్యారెళ్ల చమురు నిక్షేపాలు వున్నాయి. విదేశీ పెట్టుబడులను ఇది అయస్కాంతంలా ఆకర్షిస్తుంది".

సామ్రాజ్యవాద పెట్టుబడుల ప్రవాహం ఇప్పటికే మొదలైంది. జర్మన్ కంపెనీ థైసన్‌క్రుప్ దక్షిణ సూడాన్ రాజధాని జిబానుండి ఉగాండాలోని గులూ వరకూ రైల్వేలైను నిర్మిస్తున్నది. దీని అనుబంధ కంపెనీ గ్లీస్‌నీక్ అమెరికా కంపెనీ ఐర్‌లాజిస్టిక్స్, రష్యాకంపెనీ మాస్ మెట్రోస్ట్రాయేలతో కలిసి దీనిని నిర్మిస్తుంది. దక్షిణ సూడాన్‌లోని చమురును పైపులైను ద్వారా ఉత్తర సూడాన్ గుండా మధ్యధరా సముద్రానికి తరలిస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ఈ రైల్వేలైను నిర్మిస్తున్నది.

సూడాన్‌ను టెర్రరిస్టు రాజ్యంగా అమెరికా 2004లో ప్రకటించింది. ఆల్‌ఖైదా టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్నదని ఆరోపించింది. సూడాన్‌పై ఆంక్షలు విధించినందున అమెరికా కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టలేవు. ఆంతరంగిక కల్లోలంతోనూ, ప్రభుత్వ ఆదాయం సగం చమురునుండే వస్తున్నందునా, చమురు నిక్షేపాలన్నీ దక్షిణాన వుండటంతో సూడాన్ ఆర్థిక సంక్షోభంలో పడింది. బొచ్చె పట్టుకుని అమెరికాకు వెళ్లింది. ఆంక్షలు

| | |
|---|---|
| **వైశాల్యం:** | 25,05,813 చ.కి.మీ. |
| **జనాభా:** | 4,39,39,598 |
| **జనసాంద్రత:** | చ.కి.మీ.కు 16.9 |
| **రాజధాని:** | ఖార్టూమ్ |
| **జాతులు:** | నల్లవారు : 52% |
| | ఆరబ్బులు: 39% |
| | బెజా : 6% |
| | విదేశీయులు: 2% |
| **మతాలు:** | ఇస్లామ్ : 70% |
| | క్రిస్టియన్ : 5% |
| | తెగ విశ్వాసాలు: 25% |
| **భాష:** | అరబిక్, ఇంగ్లీషు, ఆదివాసీ |
| స్థూలజాతీయోత్పత్తి: | 98,98,600 కోట్ల డాలర్లు |
| తలసరి ఆదాయం: | 2300 డాలర్లు |
| సహజ వనరులు: | చమురు, సహజవాయువు, బంగారం, ఇనుము, రాగి |
| వ్యవసాయం: | ప్రత్తి, వేరుశనగ, నువ్వులు, చక్కెర, జొన్న |
| **వాణిజ్యం:** | |
| ఎగుమతులు: | 846400 కోట్ల డాలర్లు, చమురు, సహజవాయువు చక్కెర, ప్రత్తి, బంగారం |
| దిగుమతులు: | 682300 కోట్ల డాలర్లు. చమురు శుద్ధియంత్రాలు, పైపులైన్లు, గోధుమ, గోధుమపిండి, మోటారు వాహనాలు, రసాయనాలు |

ఎత్తివేయమని కోరింది. అమెరికా గూఢచారిసంస్థలతో సన్నిహిత సంబంధాలు కలిగివుండి, ఇరాక్‌లో దాని కార్యకలాపాలకు తోడ్పడిన సాలా గోష్‌ను తన సలహాదారుగా అల్‌బషీర్ నియమించాడు. "టెర్రరిస్టులకు ఆశ్రయం యిస్తున్న దేశాల లిస్టులో సూడాన్‌ను కొనసాగించటానికిప్పుడు కారణాలేమీలేవు" అని అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత స్కాట్ గ్రాషన్ అన్నాడు.

19వ శతాబ్దంలో వలసవాదులు ఆఫ్రికా కొరకు పడిన పోటీ పెనగులాటను ఇప్పుడు మళ్లీ వివిధ సామ్రాజ్యవాద దేశాలు సాగిస్తున్నాయి. ఆఫ్రికా ఖండంలోని సారవంత భూములు, ఖనిజ సంపదల కొరకు వాటిమధ్య సాగుతున్న పోటీ-కుమ్మక్కులు ఆఫ్రికా ప్రజలను రక్తమాలిన్యాలలో ముంచివేస్తున్నది. కెన్యా నాయకుడు నైరేరీ ఉల్లేఖించిన సామెత నేటి పరిస్థితికి అద్దం పడుతుంది: "ఏనుగులు కలహించుకున్నా, ప్రేమించుకున్నా వాటి కాళ్లక్రింద పడినలిగిపోయేది గడ్డే".

## తాజా పరిణామాలు

ట్యునీసియానుండి ఈజిప్టు, లెబనాన్ వరకూ నేడు సాగుతున్న ప్రజాందోళనలూ, ఉద్యమాల ప్రభావం సూడాన్‌పై కూడా పడింది. అల్‌బషీర్ పాలనలో సూడాన్ ప్రజలకు దారిద్ర్యమే మిగిలింది. చమురు నుండి వచ్చిన ఆదాయంలో అధికభాగం అల్‌బషీర్ కుటుంబీకులే దక్కించుకున్నారు. 2007లో శాంతిఒప్పందం జరిగిన నాటినుండే సూడాన్ ప్రజావిముక్తి సైన్యం నాయకులు కూడా చమురు ఆదాయాన్ని మెక్కుతున్నారు. ఫ్రాన్సు దేశమంత వైశాల్యమున్న దక్షిణ సూడాన్‌లో 100 కి.మీ పొడవు రహదారులు మాత్రమే వున్నాయి. నిరక్షరాస్యత అత్యధికం. నాలుగుకోట్లు దాటిన జనాభా వుండగా ఏడాదికి 500మంది బాలికలు మాత్రమే చదువుకుంటున్నారు. ఈ దుర్భర పరిస్థితులు మారాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాజధాని ఖార్టూమ్‌లో నిరసన ప్రదర్శనలు సాగుతున్నాయి. "నిప్పురవ్వ", "మార్పుకొరకు యువత", "మేము విసుగుచెందాం" వంటి పేర్లతో కొత్తసంస్థలు తలెత్తాయి. రాజకీయ పార్టీలతో సంబంధంలేదని చెబుతున్నాయి."పెరుగుతున్న ధరలు, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, నిరుద్యోగం పాలకపార్టీ ఫలితమే. దీనికి స్పందనే మా ఆందోళన" అని నిరసనకారులంటున్నారు. "ఈ ప్రభుత్వం తొలగిపోవాలి" అని నినదిస్తున్నారు. ఖార్టుమ్‌లో విశ్వవిద్యాలయాలు మూతపడ్డాయి. గత పక్షం రోజుల్లో 100మంది విద్యార్థులను ప్రభుత్వం అరెస్టుచేసింది. పోలీసు లాఠీ దెబ్బలకు ఆహ్లియా విశ్వవిద్యాలయ విద్యార్థి మరణించాడు. సూడాన్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక అల్‌మేదాన్‌కు చెందిన 16మంది పత్రికా విలేఖరులను అరెస్టుచేశారు. ఆ పత్రిక ప్రతులను స్వాధీన పరచుకున్నారు.

సూడాన్ కమ్యూనిస్టు పార్టీ, పాప్యులర్ కాంగ్రెస్ పార్టీ, నేషనల్ ఉమ్మాపార్టీ మొదలైన ప్రతిపక్ష పార్టీలు

(తరువాయి 5వ పేజీలో)

# జపాను — నూతన రక్షణ విధాన పరమార్థం

**రెండవ** ప్రపంచ యుద్ధంలో ఫాశిస్టు కూటమి ఓటమితో, అమెరికా యొక్క సైనిక ఛత్రం నీడన జపాన్-అమెరికా లొంగుబాటు రాజ్యంగా వుంటూ వచ్చింది. అమెరికా-జపాన్ సైనిక ఒప్పందం ప్రకారం ప్రపంచయుద్ధం కారణంగా జరిగిన విధ్వంసం నుండి బయటపడి తన ఆర్థిక వ్యవస్థను, తన స్వీయ రక్షణ సామర్థ్యాలను పెంచుకునేందుకు జపాను అనుమతించ బడలేదు. అమెరికా, జపాన్‌లోని తన సైనిక స్థావరం (ఒకినావా) ద్వారా జపానును తన అదుపాజ్ఞలలో వుంచుకోవటమే గాక మొత్తంగా ప్రపంచంపై ప్రత్యేకంగా ఆసియాపై తన ఆధిపత్య వ్యూహంలో భాగంగా జపానుపై సైనిక ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది.

జపాను పాలకవర్గాలు హిట్లరు నాయకత్వంలోని ఫాసిస్టు కూటమిలో చేరటం ద్వారా వరుస యుద్ధాలు సాగిస్తూ ప్రపంచంలోని మూడు అగ్రరాజ్యాలలో ఒకటిగా తమను తాము మలచుకునేందుకు ఉన్మాదపూరితంగా ప్రయత్నిస్తూ గతంలో ఆ సైనికాధికారాన్ని అనుభవించారు. రెండవ ప్రపంచయుద్ధం ముందుకు రావటమనేది నిర్ద్వంద్వంగా వారి తలరాతను మార్చివేసింది. కానీ వారు వారి సామ్రాజ్యవాద స్వభావాన్నీ, కాంక్షలనూ వదులుకోలేదు. రెండవ ప్రపంచ యుద్ధానంతర శాంతికాలంలో అమెరికాతో తమకున్న ఒప్పందాల కారణంగా అర్థికవనరులను కాపాడు కోవటం ద్వారా తమదేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మాణం చేసుకున్నారు.

అగ్రరాజ్యంగా ఆధిపత్యం చెలాయిస్తూ అమెరికా ముందుకొచ్చిన ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో జపాన్ పాలకులు ఈ పరిస్థితికనుగుణంగా సర్దుబాటు చేసుకోవటానికి ఏమాత్రం ఇబ్బంది పడటంలేదు. సైనిక ఒప్పందాలలో అమెరికాకు లోబడివుంటూనే అమెరికా సైనిక వ్యూహాలతో తమ చర్యలను సమన్వయం చేసుకుంటూనే ఆసియాలో తమ స్వీయ ప్రయోజనాలను నెరవేర్చుకునే విధానాలకు వారు కట్టుబడివున్నారు. చైనాతో సాంప్రదాయకంగా కొనసాగే శత్రుత్వాన్ని కొనసాగించటంతో పాటుగా అమెరికా సామ్రాజ్య వాదానికి లొంగుబాటుదారులుగా వున్న లేదా వారి కూటమిలో వున్న వారితో మిత్రత్వం నెరపటమూ ఈ విధానంలో భాగంగానే సాగుతున్నది.

అదేపరిస్థితుల్లో ప్రపంచ ఆధిపత్యంకోసం అమెరికా అనుసరిస్తున్న ఆధిపత్య వ్యూహంలో అమెరికాకు ఒక జూనియర్ భాగస్వామిగా ఆసియా ఖండంలో జపాన్ ఒక చురుకైన పాత్ర నిర్వహిస్తున్నది. 2011 నుండి 10 సం॥ల పాటు అమలులో వుండే 'జపాను జాతీయ రక్షణ కార్యక్రమానికి మార్గదర్శక సూత్రాలను' ఇటీవల జపాను మంత్రి మండలి ఆమోదించింది. ఈ 'నూతన రక్షణ విధానం' ద్వారా జపాను తన రక్షణ వ్యవహారాలను 'సాత్విక' స్థితి నుండి 'క్రియాశీలక' దిశగా మార్పు తీసుకొనేందుకు, అమెరికాతో జపానుయొక్క 'అనుల్లంఘనీయమైన' కూటమిని 'మరింత ముందుకు కొనసాగించేందుకు' ప్రతిపాదిస్తున్నది. ఒకినావ చుట్టూతానున్న దక్షిణ దీవులలో జపాను సైనిక బలగాలకు అది మద్దతునిస్తున్నది. నూతన వాయు, నావికా సైనిక బలగాలను పెంపొందించే విధంగా, లోతట్టు దీవులలో తగిన చర్యలు చేపట్టేందుకు వీలుగా సబ్‌మెరైన్ల, సైనిక బలగాల సంఖ్యను పెంచాలని ఈ నూతన విధానంలో ప్రతిపాదించారు. ఆయుధాల ఎగుమతులపైవున్న నిషేధాన్ని తొలగించాలని ప్రతిపాదించారు. క్షిపణులను ఎదుర్కొనే నూతన వ్యవస్థను అభివృద్ధి చేసుకోవటంలో జపాను అమెరికాతో చేతులు కలపటంతో పాటు మరిన్ని అమెరికా క్షిపణుల మోహరింపుకు పిలుపునిస్తున్నది.

జపాను తన నూతన రక్షణ విధానాన్ని ప్రకటిస్తున్నప్పుడే ఒబామా, జపాను రక్షణ వ్యవహారాలలో అమెరికా యొక్క వైఖరిలో ఎలాంటి మార్పూ లేదని పునరుద్ఘాటించాడు. తమ మిత్రత్వమూ, సైనిక స్థావరాలూ జపాను రక్షణకు మాత్రమే అవసరమైనవిగాక ఈశాన్య ఆసియా ప్రాంతమంతటా ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని, స్థిరత్వాన్ని కల్పించేందుకు తోడ్పడుతా యన్నాడు. జపాను పాలకులు తమనూతన రక్షణ విధానంలో ప్రవచిస్తున్న 'క్రియాశీలత' అనేది అమెరికా ఆశీర్వాదాలతో పొందుపరచబడినదే. ప్రపంచంలోనూ ముఖ్యంగా ఆసియాలోనూ అమెరికా యొక్క ఆధిపత్య వ్యూహాన్నే జపాను నూతన రక్షణ విధానం బలపరుస్తు న్నది.

జపానుకు చైనా, రష్యాలతో నున్న సమస్యలు, సెంకాకు, దయోయుకు, రైలీదీవులపై హక్కు విషయంలో వారితో నెలకొన్న శత్రుత్వం, ఉద్రిక్తతలు అమెరికా దృష్టిలో వున్నాయి. ఈ వైరుధ్యాలు చాలా కాలం కొనసాగుతాయని కూడా అమెరికాకు తెలుసు. ఎందువల్ల నంటే, అవి మానవ సంచారం లేని చిన్నదీవులు మాత్రమే కాదు. తూర్పుచైనా సముద్రం, పసిఫిక్ సముద్రం సమృద్ధిగా కలిగివున్న చమురు వనరులు, గ్యాస్ నిల్వలపై ఆధిపత్యం కోసమే ఈ తగవు కనుక! చైనా, రష్యాలతో జపానుకున్న వైరుధ్యాలను అమెరికా ఉపయోగించు కుంటూ చైనాను నిలువరించటంతో పాటుగా ప్రపంచ ఆధిపత్యంకోసం తన వ్యూహాన్ని శక్తివంతం చేసుకునేందుకు పునఃప్రయత్నం చేస్తున్న రష్యాను ఎదుర్కోదలుచుకుంది.

కానీ, రెండవ ప్రపంచయుద్ధకాలంలో జపాను పాలకులు అనుసరించిన సైనిక, దురాక్రమణపూరిత విధానాల కారణంగా తాము ఎంతటి వేదనలను భరించారో జపాను ప్రజలకింకా గుర్తుంది. ప్రపంచ ప్రజల శత్రువుగా ఫాసిస్టు కూటమిలో సభ్యురాలిగా ఎంతగా ప్రజల ఏహ్యతను, ఆగ్రహాన్ని చూరగొన్నదో వారు గమనించారు. హిరోషిమా, నాగసాకీలపై అమెరికా ప్రయోగించిన అణుబాంబులు ఎంతటి విధ్వంసం సృష్టించాయో, లక్షలాది మందిని ఏ విధంగా జీవచ్ఛవాలుగా మార్చివేశాయో వాటి దుష్ఫలితాలు జపాను ప్రజలకు తెలుసు. వాటిని ఈ నాటికీ అనుభవిస్తున్నారు కూడా.

జపాన్‌పై అమెరికా రుద్దిన అసమతుల్య, లొంగుబాటు సైనిక ఒప్పందం, జపాన్ భూభాగంపై అమెరికా సైనిక స్థావరం (ఒకినావా) మరియు ఆ స్థావరంలో అమెరికా సైనికుల ఆధిపత్య ధోరణి, వారు సాగిస్తున్న అకృత్యాలు జపాను ప్రజలకు అవమానకరం గానూ, శాంతికి తీవ్రమైన ప్రమాదంగానూ పరిణమించాయి. అందువలన, జపాను ప్రజలు జపాను-అమెరికా సైనిక ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఒకినావా నుండి అమెరికా సైనికస్థావరాన్ని ఎత్తివేయాలని; మానవ హననానికి కారణమైన అణుబాంబులు ప్రయోగించిన నేరానికిగానూ అమెరికాకు తగిన శిక్ష విధించాలని; ఈనాటికీ బాధితులుగావున్న లక్షలాది మందికి నష్టపరిహారం, సరైన పునరావాసం కల్పించాలని దీర్ఘకాలంగా పోరాటం సాగిస్తున్నారు.

జపాన్ పాలకుల 'రక్షణ విధానం'లోని ఏవిధమైన 'క్రియాశీలత' అయినా ఇతర ప్రజల హక్కుల అతిక్రమణకు, సామ్రాజ్యవాద, విస్తరణవాద కాంక్షలను అమలుచేసేందుకు లేదా జపాను ప్రజలను మరొక అన్యాయమైన యుద్ధంలోకి ఈడ్చటంద్వారా అమెరికా వంటి ఆధిపత్య అగ్రరాజ్యపు వ్యూహానికి ఒక పనిముట్టుగా మార్చేందుకూ, జపాను, ఆసియా మరియు ప్రపంచ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమైనదిగానూ మాత్రమే వుంటుంది. కావున వీలైన అన్ని పద్ధతుల్లోనూ దానితో చివరికంటా పోరాడి, ఓడించాల్సిన అవసరముంది. ✶

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వమూ వృత్తి, సాంకేతిక కళాశాలల యాజమాన్యాలు

**పాలకులు**-విద్యనందించే బాధ్యత నుండి తప్పుకొని విద్యను ప్రైవేటీకరించే, కార్పొరేటీకరించే చర్యలను గత రెండు దశాబ్దాల కాలంలోనూ మరింత వేగవంతంచేశారు. సామ్రాజ్యవాద దోపిడీ ప్రయోజనాలకు లోబడిన భారత పాలకులు ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ విధానాల అమలు నేపథ్యంలో విద్యారంగంలో -ముఖ్యంగా-సమాచార, శాస్త్రసాంకేతిక రంగాల్లో దేశం ఆఘమేఘాలమీద పురోగమిస్తున్నట్లుగా భ్రమలు కల్పించారు. ఇదే అదనుగా దేశవ్యాపితంగానూ, ముఖ్యంగా మన రాష్ట్రంలోనూ వందలాది ప్రైవేటు ఇంజనీరింగ్, ఎంసిఏ, ఎంబిఏ కళాశాలలకు అనుమతి నిచ్చారు.

1997లో మన రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్య 37. కాగా 2004లో 236కు 2009లో ఆ సంఖ్య 537కి పెరిగింది. 2004లో ఎంసిఏ కళాశాలల సంఖ్య 271 కాగా, 2009 నాటికి 500కి; 2004లో ఎంబిఏ కళాశాలల సంఖ్య 207కాగా, 2009 నాటికి 611కి; 2004లో ఫార్మసీ కళాశాలల సంఖ్య 45 నుండి 2009 నాటికి 270కి పెరిగింది

ఇంజనీరింగ్ కళాశాలల ప్రమాణాలను నిర్దేశించి, వాటికి అనుమతినివ్వాల్సిన ఏఐసిటిఇ వంటి చట్టబద్ధ సంస్థలను ప్రలోభ పర్చడం ద్వారా, కనీస పాటి భవనాలు, ప్రయోగశాలలు, వసతి సౌకర్యాలు, బోధనా సిబ్బంది లేకున్నా అనేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అత్యంతతెలివిగా అనుమతులను సొంతం చేసుకున్నాయి. వృత్తి, సాంకేతిక విద్యపట్ల విద్యార్థులు, తల్లిదండ్రులలో కల్పించిన డిమాండ్‌ను ఆసరా చేసుకొని ఈ ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు విచ్చలవిడిగా విద్యార్థుల నుండి ఫీజులు, డొనేషన్ల రూపంలో పెద్దఎత్తున డబ్బును దండుకుంటున్నాయి.

విద్యావేత్తలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు, వివిధ విద్యార్థి సంఘాలు-ప్రైవేటు యాజమాన్యాలు ఇబ్బడిముబ్బడిగా నెలకొల్పుతున్న వృత్తి, సాంకేతిక కళాశాలల స్థాపనను వ్యతిరేకిస్తూ ప్రభుత్వమే ఆ బాధ్యతను చేపట్టి, నిర్వహించాలని డిమాండ్ చేసినప్పటికీ 'చెవిటివాని ముందు శంఖమూదిన' చందమైంది. ప్రభుత్వం, ప్రైవేటు యాజమాన్యాల కొమ్ముగాసింది.

రాష్ట్రంలో రాజశేఖరరెడ్డి నాయకత్వంలో మొదటి విడత కాంగ్రెసుపార్టీ అధికారంలోకి వచ్చిన చివర సం॥లో (2008లో), 2009 ఎన్నికలకు వెళ్ళబోయే ముందుగా -వృత్తి, సాంకేతిక కళాశాలల్లో లక్షరూ॥లోపు వార్షికాదాయం వున్న విద్యార్థులందరి బోధనా రుసుమును ప్రైవేటు యాజమాన్యాలకు ప్రభుత్వమే తిరిగి చెల్లిస్తుందని ప్రకటించాడు. 'పేదవాడైనంత మాత్రాన ఉన్నత విద్యకు అనర్హుడా?' అని ప్రశ్నిస్తూ, ప్రతి కుటుంబంలో ఒక్కరినైనా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పథకం ప్రవేశపెడుతున్నట్లుగా ఆనాడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది.

ఈ పథకం అమలులోని సాధ్యాసాధ్యాలను ప్రక్క నుంచి, అప్పటికే పెద్దఎత్తున పెంచిన బోధనారుసుముల ప్రకారం లెక్కిస్తే ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రైవేటు యాజమాన్యాలకు చెల్లించాల్సి రావటాన్ని ప్రజాతంత్ర వాదులు, విద్యారంగ మేధావులు ఆనాడే ఆక్షేపించారు. ప్రైవేటు యాజమాన్యాలకు ఏటా చెల్లించే వందల కోట్ల రూపాయలతో ప్రభుత్వమే అనేక ఉన్నత వృత్తి, సాంకేతిక కళాశాలను నెలకొల్పి, నిర్వహించవచ్చునని గణాంకాలతో సహా వివరించారు. వీటన్నింటినీ త్రోసిపుచ్చి రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఆర్భాటంగా ఫీజు రీఎంబర్స్‌మెంట్ విధానాన్ని నిరాటంకంగా కొనసాగిస్తామని ప్రకటించింది.

సహజంగానే పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు విద్యార్థులు ఈ విధానంద్వారా ప్రయోజనం పొందగలుగుతామనుకున్నారు కానీ ఆ మురిపెం ఎన్నాళ్ళో సాగలేదు.

రెండవ పర్యాయం రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే (2009లో) ఒక్కొక్కటిగా వడపోత విధానాలు ప్రారంభమయ్యాయి. ఫీజురీఎంబర్స్‌మెంట్ అర్హతకు కావలసిన నిబంధనలను ప్రభుత్వం కఠినతరం చేసింది.

రాజశేఖరరెడ్డి మరణానంతరం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రులు రోశయ్య, కిరణ్‌కుమార్‌లు అదే బాటలో సాగుతున్నారు. రీఎంబర్స్‌మెంట్‌కు అనేక మందిని అనర్హులుగా ప్రకటించి వారికి ఇంజనీరింగ్ వృత్తి కళాశాలల్లో విద్యావకాశాలను నిరోధించటంతో పాటు, ప్రైవేటు కళాశాల యాజమాన్యాలకు చెల్లించ వలసిన బోధనారుసుముల చెల్లింపులలో కోత విధించటం, సకాలంలో చెల్లించకపోవటం ప్రారంభమైంది. దీనిని సాకుగా తీసుకొని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు పలు దఫాలుగా ప్రభుత్వంపై వత్తిడి పెంచుతూ వచ్చాయి. సకాలంలో బోధనా రుసుము తిరిగి చెల్లించకుంటే కళాశాలల నిర్వహణ తమకు కష్టమౌతుందని ప్రైవేటు యాజమాన్యాలు గగ్గోలుపెట్టాయి. ప్రభుత్వం చెల్లించటం లేదు గనుక ఫీజులు చెల్లించవలసినదిగా విద్యార్థులపై వత్తిడిని పెంచాయి. దీనితో సహజంగానే విద్యార్థుల ఆందోళన ముందుకొచ్చింది.

తమకు చెల్లించవలసిన బకాయిలలో సగమైనా ప్రభుత్వం చెల్లించకుంటే ఫిబ్రవరి 16 నుండీ తాము కళాశాలలను మూసివేయక తప్పదని యాజమాన్యాలు ప్రభుత్వాన్ని హెచ్చరించే స్థితికి చేరుకున్నాయి. రచ్చబండల పేరుతో వందలకోట్ల ప్రజాధనాన్ని ప్రకటనల రూపంలోనే దుర్వినియోగం చేసిన ప్రభుత్వం ప్రైవేటు కాలేజీలకు బకాయిలు చెల్లించి విద్యార్థుల తమ భవిష్యత్తు గురించి పడ్తున్న ఆందోళనను తొలగించవచ్చు.

కానీ ప్రభుత్వం దీనికి సిద్ధం కాకపోవడంతో ప్రభుత్వం-ప్రైవేటు కళాశాల యాజమాన్యాల నడుమ విద్యార్థులు 'అడకత్తెరలో పోకచెక్కలా' నలిగిపోతున్నారు. రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో తదనంతరం అధికారం లోకి వచ్చిన ముఖ్యమంత్రులెవ్వరూ తన తండ్రి మానస పుత్రికలైన గొప్ప సంక్షేమ పథకాలను కొనసాగించే చిత్తశుద్ధి లేకపోవటమే ఈ సమస్యకు కారణంగా పేర్కొంటూ జగన్ ఒకవైపు దీక్షలను చేపడుతుండగా, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ 'కర్రవిరగకుండా పాముచావకుండా' సన్నాయినొక్కులు నొక్కుతూ విద్యార్థుల సమస్యలపట్ల మొసలికన్నీరు కారుస్తున్నది.

కాగా, ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు తమకు రావలసిన 5వేల కోట్ల బోధనా రుసుము బకాయిల గురించి డిమాండ్ చేయటంతో, ప్రభుత్వం-ప్రైవేటు కళాశాల భవనాలు, ప్రయోగశాలలు, వసతి సౌకర్యాలు తదితర సమస్యలను ఎదురు నిలిపి ప్రశ్నిస్తున్నది. ఈ పరిస్థితి వాస్తవమే అయినా, ప్రైవేటు వృత్తి, సాంకేతిక కళాశాలలు ప్రమాణాలకు తగినట్లుగా వున్నాయా లేవా అనే అంశం ఈనాటి వరకూ ప్రభుత్వం ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదన్నదే ప్రశ్న.

ఈ మొత్తం విషయాలను గమనంలోకి తీసు కోవటం ద్వారా, తక్షణం ప్రభుత్వం విద్యార్థుల బోధనా ఫీజులను రీఎంబర్స్ చేయటం, ఉపకార వేతనాలను చెల్లించటం ద్వారా విద్యార్థుల మానసిక ఆందోళనను తొలగించి, వారి విద్యా సంవత్సరం సాఫీగా సాగిపోయే చర్యలను చేపట్టాలి.

2008లో ఫీజులు పెంచమని ఇంజనీరింగు కళాశాలల ప్రైవేటు యాజమాన్యాలు కోరాయి. కాలేజీ స్థాపనకు 5 కోట్లు, నిర్వహణకు ఏడాదికి 2 కోట్లు ఖర్చవుతున్నదనీ, ప్రతి విద్యార్థికీ తలసరిన 40 వేలు ఖర్చవుతున్నదని లెక్కలు చెప్పాయి. ప్రభుత్వం ఫీజును 33 వేలకు పెంచి, మేనేజిమెంటు కోటా పెంచేందుకు అంగీకరించింది.

ప్రైవేటు యాజమాన్యాలు లెక్కలు పెంచి చూపిస్తాయన్న సంగతలా వుంచి, వారి లెక్కల ప్రకారమే చూసినా, ఇప్పటికే తిరిగి చెల్లించిన ఫీజుల మొత్తంతో ప్రభుత్వమే వృత్తి కళాశాలలన్నింటినీ నిర్మించగలిగి వుండేది. వీటి నిర్వహణకు ఏటా 2000 కోట్లు ఖర్చు పెడితే సరిపోయేది. అలాచేసి వుంటే ఈ కళాశాలల్లో చేరిన విద్యార్థులందరూ ఉచితంగా విద్యను పొంది వుండేవారు.

ఇటీవల ప్రపంచ బ్యాంకు పరిశ్రమలకు అవసరమైన నిపుణకార్మికుల కొరతవున్నందున పాలిటెక్నిక్ కాలేజీల సంఖ్య పెంచమని సూచించింది. ఆ దిశగా కదిలి ప్రైవేటు పాలిటెక్నిక్‌లను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

దేశ ఆర్థిక వ్యవస్థకు ఎందరు వృత్తి నిపుణుల వసరమో దానిని బట్టి ఆశ్రితులందరికీ ప్రైవేటు కాలేజీలు మంజూరు చేశారు. వాటిలో సీట్లు నిండని స్థితి ఏర్పడటంతో ఫీజు రీయింబర్స్ మెంటు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఉచితంగా వృత్తి విద్య నేర్చి ఉపాధి పొందవచ్చునని భావించి పేదవర్గాల పిల్లలు చేరారు. అయినా నాణ్యమైన విద్య అందక, విద్యానంతరం తక్కువ అవకాశాలుండటంతో పోటీకి తట్టుకోలేక నిరుద్యోగులుగానో, (తరువాయి 5వ పేజీలో)

# సూక్ష్మరుణ సంస్థలు

# దోపిడీ వడ్డీకి ఆమోద ముద్ర వేసిన మాలేగావ్ కమిటీ

**సూక్ష్మరుణ** సంస్థల దోపిడీ, దౌర్జన్యాలూ, తత్పర్య వసానంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో సూక్ష్మరుణ రంగం నియంత్రణకు సూచనలు కోరుతూ రిజర్వుబ్యాంకు మాలేగావ్ కమిటీని నియమించింది. ఈ కమిటీలో రిజర్వు బ్యాంకుకు చెందిన అధికారులు యు.ఆర్.రావు, కె.సి. చక్రవర్తిలూ, ప్రైవేటు రంగంనుండి కుమారమంగళంబిర్లా, శశిరాజగోపాలన్‌లూ సభ్యులుగా వున్నారు. వడ్డీ వ్యాపార నియంత్రణ తమ పరిధిలో వున్న రాష్ట్రాలకు గానీ, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న సంస్థలకు గానీ ఈ కమిటీలో స్థానం కల్పించలేదు. జనవరి 18న మాలేగావ్ కమిటీ తన నివేదికను ఇచ్చింది. ఈ కమిటీ పలుసూచనలు చేసింది.

సంవత్సరం ఆదాయం 50 వేల రూ॥ల లోపు వున్న కుటుంబాలకు, రూ॥ 25 వేలు గరిష్ట పరిమితితో రుణాలు యివ్వాలి; 75 శాతం రుణాలను కుటుంబ ఆదాయాన్ని పెంచే కార్యకలాపాలకి యివ్వాలి; ఈ రుణాలపై వడ్డీ 24 శాతమే వసూలు చేయాలి; ఇదికాక ఒక శాతాన్ని ప్రాసెసింగ్ ఛార్జీలు, బీమా ప్రీమియం మాత్రమే వసూలు చేయాలి; ఒకే వ్యక్తికి రెంటికి మించి సంస్థలు అప్పివ్వరాదు; రుణ గ్రహీత రెంటికి మించి బృందాలలో సభ్యుడిగా వుండరాదు; రుణ చెల్లింపు వారం, పక్షం, నెలవారీ కిస్తీలుగా రుణగ్రహీత కోరుకున్న విధంగా వసూలు చేయాలి. మార్కెట్టు నుండి అప్పులు తెచ్చి తమ కార్యకలాపాలు సాగిస్తున్న సూక్ష్మరుణ సంస్థలు తమ మూలధనం రు. 100 కోట్లు దాటితే తాము తెస్తున్న వడ్డీకీ, వసూలు చేస్తున్న వడ్డీకి మధ్య తేడా 10 శాతం మించరాదు; అంతకు లోపుంటే 12 శాతం మించరాదు; సూక్ష్మరుణ సంస్థలకు బ్యాంకులందజేస్తున్న రుణాలను ప్రాధాన్యతారంగ రుణాలుగా పరిగణించాలి; ఈ సంస్థలన్నింటినీ బ్యాంకింగేతర ద్రవ్య సంస్థలుగా గుర్తించి అందులో ఎన్‌బిఎఫ్‌సి-ఎంఎఫ్‌ఐలుగా ప్రత్యేకంగా వర్గీకరిస్తుంది. ఇలా గుర్తింపు పొందేందుకు కనీస మూలధనం రూ॥ 100 కోట్లు వుండాలి; రాష్ట్రాల వడ్డీ నియంత్రణ చట్టాల నుండి వీటిని మినహాయించాలి. తన సూచనలను 2011 ఏప్రిల్ 1 నుండీ అమలు చేయమనీ, వీటిని అమలు చేస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేసిన చట్టం అవసరముండదనీ చెప్పింది. కాగా రుణాల తిరిగి వసూలుకు ఈ సంస్థలనుసరిస్తున్న దౌర్జన్య పద్ధతులను నివారించే బాధ్యత ఆ సంస్థలదేనని చెప్పింది.

ఈ సూచనలను బడా సూక్ష్మరుణ సంస్థలు ఆహ్వానించాయి. ఇప్పటికే తాము వసూలు చేస్తున్న వడ్డీని 26-27 శాతానికి తగ్గించామనీ, కమిటీ సూచనలను పూర్తిగా అమలు చేసేందుకు 8 నెలల సమయం కావాలనీ అడిగాయి. కాగా పేదల వేదనను కమిటీ పరిగణించలేదనీ, బడా సూక్ష్మరుణ సంస్థల ఆందోళననే పట్టించుకుందనీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విమర్శించింది. లాభాపేక్షగల సూక్ష్మరుణ సంస్థలనూ, స్వయం సహాయక బృందాలనూ ఒకే గాటన కట్టిందనీ, వారికి రుణ పరపతిని పెంచే సూచనలు చేయలేదనీ విమర్శించింది. ఈ సంస్థల నియంత్రణకు సమర్ధ యంత్రాంగాన్ని సూచించకుండా, నా చట్టాన్ని ఉపసంహరించుకోమంటూ కమిటీ ఆదుర్దా పడిందని అభిప్రాయపడింది.

మాలేగావ్ కమిటీ సూచనల్లోని లోటుపాట్లను చర్చించటానికి ముందుగా ఒక కీలకాంశాన్ని గమనించాలి. పేద వర్గాలకు రుణ పరపతి సౌకర్యం కల్పించటంలో సూక్ష్మరుణ సంస్థల పాత్ర ఏమిటో స్పష్టంగా నిర్వచించుకోవాల్సివుంటుంది. వీటిది ప్రధాన పాత్రా? లేక ద్రవ్య సంస్థల నుండి రుణాలను చేరవేసే మధ్యవర్తుల పాత్రా? మాలేగావ్ కమిటీ ఈ నిర్వచనాన్ని యివ్వలేదు.

పేదరిక నిర్మూలనకోసమంటూ స్వయం సహాయక బృందాలను నెలకొల్పారు. బ్యాంకులు వీటికి రుణాలివ్వటం ప్రారంభించాయి. రుణాలను పేదలకంద జేసేందుకు బిజినెస్ కరస్పాండెంట్లను (వాణిజ్య ఏజంట్లను) నియమించుకోవటానికి రిజర్వు బ్యాంకు అనుమతించింది. లబ్ధిదారులకు బ్యాంకుల రుణాలను చేరవేసేవిగా సూక్ష్మరుణ సంస్థలు రంగ ప్రవేశం చేశాయి. బ్యాంకులు వీటికి రుణాలందజేసి తమపని నెరవేరిందను కున్నాయి. దీనితో గత ఐదేళ్ళలోనూ ఈ సంస్థలు విస్తరించాయి. స్వయం సహాయక బృందాలకు బ్యాంకులందించే రుణాలు తగ్గిపోయాయి. సూక్ష్మరుణ సంస్థలు మార్కెట్టునుండి అప్పులు తెచ్చి పేదలకు రుణాలివ్వటం ప్రారంభించాయి. పేదరికంలోని వారికి చేయూతనందించే ప్రభుత్వ యత్నంలో భాగస్వాములుగా ప్రారంభమైన రుణసంస్థలు, లాభసాటి వ్యాపార సంస్థలుగా మారాయి. పచ్చి వడ్డీవ్యాపారంగా మారింది. 10 రూ॥ ముఖ విలువ కలిగిన షేరును ఎస్‌కేఎస్ సూక్ష్మరుణ సంస్థ 1904 రూ॥లకు మార్కెట్టులో అమ్మి 1600 కోట్ల రూ॥లు పొందింది. షేర్ మైక్రోఫిన్‌కు మేనేజింగ్ డైరెక్టరుగా వున్న ఎం. ఉదయ్ కుమార్‌కు 2009-10 సంవత్సరానికి 7.4 కోట్ల రూ॥లు వేతనంగా ముట్టింది. ఈయన భార్య విద్యాస్రవంతి అస్మిత సంస్థకు మేనేజింగ్ డైరెక్టరుగా వుంది. ఆమె వార్షిక వేతనం రూ॥ 3.2 కోట్లు. వాణిజ్యబ్యాంకుల అధిపతుల వేతనాలను కంపెనీల చట్టం నిర్దేశించింది. దాని ప్రకారం బ్యాంకు అధిపతులలో అత్యధిక వేతనం పొందింది, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎండి ఆదిత్యపూరి. ఆయన వేతనం 3.4 కోట్లు. సూక్ష్మరుణ సంస్థలు లాభసాటి వ్యాపారంగా మారాయన్నది స్పష్టమే.

ప్రైవేటు రంగమే పేదరిక నిర్మూలనను చేయగలదన్న నయాఉదరవాద సిద్ధాంతాన్ని పాలకులు అంగీకరించినందువల్లనే సూక్ష్మరుణ సంస్థల దోపిడీ కార్యకలాపాలను చూస్తూ వూరుకున్నాయి. స్వయం సహాయక బృందాలకు బ్యాంకులను జోడించే కార్యక్రమం ద్వారా రుణ వితరణ 2008 నాటికి 74 శాతానికి, 2010 నాటికి 60 శాతానికీ తగ్గిపోయింది. బ్యాంకులు ఆ కార్యక్రమం నుండి తప్పుకుంటున్నందున సూక్ష్మ రుణ సంస్థలు విస్తరించాయి తప్ప, అవి వాణిజ్య రీత్యా సమర్ధవంతమైనవైనందున విస్తరించలేదు. స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి, ప్రోత్సహించిన దక్షిణాది రాష్ట్రాలలోనే సూక్ష్మరుణ సంస్థలు విస్తరించటమే దీనిని తెలుపుతుంది. బ్యాంకులు విస్తృతమైన ద్రవ్యసేవ లందిస్తున్నాయి గనుక వాటి వడ్డీరేట్లు తక్కువుంటాయి. బ్యాంకులు స్వయం సహాయక బృందాలకూ, సూక్ష్మరుణ సంస్థలకూ అందజేస్తున్న ద్రవ్యానికి 8 లేక 9 శాతం వడ్డీ తీసుకుంటున్నాయి. ఇప్పుడు మాలేగావ్ కమిటీ సూచించినట్లు 1 శాతం ప్రాసెసింగ్ ఛార్జితో పాటు 1 శాతం పాలనా ఛార్జీలు వసూలు చేసినా, బీమా ప్రీమియంను అసలు నుండి తగ్గించినా వాస్తవ వడ్డీరేటు 14 శాతానికి మించదు. ఈ రుణాలు కిరాణాషాపులు, చేతివృత్తులకూ వినియోగించిన సందర్భంలో వారికి బ్యాంకులు మార్కెటింగులో అవసరమైన ద్రవ్య సేవలందించగలవు.

సూక్ష్మరుణ వితరణలో బ్యాంకులది ప్రధాన పాత్ర అని నిర్వచించివుంటే నిబంధనల కనుగుణంగా వాటి నియంత్రణ బ్యాంకుల బాధ్యతగా వుండేది. సూక్ష్మరుణ సంస్థలు మధ్యస్థులుగా ఏ 5 శాతమో ఖర్చుల రీత్యా వడ్డీని అదనంగా వసూలు చేసుకునేవి. నయా ఉదారవాద సిద్ధాంతాలను ప్రశ్నించకుండా ఆమోదించి పని చేస్తున్నందున, మాలేగావ్ కమిటీ సూక్ష్మరుణ సంస్థల పాత్రను నిర్వచించలేదు. మౌనంగా వుండి వాటి దారిద్ర్య నిర్మూలనా పాత్ర అన్నదానిని ఆమోదించింది.

సూక్ష్మరుణ సంస్థల కార్యకలాపాలు దారిద్ర్యాన్ని నిర్మూలించలేవు. ఉత్పత్తికార్యకలాపాలకే రుణాలందజేసినా ఆదాయం పెరిగి దారిద్ర్యం పోదు. ఒక మహిళ తన కిరాణా కొట్టు నిర్వహణకు 10 వేలు అప్పు తీసుకుందనుకుందాం. ఆ డబ్బుతో ఎక్కువ సరుకులు కొని షాపు నింపుతుంది. సూక్ష్మరుణ సంస్థలు సగటున 36 శాతం వడ్డీ వసూలు చేస్తూన్నాయని మాలేగావ్ కమిటీ చెప్పింది. కిరాణా అమ్మకాల్లో ఇంత లాభంరాదు కనుక కిస్తీలు కట్టడం పూర్తి కాకుండానే షాపులో సరుకులు నిండుకుంటాయి. మిగిలిన పాత అప్పు తీర్చటానికి రెండో అప్పు చేయాల్సివస్తుంది. అంటే దివాళా తీయటం వాయిదా పడుతుంది తప్ప లాభాలు రావు. ప్రస్తుత కల్లోలానికి బహుళ రుణ వితరణను కారణంగా చూపుతున్నారు. ప్రపంచ బ్యాంకు రూపొందించిన ఈ పథకం ఫలితమే బహుళ రుణవితరణ. కాగా దానిని తల్లక్రిందులు చేసి ఫలితాన్ని కారణంగా చూపుతున్నారు. ఈ విషయం అందరికన్నా ఎక్కువగా రిజర్వుబ్యాంకుకే తెలుసు. సూక్ష్మరుణమంటే ఫక్తు వడ్డీవ్యాపారమనీ దాని నియంత్రణ రాష్ట్రాలదేనని దాని గవర్నరు వై.వి. రెడ్డి స్పష్టంగా చెప్పాడు. తర్వాతి గవర్నరు సుబ్బారావు కూడా వ్యాపారంలోకి దయ, ఉదారతలను చొప్పించటం ఎవరికీ సాధ్యం కాదనీ వాటి పని తీరును క్రమబద్ధీకరించే పని చేస్తామని చెప్పాడు.

మాలేగావ్ కమిటీ సూచనలు ఈ దిశలోనే వున్నాయి. వార్షిక ఆదాయం 50 వేల లోపున్న వారికి 25 వేలు రుణం, రెండు రుణాలు మించి యివ్వకూడదు వంటి నిబంధనలను సూక్ష్మరుణ సంస్థలు పాటిస్తున్నాయో లేదో పర్యవేక్షించటం సాధ్యమౌతుందా? వందల సంఖ్యలో సూక్ష్మరుణ సంస్థలు, వాటికి దేశమంతటా వందలాది శాఖలు, వాటిలో లక్షలమంది ఉద్యోగులు, కోట్లమంది రుణ గ్రహీతలు. ఇదంతా నిబంధనల ప్రకారమే జరుగుతున్నదో లేదో పరిశీలించేందుకు ఎంత పెద్ద యంత్రాంగం కావాలి?! వాణిజ్య బ్యాంకుల పర్యవేక్షణకే సిబ్బంది లేక అవి బోర్డు తిప్పేసేవరకూ రిజర్వుబ్యాంకు వాటివైపైనా చూడని పరిస్థితిలో సూక్ష్మరుణ సంస్థల పర్యవేక్షణను రిజర్వుబ్యాంకు చెయ్యలేదు. అయినా ఎన్‌బిఎఫ్‌సిలుగా అవి గుర్తింపు పొందాలన్న నిబంధనతో రాష్ట్ర ప్రభుత్వాల పరిధినుండి తన పరిధిలోకి తెచ్చుకుంది. అంతేకాక, వాటి మూలధనం రూ॥ 100 కోట్లు వుండాలని సూచించింది.

దీనిపై వివరణ ఇస్తూ కమిటీ సభ్యురాలు శశీ రాజగోపాలన్ ఇలా అన్నారు: "ఇది వడ్డీ వ్యాపారం. ఏ చట్టమైనా దీనిముందు నిరుపయోగమే. ఇప్పుడు 85 శాతం వాణిజ్యం 15 బడా సూక్ష్మరుణ సంస్థలే చేస్తున్నాయి. కనుక దీనినే గౌరవించాలని మాలేగావ్ కమిటి ప్రయత్నించింది. బడా సంస్థలు పెరగటాన్ని, వాటికి లాభాలు రావటాన్ని, ప్రాధాన్యతారంగ రుణాలు, సామాజిక పెట్టుబడి వారికి అందుబాటులో ఉంచే మద్దతును గౌరవించ పూనుకుంది. అప్పుడు నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయవచ్చు. ఈ నిబంధనలు ఆ సంస్థల వాణిజ్యానికి అడ్డురావు" (ఇకనామిక్ టైమ్స్, 28-1-2011)

వడ్డీ వ్యాపారాన్ని గుత్త ద్రవ్య వాణిజ్యంగా మార్చటమే నియంత్రణ అన్న మాటల లక్ష్యమని స్పష్టమైంది. రంగంలో కొద్ది సంస్థలే వుండాలి. బ్యాంకులు తక్కువ వడ్డీకి ఒక సమన్వయ సంస్థకు నిధులు ఇస్తాయి. అది సూక్ష్మరుణ సంస్థలకు పంచుతుంది. బ్యాంకులు డబ్బిచ్చీ, సమన్వయ సంస్థ పంచిపెట్టీ చేతులు దులుపుకుంటే, నిబంధనలు పాటించేపని సూక్ష్మరుణ సంస్థలకే వదిలి పెట్టారు. "అవి వ్యవహారశైలిని నియంత్రించుకునే నియమాలను రూపొందించుకుని అమలు చేయాల"ని మాలేగావ్ కమిటీ సూచన.

ఈ పెద్ద సంస్థలే నెట్‌వర్క్‌గా ఏర్పడి కోడ్ ఆఫ్ కాండక్టును రూపొందించుకున్నామనీ, దానితో అవకతవకలూ, దౌర్జన్య వసూళ్లూ వుండబోవనీ రెండేళ్ల క్రితం రిజర్వుబ్యాంకుకు చెప్పాయి. ఆ తర్వాతే సమస్య తీవ్రమైంది. ఆత్మహత్యలన్నీ ఈ పెద్ద సంస్థల నుండి రుణం పొందిన వారివే. అయినా బడా సంస్థలనే ప్రోత్సహించేందుకు వీలుగా నిబంధనలు, సూచనలూ వున్నాయి.

వడ్డీ 24 శాతం, మార్కెట్టునుండి అప్పులు తెస్తున్న సంస్థల ఆదాయం 10 శాతం మించరాదన్న రెండు వైపులా నిబంధన విధించటాన్ని ఆ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి కదా అని ఇకనామిక్ టైమ్స్ పత్రిక అడిగిన ప్రశ్నకు మాలేగావ్ ఇచ్చిన సమాధానం యిలా వుంది : "హామీ లేకుండా రుణమిస్తున్నాం. నువ్వు చనిపోతే చెల్లింపు ఆగిపోతుంది. కనుక బీమా చేస్తున్నాము అంటారు. అప్పు నుండి బీమా మొత్తం తగ్గిస్తారు. బీమా మొత్తానికి పరిపాలనా ఛార్జీలు వసూలు చేస్తారు. రుణగ్రహీత తీసుకున్నది రూ॥ 10 వేలయితే ఏ 15 వేలనో రాస్తారు. కనుక రెండువైపులా వడ్డీపై పరిమితి పెట్టాల్సి వచ్చింది". పచ్చి వడ్డీ వ్యాపారస్థుడిలా సూక్ష్మరుణ సంస్థలు వ్యవహరిస్తున్నాయనీ, దాని ఫలితంగా కోట్లాది మహిళలు నిలువుదోపిడీకి గురౌతున్నారనీ, మరింత దారిద్ర్యంలోకి కూరుకు పోతున్నారనీ మాలేగావ్ మాటలే తెలుపు తున్నాయి. అయినా ఆ బడా సంస్థల దోపిడీ వడ్డీ వ్యాపారాన్నే వ్యవస్థీకృతం చేసి ద్రవ్య గుత్త పెట్టుబడికి మరొక మదుపు మార్గాన్ని క్షేమకరం చేసే సూచనలను మాలేగావ్ కమిటీ చేసింది.

మార్కెట్టు నుండి తెచ్చే అప్పులకు వడ్డీలు ఎక్కువ కనుక ఆదాయంపై 10 శాతం పరిమితిని ఎత్తివేయమని సూక్ష్మరుణ సంస్థలు గగ్గోలు పెట్టాయి. "సామాజిక నిధుల" నుండి అప్పు తెచ్చుకుంటే వడ్డీ 10-12 శాతం మించదని మాలేగావ్ వారికి సూచించాడు. సామాజిక నిధులంటే ఏమిటి? పేదలకు ఉపయోగపడుతుందని రూపాయి వడ్డీ చాలనుకునే విదేశీ మదుపుదారులున్నారు. వారు సామాజిక నిధిని ఏర్పాటు చేస్తారు. ఆ నిధి నుండి అప్పు తీసుకుంటే, 24 శాతం వడ్డీ వసూలు చేస్తే సరిపోతుందని ఆయన సూచన. ఆయనదే మరో సూచన, 12 శాతం వడ్డీ హామీతో అంతర్జాతీయ పబ్లిక్ ఆఫర్‌లు యివ్వమన్నది. ఈ ఐపిఓలో మదుపు పెట్టేవారు 30 శాతం వరకూ అదనపు ఆదాయం రావాలనుకుంటారు. ఆ లాభమొస్తే మార్కెట్టులో మరొకరికి అమ్ముకుంటారు తప్ప, సంస్థ యిచ్చే వడ్డీకోసం ఎదురు చూడరు. అంటే మిగిలిన కంపెనీల్లాగే సూక్ష్మరుణ సంస్థలు కూడా షేరు మార్కెట్లో తమ విలువ పెంచుకునే పనిలో వుండాలి. అంటే లాభాలెక్కువరావాలి. అంటే పరోక్షంగానో,

(తరువాయి 12వ పేజీలో)

## సూడాన్... (3వ పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేసాయని గోష్ ఆరోపించాడు. వాస్తవానికి వెల్లువెత్తిన ప్రజానిరసనలు చూసి ఇవి సంభ్రమం చెందాయి. అవి కలిసి పనిచేసేందుకు ఒక రాజకీయ వ్యూహాన్ని రూపొందించు కోలేకపోయాయి. ఉత్తర సూడాన్‌లో సాగుతున్న ప్రజాందోళన దక్షిణానికి కూడా విస్తరించే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ ప్రజాందోళనను అదుపుచేసి, రాజకీయంగా పైచేయిని పొందటంకోసం అల్‌బషీర్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయి. అట్టడుగు నుండి వస్తున్న ఆందోళన దోపిడీ పాలకులను భయకంపితులను చేస్తున్నది.

జులైలో దక్షిణ సూడాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే ప్రక్రియ పూర్తవుతుంది. "ఒబామా సలిపిన కఠినతర కృషి ఫలితమ"ని ఎంత చెప్పుకున్నా సూడాన్ ప్రజలకు అంతర్యుద్ధ ముగింపు, శాంతిస్థాపనా ఎండమావులుగానే మిగులుతాయి. దక్షిణ సూడాన్ ప్రభుత్వాన్ని ఈ ప్రాంతంలో తన ప్రయోజనాలను కాపాడే ఏజంటుగానే అమెరికా తీర్చిదిద్దుతుంది. దీనికోసం దక్షిణ, ఉత్తర దేశాలమధ్య వైరాన్ని అది రెచ్చగొడుతూనే వుంటుంది. ఇరు భాగాలమధ్య రేపు ఏర్పడబోయే సరిహద్దును తమకనుకూలంగా నిర్ణయించేందుకు ఇప్పటికీ ఘర్షణలు జరుగుతున్నాయి. చమురు తరలింపుకు మరో ప్రత్యామ్నాయం ఏర్పడేవరకూ కొంత ఉద్రిక్తత తప్పదని కొందరు పరిశీలకులంటున్నారు. కానీ ఈ చమురు నిక్షేపాలే ఇరుదేశాల మధ్య ఘర్షణకు నెలవుగా అమెరికా సామ్రాజ్యవాదం చేస్తుందన్నది స్పష్టమే. 1960లలో నైజీరియాలోని బయాఫ్రానుండి ఎరిట్రియా, ఉగాండా వరకూ సాగిందిదే. ఇదే సూడాన్‌లో కూడా పునరావృతమౌతుంది.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆఫ్రికా ప్రజానీకం విప్లవిస్తే తప్ప, నూతన సోషలిస్టు సమాజ స్థాపనకు పూనుకుంటేతప్ప వారికి సుఖశాంతులు నిండిన జీవితం లభించదు.

**14-2-2011**

## విద్యార్థుల... (4వ పేజీ తరువాయి)

వచ్చిన ఉద్యోగంతోనే (అండర్ ఎంప్లాయిమెంటు) సరిపుచ్చు కుంటున్నారు. ఇది ప్రజా ద్రవ్య వనరుల వృధాయేగాక మానవ వనరుల వృధా కూడా జరిగి దేశ పురోగమనాన్ని నిరోధిస్తున్నది. అయినా ఆశ్రితవర్గానికి లాభాలు కట్టబెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నది.

విద్యను వ్యాపారంగా చూస్తూ, లాభార్జనావనరుగా పరిగణించటంతో వృత్తి విద్యా కాలేజీలు తామర తంపరగా పెరిగాయి. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించక పోయినా ఖాళీ సీట్లను నింపుకోవడానికి అనుమతించినా సీట్లు నిండని స్థితి ఏర్పడింది. దీనితో విద్యార్థులకు బ్యాంకుల ద్వారా రుణాలిప్పించే పథకాన్ని ప్రారంభించారు. అయినా సీట్లు నిండక పోవటంతో వృత్తివిద్యా కోర్సులలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్సు మెంటు పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిని రాష్ట్రం బిసిలకూ, ఈబిసిలకూ విస్తరించింది.

అయినా ఇప్పటికీ అనేక కాలేజీల్లో సీట్లు ఖాళీగానే వుంటున్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో మూడు ఇంజనీరింగ్ కాలేజిల్లో ఒక్క విద్యార్థికూడా లేదు.

ఈ ప్రైవేటు కాలేజీలను రక్షించేందుకే ప్రభుత్వం ఈ పథకాల్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆస్పత్రులను కునారిల్లజేసి ప్రైవేటు కార్పోరేటు ఆస్పత్రులకు ఆదాయం సమకూర్చిన ఆరోగ్య శ్రీపథకం లాగనే, ఫీజు రీయింబర్సుమెంటు కూడా వృత్తి కళాశాలల యాజమాన్యాలకు ఊపిరి అందించింది.

సీట్లు ఖాళీగా వుంటున్నందున కొన్ని కాలేజీలు మూతవేసే ఉద్దేశ్యంతోనే ఫీజుల చెల్లింపును ఆలశ్యం చేస్తున్నది. ఎస్సీ, ఎస్టీల ఫీజులకు నిధులు కేంద్రం నుండి వస్తున్నాయి. వచ్చిన వాటిని వచ్చినట్లు యిచ్చినా యాజమాన్యాలు గొడవకు దిగి వుండేవి కావు. ఇప్పుడు ఎవరిమీద వేటు పడుతుందోనని ఆందోళనకు దిగాయి.

అవసరం లేకపోయినా, గౌరవ ప్రద ఉపాధి దొరికే అవకాశం లేకపోయినా ప్రైవేటు కాలేజీలను ప్రోత్సహించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమే కాక, ఆ చదువులు కూడా సక్రమంగా సాగించుకోలేని ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

★

# భారత ప్రజా విముక్తి పోరాటానికి దారి చూపుతున్న ఉజ్వలమైన ప్రజా పోరాటాలు, రాజకీయ-సిద్ధాంత సంఘర్షణలు

**భారతదేశ** ప్రజలు ఏ చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల్లో ఎలాంటి పాత్ర నిర్వహించారో, ఎలా సమీకృతమయ్యారో, ఎలా సంఘటిత పడ్డారో, పోరాట చేవనెలా ప్రదర్శించారో, ఏ మార్గాల ననుసరించారో, పోరాట పద్ధతులనెంచుకోవడంలో వారు చూపిన చొరవ ఎలాంటిదో అర్థం చేసుకోవడం అవసరం. ఏ సిద్ధాంతం, ఏ విధానం వారిని నడిపించింది? వాటి ఆచరణ ఫలితాలను అర్థం చేసుకోవలసి వుంది. భారత విప్లవం అనుసరించవలసిన పంథాకు సమాధానం, మన పూర్వపు తరాల నుండి, వారి పోరాటాల నుండి ఒక మేరకు గ్రహించవచ్చు. వాటిని విశ్లేషించి గుణపాఠాలు నేర్చుకొని నేటి పరిస్థితికి అన్వయించుకోవచ్చు.

భారతదేశాన్ని ఒక దేశంగా, ఒక జాతిగా ఎక్కడ నుంచి, ఎప్పటినుంచి పరిగణనలోకి తీసుకోగలుగుతాం అన్న ప్రశ్నతో మొదలెడితే మనకు సరైన సమాధానం దొరకడం లేదు. ఫ్యూడల్ రాచరిక దేశాలు, పెద్ద పెద్ద సామ్రాజ్యాలు ఆవిర్భవించి సామాన్య ప్రజల మూపుల మీద, వారి శ్రమశక్తి సృష్టించిన సంపదలమీద ఆధారపడి తమ సామ్రాజ్యాలను నిర్మించి, పాలించారు. విదేశీ సామ్రాజ్యవాదులలో పోర్చుగీస్, డచ్చి, ఫ్రెంచివాదులు ప్రవేశించి తమ ఆధిపత్యాన్ని వెలిగించారు. అయినప్పటికీ ఎన్నో భాషలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలు, తెగలు, జాతులు, కులాలు ఎన్నో భౌగోళిక వాతావరణ స్థితిగతులు వున్న దేశంలో దాదాపుగా ఒక కేంద్రీకృత పాలన వెలగబెట్టింది బ్రిటీష్ సామ్రాజ్యవాదులే.

ఏది ఏమైతేనేం, బ్రిటీష్ వలస పాలన మాత్రం భారత, ఆర్థిక, సాంఘిక, రాజకీయ శక్తులను, వివిధ సమూహాలను పురోగమనం వైపుకు సాగనీయని వ్యూహాన్ని అమలు పరిచింది. భారత్‌లోని వివిధ సమూహాలను, వివిధ ప్రాంతీయులను అడకత్తెరలో పోకచెక్కలాగా చేసింది.

భారతదేశంలో ఉత్పత్తి పద్ధతిని "ఏసియాటిక్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్"–స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అని మార్క్స్, డా॥కొసాంబిలాంటి చరిత్రకారులు వివరించారు. దీని ప్రకారంగా సమాజం పురోగమించేదా? అక్కడికే కుచించుకుపోయేదా? అన్న విషయాన్ని అలా వుంచుదాం. కాని భారత సమాజ పరిణామ క్రమాన్ని బ్రిటీష్ సామ్రాజ్యవాదం కృత్రిమంగా నిర్దేశించ బూనుకోవడాన్ని ఏ ప్రగతిశీలుడూ సమర్ధించజాలడు. అనాదిగా ఆసియాలో మూడు పరిపాలనా విభాగా లుండేవి. 1.ఆర్థిక శాఖ లేక ఆంతరంగిక వనరులను కొల్లగొట్టే శాఖ. 2.యుద్ధ శాఖ లేక బాహ్య వనరులను కొల్లగొట్టే శాఖ. 3. పౌర సంక్షేమ శాఖ. ఇందులో మొదటి రెండు శాఖలను మాత్రమే బ్రిటీష్ వారు తన పూర్వపు దురాక్రమణదారుల నుండి స్వీకరించారు. మూడవ శాఖను పూర్తిగా వదిలేశారు. అందు మూలంగానే వ్యవసాయం పూర్తిగా ధ్వంసమైంది.

1857 నాటికే దేశీయ ప్రభుత్వాధిపతులు, సామాన్యులైన చేతివృత్తులవారూ, చిన్న రైతాంగం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. 1857 తర్వాత గూడా రైతాంగం, ముందు ప్రత్యక్షంగా వున్న జమీందార్లకూ, వడ్డీ వ్యాపారులకూ, తోటల యజమానులకూ వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు.

1866-68లలో బీహార్‌కు చెందిన దర్భాంగా, చంపారన్, నేడు బంగ్లాదేశ్ జెస్సోర్‌లో, 1883లో ఒకసారి, 1889-90లలో మరోసారి రైతాంగం తిరుగుబాట్లు చేశారు.

1836-54ల మధ్య భూమిశిస్తుకి వ్యతిరేకంగా 22సార్లు మలబార్ రైతులు తిరుగుబాటు చేశారు. అదే ప్రాంత రైతాంగం 1873-80ల మధ్య అదే సమస్యపై మరిన్ని తిరుగుబాట్లు చేశారు.

1893-94లో అస్సాంలో భూమి శిస్తు చెల్లించలేకపోయిన రైతుల భూములను స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకంగా అస్సాం రైతులు ప్రతిఘటించారు. 1820-37లలో కోల్‌లు, 1855-56లలో సంతాల్‌లు, 1879లో రంపగిరిజనులు, 1895-1901లలో ముండాజాతి ప్రజలు తిరుగుబాట్లు జరిపారు.

తూర్పు ఇండియా కంపెనీ ఏర్పాటు, అది ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాలకు వ్యాపించడానికి ఆటంకంగా వున్న భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి దాని శిథిలాలపై ఫ్యూడల్ వ్యవస్థను రక్షిస్తూ చాలా తాపీగా పెట్టుబడిదారీ అభివృద్ధిని సాగించాలన్న వ్యూహంతోనే బ్రిటీష్ వాళ్లు వ్యవహరించారు. యూరప్‌లో ఫ్యూడల్ రాచరిక వ్యవస్థలను తుడిచిపెట్టి బూర్జువా ప్రజాతంత్రాన్ని నెలకొల్పిన విధంగా భారతదేశంలో చేయదలచుకోలేదు. అది ఫ్యూడల్ శక్తులను దువ్వి, లొంగని వారిని అంతం చేసి-ఫ్యూడల్ శక్తులను సాంఘిక పునాదిగా చేసుకొని తన సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకొని దృఢపరచుకొంది. అత్యంత దిగజారుడు, స్వార్ధపరత్వంతో తన సామ్రాజ్యవాద లక్షణమైన అత్యంత నిరంకుశత్వాన్ని భారత్ ప్రజలపై అమలు జరిపింది. ఇది వారు తలచిన దానికి భిన్నంగా భారత్‌లోని వివిధ భాషా సమూహాల మధ్య, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలు ఏర్పడడానికి గూడ దోహదపడింది.

బ్రిటీష్ పాలన దుష్ఫలితాలను భారత ప్రజలు ఇక సహించడం, భరించడం సాధ్యం కాని పరిస్థితిని ఎదుర్కొనడానికి, మార్గాన్వేషణకు దోహదపడింది. స్వాతంత్ర్య, ప్రజాస్వామిక ఆకాంక్షలు చిన్న చిన్న తిరుగుబాట్లుగా తలెత్తాయి. సాత్విక అసమ్మతి ఉద్యమాలు మొదలయ్యాయి. గ్రామాలను వదలి పారిపోవడం; దాడులను తట్టుకోవడానికి ప్రక్క గ్రామాలకు వెళ్లి తలదాచుకోవడం; భూములను పాడుబెట్టి పంట పండించకపోవడం; భూములను వదిలి అంతు తెలియని చోటికెళ్లిపోవడం లాంటి సాత్విక ప్రతిఘటనలు రైతాంగం చేసింది. అంతేకాదు. భారతదేశ చరిత్రలో స్థానిక క్రూర ఫ్యూడల్ రాచరికాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద వలస పెత్తనానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు, తిరుగుబాట్లు జరిగాయి. తమ చేతికందిన ఆయుధాలతో రైతులు బహిరంగంగా సాయుధ తిరుగుబాట్లు చేసిన సందర్భాలున్నాయి.

1858కు ముందూ, ఆ తర్వాత దేశీయ ప్రభుత్వాధిపతులు, చేతి వృత్తులవారు, చిన్నరైతాంగం వలసపాలకులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారు. వాటిలో యివి చేరుతాయి:

**విశ్వం**

1820-37లలో కోల్‌ల తిరుగుబాట్లు

1836-54ల మధ్య భూమిశిస్తుకు వ్యతిరేకంగా మలబార్ రైతులు 22సార్లు తిరుగుబాట్లు చేశారు.

1853-75లలో దక్కన్ లో (మహారాష్ట్రలోని పూనా, అహమద్‌నగర్‌ల చుట్టూ) రైతులు తిరుగుబాట్లు చేశారు.

1855-56లలో బీహారు, బెంగాల్, ఒరిస్సాలలో సంతాలులు తిరుగుబాటు చేశారు.

1854 మరియు 1860లలో బెంగాల్, బీహార్‌లలో రైతాంగ తిరుగుబాట్లు వచ్చాయి.

1857లో 'విస్తారమైన ప్రాంతాల్లో బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా హిందు-ముస్లిం ప్రజలను ఐక్యంచేసిన, 'భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం'గా ప్రసిద్ధిగాంచిన సిపాయి తిరుగుబాటు జరిగింది.

1859-1873 మధ్యకాలంలో పాట్నా, సిరాజ్‌గంజ్ (బెంగాల్)ల చుట్టూ రైతాంగ పోరాటాలు జరిగాయి.

1859 మరియు 1921లలో మోప్లా రైతు పోరాటాలు జరిగాయి.

1866-68లలో దర్భాంగా, చంపారన్‌లలో (బీహార్) రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి.

1873లో, తిరిగి 1890లో తూర్పుబెంగాల్‌లోని జెస్సోర్‌లో రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి.

1879లో రంప(ఆం.ప్ర.) కోయలు తిరుగుబాటు చేశారు.

1893-94లో భూమిశిస్తు చెల్లించ నిరాకరించిన రైతుల భూముల స్వాధీనానికి వ్యతిరేకంగా అస్సాం రైతులు ప్రతిఘటించారు.

1895-1901లలో ముండా జాతి ప్రజలు తిరుగుబాట్లు చేశారు.

ఎక్కువ ప్రచారం, ఎక్కువ కీర్తింపుగల బ్రిటీష్ వ్యతిరేక ఫ్యూడల్ రాజుల తిరుగుబాట్ల కంటే ఉత్పత్తి శక్తులయిన రైతాంగం, వృత్తిపనివారలు, ఆదివాసీ తెగలు సాగించిన పోరాటాలు, తిరుగుబాట్లు; స్థానిక నిరంకుశులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలూ విస్తృతమైనవిగా వున్నాయి. మధ్యతరగతి మేధావివర్గం బ్రిటీష్ వ్యతిరేక ఆలోచనలలోకి రావడంలో ఉత్పత్తి శక్తులయిన ఆదివాసులకంటే చాలా వెనుకపడ్డారు.

## నూతన చైతన్యం-నూతన రాజకీయశక్తులు:

19వశతాబ్దం చివరి నుంచి దళిత జాతులు, మహిళలు సాంఘిక మార్పు కోసం నడుం కట్టారు. వివిధ రాష్ట్రాలలో జన జాగృతి ఉద్యమాలు ప్రారంభమైనాయి. పురోగామి భావాల వ్యాప్తి కోసం, అక్షర జ్ఞానం వ్యాప్తి కోసం మొదలైన ఉద్యమాలు-పత్రికలు, పురోగామి సాహిత్య సృష్టి, వాటి వ్యాప్తి కోసం గ్రంధాలయోద్యమాలు ఒక నిర్దిష్ట రూపం తీసుకున్నాయి.

భారతదేశ వ్యాపితంగా 1920-40మధ్య మూడు దశాబ్దాలలో స్వాతంత్ర్య పోరాటం విస్తృత రూపం తీసుకొంది. సరిహద్దుల నధిగమించి వివిధ తెగల, జాతుల పోరాటాలు, రైతాంగ పోరాటాలు, కార్మికుల పోరాటాలు విస్తృతమయ్యాయి. పురోగామి భావాలు గల మధ్యతరగతి వర్గం వీటిని సమర్ధించడానికి, నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చింది.

బ్రిటీష్ పరిపాలకులు వారి దోపిడీ, పరిపాలనల కోసం అభివృద్ధి చేసిన రవాణా, కమ్యూనికేషన్ యంత్రాంగం, విద్య-వారి స్వీయాత్మక కోరికలకు భిన్నంగా భౌగోళిక భాషా, జాతి సరిహద్దులనధిగమించి ప్రజాతంత్రభావాలు ప్రజలమధ్య వ్యాపించడానికి దోహదపడ్డాయి. వేరు వేరు ప్రాంతాలలో సామాన్య ప్రజాశక్తుల మధ్య సంబంధాలను ఒక మేరకు సులభతరం చేశాయి. యూరప్‌లో జరిగిన బూర్జువా ప్రజాస్వామిక విప్లవాల గురించి, స్పెయిన్, జర్మన్, ఫ్రాన్స్, రష్యా దేశాలలో జరిగిన శ్రామిక వర్గ పోరాటాల గురించిన విజ్ఞానం అందుబాటులోకి రావడానికి దోహదపడ్డాయి. పురోగామి భావాలు, నూతన రాజకీయ అవగాహనలు విస్తృతపరచబడ్డాయి. ఒకరికొకరు ఎరుక పరచుకొనే భాషాంతరీకరణ పెద్ద ఎత్తున మొదలైంది.

ఈ విధంగా స్వాతంత్ర్య పోరాట శక్తుల మధ్య సమన్వయం, ఉద్యమ విస్తృతి, పురోగామి భావజాలాల వ్యాప్తి-అభివృద్ధి నిరోధకత్వంతో సంఘర్షణల మధ్యనే నూతన రాజకీయ శక్తుల అభివృద్ధీ, సామాజిక పురోగమన శక్తుల అభివృద్ధీ జరిగాయి.

నూతన రాజకీయ శక్తుల ఆవిర్భావం-స్వాతంత్ర్య పిపాసుల సంఖ్యను పెంచింది. వారు అనేక నిర్మాణాలుగా, వ్యక్తులుగా బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ధిక్కరించారు. గదర్ పార్టీ స్వాతంత్ర్యంకోసం సాయుధ ప్రతిఘటనకు సన్నాహాలు చేసింది. భగత్‌సింగ్ తదితరులు తమ ఉద్యమ ప్రారంభదశలో టెర్రరిస్టు పద్ధతులను అనుసరించారు. అల్లూరి రామరాజు, బిర్సాముండా, కొమరంభీం తదితరులు ప్రజాసాయుధ తిరుగుబాట్లను లేవనెత్తారు. ఈ కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ఎంతో కొంత అధికారం భారతీయులకు సాధించే కృషిలో వుంది. బ్రిటీష్ మహారాణి, బ్రిటీష్ పార్లమెంటు కృపాసారంతో అసెంబ్లీ, పార్లమెంటు వేదికలకు పోటీచేసి ఎన్నుకోబడ్డారు. శాంతి, అహింసా పద్ధతిని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. ప్రజా తిరుగుబాట్లకు అరాచకం, హింసావాదమని పేర్లు బెట్టి నిరసించింది, వ్యతిరేకించింది. దేశం స్వాతంత్ర్య కాంక్షతో అట్టుడుకుతున్న సమయంలో అత్యంత నిక్కచ్చిగా అహింసా విధానమనే జపం చేసింది. బ్రిటీష్ సామ్రాజ్య వాదుల పట్ల మర్యాద, మన్నన-మరీ ఆగ్రహం వస్తే శాంతియుత సత్యాగ్రహ పద్ధతిలో ఆందోళనలు చేసింది. వాటిని ఆగ్రహ భాండానికి రక్షిత కవాటంగా ఉపయోగపెట్టింది.

బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజాఉద్యమ వెల్లువలపై నీళ్లు చల్లడానికి, వలస పాలకులతో రాజీబేరాలకోసం ఒక పనిముట్టుగా వుపయోగించడానికి శాంతియుత సత్యాగ్రహ పద్ధతిని గాంధీ నాయకత్వం అత్యంత నైపుణ్యంగా అమలు జరిపింది.

## బ్రిటీష్ ప్రభుత్వ అణచివేత చట్టాలు-సంస్కరణలు

బ్రిటీష్ ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని జోకొట్టడానికి, అణచివేయటానికి ఒకే సమయంలో సంస్కరణ చట్టాలు-అణచివేత చట్టాలు 19వ శతాబ్దానికి ముందు నుంచే ప్రారంభించింది. సంస్కరణలు అమలు జరపడానికి కాదనీ, ప్రజలను భ్రమలలో వుంచి కాలయాపన సాగించడానికీ, ప్రజా సంఘటిత శక్తి రూపొందకుండా అడ్డుకొనడానికీ ఎన్నో రకాల చట్టాలను చేసింది. పత్రికాస్వేచ్ఛను, వాక్‌సభా స్వాతంత్ర్యాలను అరికట్టడానికి, ప్రజలను నిరాయుధం చేయడానికి, అణచిపెట్టడానికి అనేక చట్టాలు చేసింది.

19వ శతాబ్దపు చివరి దశలో భారత జాతీయోద్యమానికి అనువైన కొత్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

1908లో తిలక్‌ని అరెస్టు చేసినందుకు అసమ్మతిగా బొంబాయి బట్టల మిల్లు కార్మికులు సమ్మె చేశారు. ఇది భారత కార్మికవర్గం జరిపిన మొదటి రాజకీయ సమ్మె. ప్రముఖ నాయకులందరికీ శిక్ష విధించారు. కొంతమంది తప్పించుకొని విదేశాలకు పోయారు. 1906-1909 మధ్య ఒక్క బెంగాల్‌లోనే 500పైగా రాజకీయ కేసులు పెట్టారు. వ్యవసాయదారుల తిరుగుబాటులను పంజాబ్‌లో క్రూరంగా అణచివేశారు.

## పెల్లుబికిన రైతాంగ, కార్మికవర్గ ఉద్యమాలు:

1914లో రష్యాని జపాను ఓడించడం, 1917లో రష్యా శ్రామికవర్గ నాయకత్వాన విజయవంతమైన అక్టోబరు విప్లవం భారత ప్రజలను ఉత్తేజపరిచాయి. భారతదేశంలో పెద్ద సంఖ్యలో సామాన్య ప్రజానీకం వలసవాద వ్యతిరేక ఉద్యమాలలోకి వెల్లువెత్తారు. వీటిని అణచడానికి, అదుపులో ఉంచడానికి ప్రత్యేక చట్టాలు, ప్రత్యేక అధికారాలు బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పర్చుకొంది. (ఇండియా రక్షణ చట్టం) విప్లవోద్యమానికి సంబంధించిన కుట్ర నేరాలను విచారించడానికి రౌలట్ కమిటీని 1917లో నియమించారు. 1919లో దీనిని చట్టం చేశారు. పంజాబ్ ప్రజాపోరాటాన్ని అత్యంత కిరాతకంగా అణచడానికి చట్టాన్ని వినియోగించారు. 1920లో, 21లో గూడ నిర్బంధకాండ మధ్యనే ప్రజాఉద్యమం పురోగమించింది. 200 సమ్మెలు-15 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. పన్నుల నిరాకరణోద్యమం, గుంటూరుజిల్లా పెదనందిపాడులో గాంధీ అనుమతి లేకుండా కాంగ్రెసు కార్యకర్తలు ప్రారంభించారు. ఆ రైతులను వెంటనే పన్నులు చెల్లించమని గాంధీ లేఖ రాశాడు. చౌరీచౌరా, బార్డోలీ సంఘటనలు గాంధీగారికి నచ్చలేదు. మోప్లా రైతాంగం తిరుగుబాటు, 1924 కాన్పూరు కుట్రకేసు విచారణలో వ్యక్తం చేయబడిన విప్లవ రాజకీయ సూచనలను ప్రభుత్వం నిశిత పరిశీలనలోకి తీసుకుంది. 1926-27, 28లలో కార్మికోద్యమం విజృంభించింది. బెంగాల్‌లో చిట్‌గాంగ్ ఆయుధాగారం నుండి సూర్యసేన్ నాయకత్వాన పెటీబూర్జువా విప్లవకారులు ఆయుధాలను స్వాధీనం చేసుకొన్నారు. సంయుక్త పరగణాలలో రైతుల పన్నుల నిరాకరణోద్యమం సాగింది. పెషావర్ పది రోజులపాటు ప్రజాఉద్యమకారుల చేతిలో వుంది. దీనిని అదుపులో పెట్టడానికి గర్వాల్ సైనికులను పంపాడు. ప్రజలపై కాల్పులు జరపడానికి సైనికులు నిరాకరించారు. కార్మికులు షోలాపూర్ పట్టణాన్ని ఒక వారం రోజుల పాటు అంటే, మార్షల్ లా ప్రకటించేవరకు తమ స్వాధీనంలో వుంచుకున్నారు. 1942లో మహారాష్ట్రలోని సతారాలో ప్రజలు "ప్రతిసర్కార్" ని ఏర్పాటు చేశారు. అది పదిరోజులపాటు పరిపాలన సాగించింది. అదే విధంగా, 1942లోనే, తూర్పు ఉత్తరప్రదేశ్-ఉత్తర బీహార్ ప్రాంతం, అంటే బలియాలో ప్రజలు ప్రతిసర్కార్ ఏర్పాటు చేశారు. తిరిగి, అదే సంవత్సరం, మిద్నపూర్ (పశ్చిమబెంగాల్) ప్రజలు "తామ్రలిప్తో సర్కార్" ఏర్పాటు చేశారు. ఈ ప్రజాచర్యలు గాంధీవాదం మూలంగా విషాదాంతంగా ముగిసాయి.

**1920-40 -ఈ మూడు దశాబ్దాలలో మహత్తర ప్రజా ఉద్యమాలు నడిచాయి. అయితే అవి విషాదకరంగా ముగిసినందువల్ల ఏమీ లాభాలు లేవనుకోలేము. ప్రజా చైతన్యం, ప్రజల ఉత్సాహమూ, సహకారమూ, త్యాగమూ కావలసినంత దొరికింది. తాత్కాలిక వైఫల్యాలు ఈ ఫలితాలను వృధా చేయజాలవు. భవిష్యత్ పోరాటాలకు సోపానాలుగా వుంటాయి. వాటిని విశ్లేషించి అర్థం చేసుకోవడమే కమ్యూనిస్టు పార్టీ బాధ్యత.**

**2**

## భారత కమ్యూనిస్టు పార్టీ

భారత కమ్యూనిస్టు పార్టీ 1921-25ల మధ్య ఏర్పడింది.( పార్టీ పుట్టిన తేదీని మన పార్టీ ఇంకా ఖరారు చేయవలసే ఉంది.) సోషలిజం, కార్మిక కర్షక రాజ్యం, స్వాతంత్ర్య సాధన అన్న లక్ష్యాలతో సామాన్య ప్రజానీకాన్ని సంఘటితపరచింది. ఫ్యూడల్ జమీందారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రచార ఆందోళనా పోరాటాలను నిర్మించింది. కమ్యూనిస్టులు 1942 దాకా

బహిరంగంగా పనిచేయ సాధ్యం కాలేదు. 1921 నుంచి అది అనేక కుట్ర కేసులనెదుర్కొంది. లాహోర్, పెషావర్, మీరట్, కాన్పూరు కుట్ర కేసులను ఎదుర్కొన్నది. స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రజా స్వాతంత్ర్యోద్యమంగా కమ్యూనిస్టులు అభివృద్ధి చేస్తారని, గ్రామీణ పేదలు, కార్మికులు ఉద్యమ నిర్మాతలుగా ముందుకు వస్తారనే భయంతో భారతదేశంలో పిండరూపంలోనే కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేయాలని నిశ్చయాత్మకంగా వ్యవహరించింది.

1924 కాన్పూర్ కుట్రకేసు, 1929 మీరట్ కుట్రకేసులు కమ్యూనిస్టులు నిర్మిస్తున్న కార్మికవర్గ ఉద్యమాన్ని అణచివేయడానికి, దాని పురోగమనాన్ని అడ్డుకోడానికి పన్నిన ప్రభుత్వ కుట్ర. అది తాత్కాలికంగా కార్మికోద్యమ వేగాన్ని తగ్గించింది. కానీ కార్మికోద్యమాన్ని నాశనం చేయలేకపోయింది. అది తేరుకుని రెండేళ్లలోపే విజృంభించింది.

ప్రభుత్వ నిర్బంధం కంటే కార్మికోద్యమాన్ని నాశనం చేసిందీ, దానిని సారవిహీనం చేసిందీ, కార్మికోద్యమంలో ప్రవేశించిన సంస్కరణవాదమే. ఈ సంస్కరణవాదులు కార్మికోద్యమ సంఘటిత శక్తిని పటిష్టపర్చడానికి బదులు అవకాశవాదంతో చీల్చే కుట్రలు చేసి, నియంతృత్వంగా సంఘాలను నడిపించారు. ఇది భారతదేశ విప్లవానికి నాయకత్వ పాత్ర పోషించవలసిన కార్మికవర్గం ఆ పాత్ర నిర్వహించ వీలులేని పరిస్థితిని కల్పించింది.

కార్మిక కర్షకులలో, విద్యార్థి, యువజనులలో, మహిళల్లో, చైతన్య కాంతులను నింపుతున్న కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాపితంగా మూడవ పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. ఆ తర్వాత అనేక నిర్బంధ వ్యతిరేక ఉద్యమాలను నడిపింది. అజాద్ హింద్ సైనికుల నిర్బంధానికి వ్యతిరేకంగా, హిందు-ముస్లిం మత కలహాల నివారణకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. సంస్థాన ప్రజల్లో ప్రజాస్వామ్య హక్కుల కోసం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్మించింది.

విజయోన్మాదులైన సామ్రాజ్యవాదులు అజాద్ ఫౌజ్ నాయకులమీద క్రూరమైన విచారణ జరిపినప్పుడు, దేశమంతా పట్టరాని ఆగ్రహంతో ఒక్కుమ్మడిగా లేచి, ఆజాద్ ఫౌజ్ సైనికులను బేషరతుగా విడిచిపెట్టాలని గర్జించింది.

1945 నవంబరులో ఈ ఉద్యమాన్ని బలపరుస్తూ, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన కలకత్తా విద్యార్థులూ, కార్మికులూ ముందు నిలచి, బ్రహ్మాండమైన హర్తాళులూ, సమ్మె ప్రదర్శనలూ చేశారు. కాంగ్రెస్, లీగు, కమ్యూనిస్టు జెండాల నీడన నడుస్తున్న వారి మీద పోలీసులు కాల్పులు సాగించారు. యుద్ధానంతరం, అప్పుడే మొట్టమొదటి భారతవీరులు నేల కొరిగారు. అంతిమంగా విజయం సాధించారు.

## నావికుల తిరుగుబాటు

భారత నావికులు, వైమానికులు తమతోపాటు పనిచేస్తున్న బ్రిటీష్ వాళ్ళకు ఎలాంటి తిండి పెడుతున్నారో, వాళ్ళను ఎలా చూస్తున్నారో అలాగే తమను కూడా చూడాలని మాత్రమే కోరారు. అంతకంటే వారు కోరిందేమీ లేదు.

ఈ కోరికలను నెరవేర్చుకొనేందుకు భారత నావికులు పని మానేసి తమ నావలలోను, శిబిరాలలోను నిరసనవ్రతం సాగించారు. తమ కోర్కెలను తెలుపుతూ పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఆజాద్‌హింద్‌ఫౌజ్ సైనికుల్ని విడుదల చేయాలనీ, ఇండోనేషియా నుంచి భారత సైన్యాలను ఇంటికి రప్పించాలనీ కూడా కోరారు. తమ నావల మీద కాంగ్రెస్, లీగు, కమ్యూనిస్టు జెండాలను ఎగురవేశారు.

నావికాదళంలో నూతనంగా దేశభక్తి రేకెత్తడం చూసి అధికారులు మండిపోయారు. అరెస్టులతోను, తుపాకులతోను అణచివేయాలని చూశారు.

అప్పుడే మన భారత నావికులు తమ తమ నావలను స్వాధీనం చేసుకొని, దెబ్బకు దెబ్బ కొట్టారు. వారు కొద్దికాలమే ప్రతిఘటించగలిగారు. కానీ, ఈ వీరోచిత ప్రతిఘటనతో మన బొంబాయి, కరాచీ నావికులు నేటి విప్లవయుగ ప్రారంభానికి వైతాళికులైనారు. వారు ధైర్యంతోను, దేశభక్తితోను చేసిన ఐక్యపోరాటం భారత సైన్యాలన్నిటిలోను ఒక అద్భుతోత్సాహాన్ని పురికొల్పింది.

భారత నావికులను బలపరుస్తూ అనేకచోట్ల వైమానికులు సమ్మె చేశారు. ఎక్కడైనాసరే, భారత సైనికులు, తిరుగుబాటు చేస్తున్నవారిపై కాల్పులు జరపడానికి నిరాకరించారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన నడుస్తున్న భారత కార్మికవర్గం నావికుల తిరుగుబాటు యొక్క చారిత్రక ప్రాముఖ్యాన్ని గుర్తించింది. నావికుల పోరాటాన్ని బలపరుస్తూ దేశమంతటా-బొంబాయి, కలకత్తా, తిరుచనాపల్లి, మదరాసు-అన్నిచోట్లా బ్రహ్మాండమైన సమ్మెలూ, ప్రదర్శనలూ చేసింది.

బ్రిటీష్‌వాళ్లు టాంకులతోను, సాయుధ శకటాలతోను, తెల్లసైన్యాలను దింపారు. అమానుష హత్యాకాండతో ప్రజల్ని భయభ్రాంతుల్ని చెయ్యడానికి తెల్లసైన్యాలు వీధులకు ఎగబడ్డాయి. రెండురోజుల్లో రెండువందల మందికి పైగా శాంతిప్రియులయిన పౌరులను కాల్చి చంపారు.

నావికుల తిరుగుబాటు, దాన్ని బలపరుస్తూ భారత కార్మికులు చేసిన మహత్తరమైన ప్రదర్శనలూ ఏవో విడివిడి సంఘటనలు కావు.

- భారత నావికుల సమ్మె తర్వాత ఒకవారంలోపుగానే జబ్బల్‌పూర్‌లోని మూడువందల మంది మిలిటరీ సిపాయిలు సమ్మె చేసి, కాంగ్రెసు, లీగు, కమ్యూనిస్టు జెండాలను ధరించి వీధులవెంట నడిచారు. (మార్చి 4)
- మార్చి 8న విజయ దినోత్సవాలకు వ్యతిరేకంగా ఢిల్లీ కార్మికులూ, ప్రజలూ తమ అసమ్మతిని ప్రదర్శిస్తూ సమ్మె, హర్‌తాళ్ చేశారు. టౌన్‌హాలు మీద దాడిచేసి, తగులబెట్టారు.
- మార్చి 18న డెహ్రాడూన్‌లోని గూర్ఖా సైనికులను ఆఫీసర్లను అరెస్టు చేయడానికై బ్రిటీషువారు మిలిటరీని ఉపయోగించారు.
- రేషను కోతను నిరసిస్తూ అలహాబాదు పోలీసులు నిరసన వ్రతం పూనారు. (మార్చి 19)
- 10వేలమంది బీహారు పోలీసులు సమ్మె చేశారు. (ఏప్రిల్ 3)

పై విధంగా ఒకవేపు సైనికదళాలలో, పోలీసులలో విప్లవ వాతావరణం చెలరేగుతూంది. దానికి అనుగుణ్యంగా కార్మికవర్గంలో అప్రతిహతమైన సమ్మె వెల్లువ పొంగిపొర్లింది.

ఇన్నాళ్ళబట్టి పీల్చి పిప్పిచేసింది చాలదా అన్నట్లు శాంతికాలంలో గూడా బ్రిటీష్, ఇండియన్ పెట్టుబడిదారులు తమ పొట్టగొట్టే యత్నాలు చూసి, కార్మికులూ, ఇతర ఉద్యోగులూ పిడికిలి బిగించి తిరుగుబాటుకు సన్నద్ధమయ్యారు.

యుద్ధకాలం అంతటిలోనూ 1942లో సమ్మెలు అత్యంత ఉచ్ఛస్థాయికి పోయినాయి. కాగా, 1946వ సం॥ మొదటి ఆరు నెలలలోనే 1942 నాటి సమ్మెలకు రెట్టింపు సమ్మెలు జరిగినాయి.

ఏప్రియల్ నెలలో ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ సమ్మె బ్యాలెట్ తీసుకొంది-నూటికి నూరుమంది సమ్మె కనుకూలంగా ఓటు చేశారు.

ఈ సమ్మె ఉత్సాహం ఇతర ఉద్యోగస్థులు, బ్యాంకు గుమస్తాలూ, ప్యూనులూ, ప్రాథమికోపాధ్యాయులు చివరకు ప్రభుత్వ ఉద్యోగస్తులూ వీరిలో ఎంత సునాయాసంగా, విద్యుచ్ఛక్తిలాగా ప్రాకిందో చూస్తే-ప్రజా సామాన్యపు పోరాట చైతన్యం తీరు కనిపిస్తుంది.

ఇంకా, అమల్నేర్, సౌత్ ఇండియన్ రైల్వే, కాన్పూరు కార్మికులు యజమానుల నిర్బంధాలను ఎంత పట్టుదలతో ఎదుర్కొంటున్నారో చూడండి. ఈ ప్రధాన సమ్మెలకు సానుభూతి సమ్మెలు (బాంబేలో 4 లక్షలమంది. కలకత్తాలో పదహారు లక్షల పోస్టల్ కార్మికులు) గూడా పై పోరాట చైతన్యానికి తార్కాణాలే.

దేశవ్యాప్తంగా జరిగిన ఈ సంఘటనలు మధ్యతరగతి నిరంకుశ సంస్థానాలకు కూడా ప్రాకింది. 1920 మేలో షేక్ అబ్దుల్లా డోగ్రా రాజ వంశ నిరంకుశత్వాన్ని అంతమొందించాలనీ, ప్రజాస్వామ్య హక్కులు నెలకొల్పాలనీ బ్రహ్మాండమైన ఉద్యమం లేవదీశాడు. ప్రభుత్వం చెప్పరాని హింసాకాండను అమలు జరిపింది. ప్రజలు దెబ్బకు దెబ్బ తీశారు. హింసాకాండను ప్రతిఘటించారు.

జూన్ 20-21ల్లో దేశమంతటా నిరసన సభలూ, హర్తాళ్ళూ జరిగాయి. అందరూ కాశ్మీర్ ప్రజా పోరాటానికి అండగా నిలబడ్డారు. దేశంలోని పెట్టుబడిదారీ, జమీందారీ వర్గాలనూ, ప్రజా ప్రభుత్వాలనూ మంచి చేసుకొని ప్రజా విప్లవోద్యమాలకు వ్యతిరేకంగా ఉపయోగించుకోవాలన్న సామ్రాజ్యవాద పన్నాగం పారలేదు.

అందువల్లనే కాంగ్రెసు, లీగు తగాదాలను తీవ్రతరం చేసి; హిందూ ముస్లిం సోదరుల అంతఃకలహాల ద్వారా నెత్తురుటేరులు ప్రవహింపజేసి, పొంగుకొస్తున్న ప్రజా విప్లవోద్యమాలను ఆ రక్తంలో ముంచెత్తాలనుకున్నారు, బ్రిటీషు సామ్రాజ్యవాదులు. చాలా పట్టుదలగా తమ పథకాన్ని అమలు జరిపారు.

పరాయి సామ్రాజ్యవాదులతో రాజీబేరాలలో మునిగిపోయిన లీగు, కాంగ్రెసు నాయక వర్గాలిద్దరూ అనుసరించిన విచ్ఛిన్నకర పంథాలు మన ప్రజలను రెండు శత్రువర్గాలుగా విభజించాయేగాని, సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటాన్ని సంఘటితపరచలేదు. కలకత్తా, బొంబాయి, నౌఖలీ, బీహార్, మీరట్‌లలో భయంకర మతకలహాలను చెలరేగ జేయడానికి సామ్రాజ్యవాదులకిది చక్కని అవకాశమిచ్చింది.

అంతకు కొద్దిరోజులక్రితమే సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించి మహత్తరమైన హిందూ-ముస్లిం ఐక్య పోరాటాలను నడిపి, పరాయి పాలకులను గజ గజలాడించిన భారత ప్రజలపై ఆ పరాయి పాలకులు తీసిన ఎదురుదెబ్బే యీ మతకలహాలు. కాంగ్రెస్ నాయకులు సామ్రాజ్యవాద ప్రభుత్వపు ప్లానును కాలదన్ని, దేశ స్వాతంత్ర్యం కోసం, జాతుల స్వయం నిర్ణయ హక్కుకోసం ఐక్య పోరాటానికి ముస్లిం ప్రజలను కలుపుకు రావడానికి బదులు, సామ్రాజ్యవాద ప్రభుత్వంతో రాజీబేరాలు సాగించారు. వారి ప్లానును ముస్లిం లీగు మీద ఒక ఆయుధంగా ఉపయోగించాలనుకున్నారు.

అంతకుముందు జరిగిన ఘటనలవల్ల నిరాశ చెందిన కాంగ్రెసు ప్రజానీకంలో ఈ పంథా ఫలితంగా ముస్లింలపై ద్వేషం పెరిగింది. హిందూ దురభిమానం కాంగ్రెసులో వ్యాపించింది. బ్రిటిషు సామ్రాజ్య ప్రభుత్వం మీదికి ఎదురు తిరగగల శక్తి ప్రజల్లో ఇకనేమాత్రం మిగలకుండా హరించిపోయే వరకు మతకలహాల్లో పడి అలాగే కొట్టుకుంటూ ఉండాలనేదే బ్రిటీష్ అధికారుల ఉద్దేశ్యం. వారి పథకాలు, ఉద్దేశాలు తాత్కాలికంగానైనా నెరవేరాయి.

తూర్పు బెంగాలు, బీహారు, యు.పి. రాష్ట్రాల గ్రామసీమల్లో భూస్వాముల దోపిడీని ప్రతిఘటించి రైతులు సాగించిన ఐక్య పోరాటాలను, ఈ హిందూ ముస్లిం హత్యాకాండ కొన్నాళ్ళ వరకూ చిందర వందర చేసింది. 1946వ సంవత్సరారంభంలో అగుపడిన ఐక్య ప్రజా పోరాట అరుణోదయాన్ని ఈ మతకలహాల కారుమేఘం కప్పేసినట్లుగా కొంతవరకు కనిపించింది

- అటు కలకత్తాలో హిందూ-ముస్లిం సోదరుల పరస్పర హత్యాకాండ సాగుతూన్న రోజుల్లోనే హిందూ-ముస్లిం కార్మికులతో కలిసి, కార్మికవర్గ హక్కుల కోసం తుపాకుల నెదురొడ్డి నిలిచారు.
- అటు కలకత్తా వీధుల్లో హిందూ-ముస్లిం మత దురభిమానులు ఒకరి తలలు ఒకరు నరుక్కుంటున్న రోజుల్లోనే, ఇటు 40వేల సౌత్ ఇండియా రైల్వే కార్మికులు-హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు అంతా చెట్టాపట్టాలు పట్టుకొని తమ హక్కులకోసం ఉజ్వల పోరాటం సాగించారు. (1946 ఆగష్టు 24 మొదలు సెప్టెంబరు 23 వరకు)
- గోల్డెన్ రాక్‌లో నాలుగువేల కార్మికులు, తమ నాయకుడయిన ఇస్మాయిల్ ఖాన్‌ను విడిపించు కోడానికి పోలీసు తుపాకుల నెదిరించి నిలిచారు.
- బొంబాయి, ఢాకా తదితర ప్రదేశాల్లో మతకలహాలు చెలరేగుతూన్న సమయంలో, ఇటు పాట్నా, బెగుసరాయ్ నగరాలలో హిందూ-ముస్లిం మిలిటరీ పోలీసులు తమ హక్కుల కోసం నిరసన వ్రతం సాగించారు. (సెప్టెంబర్ 25.)
- నౌఖలీలో దేశానికంతటికీ సిగ్గుచేటయిన ఘటనలు జరుగుతూన్న రోజుల్లోనే తిరువాంకూరు సంస్థానం లోని అలెప్పీలో అన్ని మతాల, అన్ని వర్గాల కార్మికులు కలిసి ప్రజాతంత్ర హక్కుల కోసం చరిత్రాత్మక పోరాటాలు సాగించారు. (అక్టోబరు 25-30)
- బీహారులో మానవత్వాన్ని మరిచిపోయిన మూకలు సోదర ప్రజలను ఊహింప రానటువంటి హత్యా కాండకు గురిచేస్తున్న రోజుల్లోనే తెలంగాణాలో అన్ని మతాల రైతాంగమూ ఏకమై జమీందారీ పీడనమీద తిరుగుబాటు ప్రారంభించారు. వెట్టిచాకిరీని అంతమొందించారు. మార్షల్లాను, హైదరాబాదు మిలటరీని ధిక్కరించి తమ విజయాన్ని కాపాడు కోడానికి ఐక్యతతో నిలిచారు. జమీందారీ విధానానికి ఈ దేశంలో ప్రధాన కేంద్రమయిన హైదరాబాదు సంస్థానాన్ని పునాదులతో ఊపివేశారు. (నవంబరు 16)

**కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రజాపోరాటాలను విశ్లేషించుకొని ప్రజలకు సరైన మార్గం చూపించే ప్రయత్నం చేసి వుండవలసింది. భారత స్వాతంత్రోద్యమానికి నాయకుడుగా ముందు పీఠిన నిలబడవలసింది. మార్క్సిస్టు-లెనినిస్టు దృక్కోణం నుంచి విప్లవ దృక్పథాన్ని రూపొందించు కోవలసింది. కాని అలా చేయలేకపోయింది.**

## మత కలహాలకు విరుద్ధంగా కమ్యూనిస్టులు

తమను పీక్కుతింటున్న సామ్రాజ్యవాదులకు, జమీందార్లకు విరుద్ధంగా హిందూ-ముస్లిం కార్మిక, కర్షకులు ఒకమూల ఐక్యతతో నిలబడి పోరాడుతున్నారు. రెండోమూల తలయెత్తుకోడానికి వీలులేనంత భయంకరంగా యుద్ధము జరుగుతూంది.

ఈ మత కలహాలు తమ సమష్టి పోరాటాలకు, సమష్టి సంస్థలకు ప్రమాదం తెచ్చిపెడతాయని చైతన్యంగల కార్మిక కర్షకులు సహజంగానే గ్రహించగలిగారు. భారత ప్రజలు అందరూ పాల్గొంటున్న సామ్రాజ్య వ్యతిరేక పోరాటానికి ఆ కలహాలు పెద్ద దెబ్బ అని గుర్తించారు.

వెంటనే కలహాలను నిలువరించడానికి తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికి హసనాబాద్ ఒక ఉజ్వలమైన ఉదాహరణ. ఈ హసనాబాద్, కల్లోలాలకి మంచి కేంద్రం అనదగిన టిప్పెరా, నౌఖలీ జిల్లాల సరిహద్దులో వుంది. హసనాబాద్ హిందూ-ముస్లిం ప్రజానీకం యొక్క ఐక్య పోరాటానికి బలవత్తరమైన కేంద్రంగా తయారు కావడానికి కమ్యూనిస్టుల నాయకత్వమే కారణం. రెండు మతాలవారిలోని రైతులను చైతన్యవంతులను చేసి నడిపించారు.

చైతన్యవంతులైన రైతు యువకులు బహు క్రమశిక్షణతో నడిబజారులలో లాఠీలతో గస్తీ నిలబడ్డారు. పేటలు, ఇండ్లు, వాకిళ్ళు, కాపుకాచారు. చుట్టుపక్కలనుండి పరస్పర దాడి రాకుండా రాత్రింబవళ్ళు రోడ్లు, కాలవ రేవులూ కాపలా కాచారు.

కలహాలను నిరసిస్తూ డార్జిలింగ్‌లో మంచి సమయంలో సర్వవ్యాప్త సమ్మె, హర్తాళ్ జరిగినాయి. దానితో తగాదా ప్రేరకులకు కాళ్ళూ చేతులు ఆడలేదు.

ఎక్కడెక్కడ కార్మిక సంస్థలు బలంగా వున్నాయో అక్కడక్కడ కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంస్థలు వేలకొలది కరపత్రాలు ప్రచురించి పంచిపెట్టారు. వానిలో తగాదాలు ప్రేరేపించేటందుకు సామ్రాజ్యవాదులు చేస్తున్న కుతంత్రాలన్నిటినీ విస్పష్టంగా చెప్పారు. లీగు, కాంగ్రెసు నాయకత్వాలు అవలంబిస్తున్న ప్రమాదకరములయిన విధానాలను బట్టబయలు చేశారు. గూండాలకు, తగాదాకోరులకు విరుద్ధంగా హిందూ-ముస్లిములు సమష్టిగా శాంతిరక్షణకు ప్రయత్నాలు చేయమని హెచ్చరించారు. మత తగువుల నివారణకు ప్రజా కార్యక్రమాన్ని కమ్యూనిస్టులు చేపట్టారు.

తూర్పు బెంగాలులోనూ, ఉత్తర బెంగాలులోను; బీదరైతులలోనూ, కౌలుదారులలోనూ చిరకాలంనుంచి రగుల్కొంటూన్న అసంతృప్తిని కమ్యూనిస్టు పార్టీ, కిసాన్ సభలు గమనించాయి. రైతుకు పంటలో రెండు వంతులు దక్కాలనీ, భూస్వామికి ఒక్క వంతుకంటె ఎక్కువ ఇవ్వగూడదనేది వారి కోరిక.

నౌఖలీ, టిప్పెరాలలో కొట్లాటలు ఇంకా రగుల్తూన్న కాలంలోనే కిసాన్ సభ 'తెభాగా' వుద్యమానికి పిలుపు నిచ్చింది. ఉడికిపోతూన్న హిందూ-ముస్లిం కౌలుదార్లు అతి స్వల్పకాలంలోనే ఉద్యమంలోకి వురికారు. "నేడు పంట విషయం తేలుద్దాం. రేపు భూమి సంగతి చూద్దాం" అనే యుద్ధనినాదం వేల ప్రజల నోళ్ళ ప్రతిధ్వనించింది. ఈ ఉద్యమం 19 జిల్లాలకు పాకింది. నౌఖలీ-టిప్పెరా జిల్లాలకు నాలుగు మూలలనుంచీ ఉద్యమం కమ్ముకొని ముట్టడించి వేసింది.

పంట చేల మీద వుండగానే 'తెభాగా' వుద్యమం ప్రారంభమయింది. 'తెభాగా' హిందూ వ్యతిరేకోద్యమం అంటూ విచ్ఛిన్నకారులు దుష్ప్రచారం ప్రారంభించే లోపుగానే నలుమూలలకూ పాకిపోయి ఐక్య వుద్యమం బలపడిపోయింది.

'తెభాగా' కొరకై హిందూ-ముస్లిము రైతులు ఐక్యతతో సాగిస్తూన్న పోరాటాన్ని నిర్బంధ విధానం అణచలేకపోయింది. దుష్ప్రచారం సడలించలేకపోయింది. అభ్యంతరాలన్నింటినీ తొలగదోసుకొని అది సాగింది. ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని గెరిల్లా పోరాట పద్ధతులలో వారు ప్రతిఘటించారు.

హిందూ-ముస్లిం-నిమ్నజాతులకు చెందిన బెంగాల్ ప్రజాసామాన్యం జమీందారీ విధానానికి వ్యతిరేకంగా యుద్ధం సాగించింది. నౌఖలీ, టిప్పెరాలలో కొట్లాటల వలన వచ్చిన తలవొంపులు 'తెభాగా' వుద్యమం కోసం హిందూ-ముస్లిం రైతులు సాధించిన ఐక్యత ముందు తుడిచిపెట్టుకొని పోయినాయి.

బీహార్ రైతాంగం కూడా కదిలింది! ఇంతవరకు ఇస్తూన్న మాదిరిగా జమీందారుకు సగం పంట ఇవ్వలేమనీ, ధన రూపంలో మక్తా నిర్ణయించబడాలనీ వారి నినాదం.

పంటకోసి ఇంటికి చేర్చుకుంటాం. మక్తా కాలక్రమంలో పంట అమ్ముకొని ఇస్తాం. ఇది వారి నినాదం. బీహార్‌లోని హిందూ-ముస్లిం రైతాంగం జమీందార్ల నుండి తమ కోరికలను సాధించుకునేటందుకై ఐక్యమయ్యారు.

కలకత్తాలోనూ, కలకత్తా చుట్టూ వున్న పరిశ్రమల కేంద్రాలలోనూ ఒక కొత్త సమ్మెల తరంగం అతివేగంగా విజృంభిస్తూంది. ఈ సమ్మెలలో హిందూ-ముస్లిం కార్మికుల మధ్య ఐక్యత ధృడతరం అవుతూంది.

కల్లోలాలకు వ్యతిరేకంగా కార్మికులు ఆరంభించిన ప్రతిఘటనకు కలకత్తాలోని 34 కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలోని 20వేలమంది గుమస్తాలు ఒకరోజు సమ్మె చేశారు.

కాన్పూరులో టెక్స్‌టయిలు పనివారు చేసిన సర్వవ్యాపిత సమ్మె, నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా కార్మికులు, పౌరులు ఒకే త్రాటి మీద నిలబడ్డారు. ఈ

**(తరువాయి 8, 9 పేజీలలో)**

> *ఎక్కువ ప్రచారం, ఎక్కువ కీర్తింపుగల బ్రిటీష్ వ్యతిరేక ఫ్యూడల్ రాజుల తిరుగుబాట్ల కంటే ఉత్పత్తి శక్తులయిన రైతాంగం, వృత్తిపనివారలు, ఆదివాసీ తెగలు సాగించిన పోరాటాలు, తిరుగుబాట్లు; స్థానిక నిరంకుశులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలూ విస్తృతమైనవిగా వున్నాయి. మధ్యతరగతి మేధావివర్గం బ్రిటిష్ వ్యతిరేక ఆలోచనలలోకి రావడంలో ఉత్పత్తి శక్తులయిన ఆదివాసులకంటే చాలా వెనుకపడ్డారు.*

**భారత...** (7వ పేజీ తరువాయి)

విషయములో శ్రామికవర్గం ముందంజవేయడం గమనించ తగింది.

1943లో కయ్యూరు రైతాంగ తిరుగుబాటు (కేరళ), 1946-51లో హైదరాబాదు నిజాం సంస్థానంలో తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం, 1946లో తిరువాన్కూరు సంస్థానంలో పున్నప్రవాయలార్ ఉద్యమం, 1948లో బెంగాల్‌లో తెభాగ ఉద్యమం, తూర్పు బెంగాల్‌లో మైమైన్‌సింగ్ సరిహద్దులో సాయుధ ప్రతిఘటనలు, మహారాష్ట్రలో అహ్మద్‌నగర్‌లో భూముల కోసం రైతుల పోరాటాలు ఆయా రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన జరిగాయి. తెలంగాణా పోరాటం గెరిల్లా పోరాట స్థాయికి చేరిన రైతాంగ సాయుధ పోరాటం. 4వేలమంది అమరులైన పోరాటం. 3వేల గ్రామాలు, 10 లక్షల ఎకరాలు ప్రజల స్వాధీనంలోకి వచ్చాయి. ఫ్యూడల్ నిరంకుశ భూస్వాములు వారి గడీల నొదిలి పారిపోయారు.

**బ్రిటీష్ వలసపాలకులు భారత ప్రజల పోరాటాలను కాలరాచి వేయడానికి అనేక ఎత్తుగడలను అనుసరించారు. అణచివేత-సంస్కరణలు- విభజించు-పాలించు అన్న పద్ధతిని నాజుకుగానూ, మొరటుగానూ ఉపయోగించారు. ప్రజలు తమ హక్కుల కోసం దోపిడీ వర్గాలపై సాగించిన పోరాటాలు వారి ఎత్తులను పూర్తిగా పారనీయలేదు. ప్రజా పోరాటాలను ప్రక్కదారులు పట్టించే శక్తులను బ్రిటీష్ పాలకులు పెంచి పోషించారు. నేటి పాలకులు అదే దారిలో వున్నారు.**

3

## పంథా కోసం పెనుగులాట

పార్టీ రెండవ కాంగ్రెసు (1948) స్వాతంత్ర్యాన్ని బూటకపు స్వాతంత్ర్యమనీ, బూర్జువావర్గం మొత్తం, జాతీయ బూర్జువా వర్గంతో సహా సామ్రాజ్యవాద శిబిరంలో చేరిందనీ ఫ్యూడల్, బూర్జువా వర్గాలు అధికారం చెలాయిస్తున్నాయని నిర్వచించింది. కార్మికులు, రైతులు, మధ్యతరగతి, పట్టణ మధ్యతరగతి వర్గంతో కూడిన ఐక్య సంఘటన వుంటుందని నిర్వచించింది. కార్మిక ప్రజాతిరుగుబాట్ల-దేశ వ్యాపిత తిరుగుబాట్ల పంథాతో విప్లవం సాగుతుందని-స్థూలంగా రష్యా మార్గమని నిర్వచించింది. ఈ విప్లవం జనతా ప్రజాతంత్ర విప్లవమని, ప్రజాతంత్ర విప్లవం, సోషలిస్టు విప్లవం ఒకదానితో మరొకటి పెనవేసుకుసాగుతాయనీ, ఒక కొత్తవూపుతో ఈ కార్యక్రమం పూర్తిచేయబడుతుందనీ స్పష్టపరచింది.

ఈ రెండవ కాంగ్రెస్ (1948) పి.సి.జోషి నాయకత్వాన వున్న కేంద్ర కమిటీ యొక్క సంస్కరణవాద విధానాలను వ్యతిరేకించింది. బూర్జువా వర్గంలోని ప్రగతిశీలురను కాపాడాలనే వైఖరిని ఈసడించింది. అయినప్పటికీ అది తెలంగాణా రైతాంగ పోరాటాన్ని గూడా సంస్కరణవాద పోరాటంగా కొట్టివేసింది. తన ఒంటెత్తువాద కోణం నుంచి తెలంగాణా పోరాటాన్ని నిరాకరించింది. తెలంగాణా రైతాంగ పోరాటం వ్యవసాయ విప్లవ పోరాటంగా, తెలుగు భాషా సంస్కృతీ వికాస ఉద్యమంగా-నిజాం సంస్థానాధిపతి ఫ్యూడల్ పాలనను, ఇతర ఫ్యూడల్ దొరల పెత్తనాన్ని కూలద్రోసే, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి సాధించే లక్ష్యంతో సాగించిన పోరాటం. గ్రామాల పునాదిపై గెరిల్లా ఎత్తుగడలతో సాయుధ పోరాటంగా నిలదొక్కుకొనక ముందే ఆ పోరాటాన్ని ఈ ఒంటెత్తు పంథా దెబ్బతీసింది.

1947 స్వాతంత్ర్యం బూటకమని చెప్పడం వరకు ఈ మహాసభ సరిగ్గానే చెప్పినప్పటికీ, బూర్జువా వర్గాన్ని గురించి విస్పష్టమైన అవగాహన నివ్వలేకపోయింది. అంతేకాదు అతివాద ఒంటెత్తు విధానాలను చేబట్టింది. ప్రజాతంత్ర విప్లవ, సోషలిస్టు విప్లవ దశలను కలగాపులగం చేసి రెండుదశలు పెనవేసుకుసాగుతాయని చెప్పింది. మిత్రవర్గాల, శత్రువర్గాల మధ్య ఖచ్చితమైన గీతలేదు. మిత్రులు శత్రువులుగా పరిగణించబడ్డారు. 'కంటికి కన్ను పంటికి పన్ను' నినాదంతో వ్యక్తులపై దాడులు, ఆస్తుల విధ్వంస కార్యక్రమం యివ్వబడింది.

ఈ పంథా రెండు విధాల నష్టం కలిగించింది. ఒకటి: సరైన దిశలో సాగుతున్న తెలంగాణా రైతాంగ ప్రజా ప్రతిఘటనోద్యమం ప్రక్కదారి పట్టడానికి దారితీసింది. గ్రామీణ ప్రాంతాలలో గెరిల్లా స్థావరాల నిర్మాణం, వ్యవసాయ విప్లవోద్యమం విస్తరణ, విప్లవోద్యమ దీర్ఘకాలిక లక్ష్యాల కనుగుణంగా దేశవ్యాపితంగా చేయవలసిన సన్నాహాలు వమ్ముచేయబడ్డాయి. రెండు: కేంద్ర కమిటీలో మితవాద అవకాశవాదం భారత కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వంలో తిష్టవేసి కూర్చోవడానికి అవకాశమిచ్చింది. ఈ మితవాద అవకాశవాదులు బడాబూర్జువా వర్గంలో మంచివారిని వెతికి సోషలిజాన్ని వారిచేత స్థాపింపచేసే బాధ్యత నెత్తికెత్తుకొన్నారు. మంచి మంచి చట్టాలు, సంస్కరణలు చేయించి సమానత్వాన్ని సాధించవచ్చని నమ్మించ పూనుకున్నారు. విప్లవ ప్రజా ఉద్యమాన్ని విరమింప చేయడానికి కావలసిన కుయుక్తులన్నీ పన్నారు. బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలకు పీడిత ప్రజా ఉద్యమాలను దాసోహపరచి ద్రోహం చేశారు.

***అంతిమ పరిశీలనలో అతివాద ఒంటెత్తువాదం, మితవాద లొంగుబాటువాదం-రెండూ విప్లవ ప్రజా ఉ ద్యమాన్ని బలి తీసుకున్నాయి. అందుకే లెనిన్ మహాశయుడు అతివాద అవకాశవాదం, మితవాద అవకాశవాదం బొమ్మా-బొరుసుల్లాంటివనీ, కవలపిల్లలనీ నొక్కి చెప్పాడు. విప్లవ పక్షం వహించేవారు అతివాద అవకాశవాదం పట్ల ఉదారంగా ఉండటం విప్లవానికి హాని కలిగిస్తుంది. అతివాద అవకాశవాదం రివిజనిజాన్ని వ్యతిరేకించేంతవరకూ విప్లవ పక్షంగా కనబడుతుంది. కానీ అంతిమ పరిశీలనలో రెండూ ఒక తల్లి బిడ్డలే కాదు, కవల పిల్లలుకూడా.***

**ఆంధ్ర థీసిస్**

ఈ రెండు పెడధోరణుల నుండి తెలంగాణా ప్రజా విప్లవ పోరాట నాయకత్వంలోని ఒక సెక్షన్ విడగొట్టుకొంది. 1948 ఏప్రిల్‌లో ఒక థీసిస్‌ని రూపొందించి కేంద్ర కమిటీ ముందుంచింది. దీనినే ఆంధ్ర థీసిస్‌అని అంటారు. ఈ థీసిస్ మన వ్యవస్థ దళారీ బూర్జువా, భూస్వామ్య వ్యవస్థ అనీ, కార్మికవర్గ నాయకత్వాన కార్మిక కర్షక మైత్రిని నెలకొల్పుతూ, జాతీయ బూర్జువా వర్గాన్ని కలుపుకురావడం విప్లవ వ్యూహంగా నిర్వచించింది. అలాగే గ్రామస్థాయిలో కూలీలు, పేద రైతాంగం, మధ్యతరగతి, ధనిక రైతాంగంతో కూడిన సంఘటన నేర్పాటు చేయడం, ప్రజా విప్లవ పంథాలో వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించడం, గ్రామాలను విముక్తి చేస్తూ విముక్తి ప్రాంతాలను నిర్మించుకొంటూ సాగే విప్లవమనీ నిర్వచించింది.

ఈ థీసిస్ కేంద్ర కమిటీ ముందు వుంచేనాటికి తెలంగాణాలో అమలు జరుగుతూన్న విధానాలు దీని కనుగుణమైనవే. మితవాద, అతివాద అవకాశవాదాలు కలిగించిన గందరగోళాల, పెడవాదాల, లొంగుబాటు విధానాల మధ్య ఆనాడు సాగుతూన్న నిజాం వ్యతిరేక పోరాటానికీ, జమీందారీ, జాగీర్దారీ, ఫ్యూడల్ భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా సాగుతూన్న అనేక చిన్నా పెద్దా పోరాటాలకు ఒకదారి చూపింది. నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీకి ఒక సరైన విప్లవ రాజకీయ లక్ష్యాన్ని, మార్గాన్ని ఈ థీసిస్ అందించింది. కాని ఈ నాయకత్వం సంవత్సరం కంటే తక్కువే కేంద్ర నాయకత్వంలో వుండగలిగింది.

భారత ప్రజల పోరాటం ఎవరిపైన? భారత విప్లవ మార్గం ఏది? అన్న విషయాలు వివాదాస్పదంగా మారాయి. అంతర్జాతీయ నాయకత్వాన్ని సంప్రదించాలనే నిర్ణయం ప్రజా ఉద్యమ క్రమం ప్రతిష్టంభనకు గురయ్యింది. వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాలను సంస్థగా విశ్లేషించడానికి ఈ ప్రతిష్టంభన ఆటంకమయ్యింది; విశ్లేషించే బాధ్యతను కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం చేపట్టలేకపోయింది. తెభాగా, మైమెన్‌సింగ్, అహ్మద్‌నగర్, తెలంగాణా తదితర రైతాంగ వెల్లువలను, రైల్వే, పోస్టల్ కార్మికుల ఆందోళనోద్యమాలను అంతిమంగా శ్రామిక వర్గ అధికారాన్ని స్థాపించడం అన్న దృక్పధంతో విశ్లేషించబూనుకోలేదు.

## కమ్యూనిస్టు పార్టీ ఏం చేసి వుండవలసింది?

తూర్పు దేశాల కష్టజీవుల కమ్యూనిస్టు యూనివర్శిటీలో చేసిన ఉపన్యాసంలో స్టాలిన్ యిలా చెప్పారు. "జాతీయ విముక్తి ఉద్యమంలో స్వతంత్ర పాత్ర, జాతీయ విప్లవ సంఘటన ఏర్పాటు, ఈ సంఘటనలో కార్మికవర్గ ఆధిపత్యాన్ని నెలకొల్పుట, జాతీయ విముక్తి ఉద్యమానికి నాయకత్వం వహించడానికి కార్మికవర్గాన్ని సన్నద్ధం చేయడం, బూర్జువా వర్గాన్ని నాయకత్వ స్థానం నుంచి అంచెలంచెలుగా తొలగించడం."

భారత జాతీయ విముక్తి ఉద్యమంలో భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించవలసిన పాత్ర యిదేననీ, అది దాని చారిత్రక కర్తవ్యమనీ స్టాలిన్ వివరించాడు. "సామ్రాజ్యవాద ప్రమాదాన్ని గురించి భయపడే కంటే శ్రామిక వర్గ విప్లవాన్ని గురించే వలసదేశాలలోని అత్యంత సంపన్న వర్గాలు భయపడుతున్నాయి. బూర్జువా వర్గానికి చెందిన సెక్షన్‌లు విప్లవానికి బద్ధ వ్యతిరేకులయిన వారి శిబిరంలో చేరి కార్మికులకూ రైతాంగానికీ వ్యతిరేకంగా సామ్రాజ్యవాద అనుకూల కూటమిని ఏర్పాటు చేసుకొంటున్నాయని" గూడ స్టాలిన్ హెచ్చరించాడు.

> *ఈ విధంగా స్వాతంత్ర్య పోరాట శక్తుల మధ్య సమన్వయం, ఉద్యమ విస్తృతి, పురోగామి భావజాలాల వ్యాప్తి-అభివృద్ధి నిరోధకత్వంతో సంఘర్షణల మధ్యనే నూతన రాజకీయ శక్తుల అభివృద్ధీ, సామాజిక పురోగమన శక్తుల అభివృద్ధీ జరిగాయి.*

1945-46 నాటికే కార్మిక, కర్షక సమరశీల ఉద్యమాలు నిర్మించి, విస్తృత ప్రజానీకంలో స్థానం ఏర్పాటు చేసుకొన్నప్పటికీ, భారత దేశ నిర్దిష్ట పరిస్థితికి తగిన ఎత్తుగడల పంథాను రూపొందించుకోలేక పోవడానికి కారణాలున్నాయి.

**అవి:**

1. 1946-47 వరకు కమ్యూనిస్టు పార్టీ విధానాలను, దాని ఆచరణను పరిశీలిస్తే పై కర్తవ్యాల నిర్వహణలో అది విఫలమయింది. బూర్జువా నాయకత్వం క్రింద వున్న కాంగ్రెస్ వెనుకాల నడిచింది. బూర్జువా వర్గాన్ని స్వాతంత్ర్యోద్యమ నాయకుడిగా కీర్తిస్తూ బ్రిటీష్ వారితో చర్చలు సాగించే ప్రతినిధి హోదానిచ్చి గుర్తించింది. కమ్యూనిస్టు పార్టీ పాత్రను ప్రక్కనబెట్టింది.
2. హిందూ ముస్లిం ప్రజల ఐక్యత కొరకు కృషి చేసినప్పటికీ; కాంగ్రెస్-ముస్లిం లీగ్ ఏకం కావాలనే నినాదాలిస్తూ దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రతినిధులయిన వారిద్దరినీ గౌరవప్రద స్థానంలో వుంచింది. రెండు జాతుల సిద్ధాంతాన్ని సమర్థించి దేశ విభజనకు సహకరించింది. ఈ వైఖరితో జాతీయ విముక్తి ఉద్యమానికీ, అందులో పాల్గొన్న కార్మిక, కర్షక ఉద్యమాలకు నష్టం కలిగించింది.
3. అంతర్జాతీయ కమ్యూనిస్టు సంస్థ యిచ్చిన పిలుపు-ఫాసిస్టు కూటమికి వ్యతిరేకంగా ప్రజా యుద్ధ పిలుపుని యాంత్రికంగా బలపర్చి భారత స్వాతంత్ర్యానికి శత్రువైన బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని ప్రక్కకుబెట్టింది.
4. స్వాతంత్ర్య పోరాటానికి నాయకుడిగా బూర్జువా వర్గాన్ని గుర్తించిన దాని కొనసాగింపుగానే బూర్జువా వర్గాన్ని-అభివృద్ధికర, అభివృద్ధి నిరోధక సెక్షన్లుగా తప్పుగా వర్గీకరించింది. అభివృద్ధి నిరోధకుల బారినుంచి అభివృద్ధి కాముకులను కాపాడే పాత్రను ఆపాదించుకొంది. స్వతంత్ర పాత్రను విడిచి పెట్టడమే కాక బూర్జువా వర్గంలోని ఒక సెక్షన్ పై భ్రమలు పెంచుకొని- దానికనుగుణంగా విధానాల రూపకల్పన చేసింది.
5. లెఫ్ట్ సెక్టేరియన్ లైన్ ప్రజా సాయుధ పోరాటాలకు తీవ్ర విఘాతం కలిగించింది. సిద్ధాంత రాజకీయ విషయాల పై ఆధారపడి మాత్రమేగాక తెలంగాణా, ఆంధ్ర, నేటి బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్ జిల్లాలోని పర్వత సరిహద్దు ప్రాంతాలు మొదలగు పోరాటాల నుండి అనుభవ పూర్వకంగా గుణపాఠాలు తీసే ప్రయత్నం చేయలేదు.

భారత కమ్యూనిస్టు పార్టీలో సుదీర్ఘకాల చర్చ జరిగిన అంశాలలో యిదే ప్రధానమైందిగా మారింది. ఈ చర్చ కమ్యూనిస్టు పార్టీలో భారత విప్లవోద్యమాన్ని పక్కదారి పట్టించే చర్చగానే రుజువయింది. వర్గ పోరాటాభివృద్ధి, శ్రామికవర్గ అధికార స్థాపన అన్న అంశాలు ప్రక్కనుంచబడ్డాయి. సంస్కరణవాద కార్యక్రమాల చుట్టూ పార్లమెంటరీ అధికార రాజకీయాల చుట్టూ పార్టీ శ్రేణులను పరిభ్రమింపచేసి కమ్యూనిస్టు పార్టీని సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థానంలో వుంచుతూ వచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే మితవాద ధోరణి, అతివాద ధోరణి అంతిమంగా ఒక్కటే ప్రయోజనాన్ని నెరవేర్చాయని ఆంధ్రా కామ్రేడ్స్ పార్టీ సభ్యులకు వ్రాసిన లేఖలో విశ్లేషించారు.

''ఇక్కడ గమనించాల్సింది, పి.సి.జోషి నాయకత్వంలో మితవాద సంస్కరణవాదం అతివాద ఒంటెత్తువాదానికి వ్యతిరేకంగా పోరాటంగానీ, బి.టి.రణదివే నాయకత్వంలో అతివాద ఒంటెత్తువాదం మితవాద సంస్కరణవాదానికి వ్యతిరేకంగా పోరాటం గానీ నిజంగా చేయలేదని మనపార్టీ సుదీర్ఘ చరిత్ర నిరూపిస్తుంది...

కాని వారిద్దరూ, పైకి విప్లవాత్మకంగా కనిపించే నినాదాలతో ఒకరు ' జాతీయ స్వాతంత్ర్యం కోసం జాతీయ ఐక్యత' అన్న నినాదంతో, మరొకరు ' శ్రామికవర్గ నాయకత్వం', 'సోషలిజం' అన్న పదాలతో పార్టీ శ్రేణులను, ప్రజలను దగా చేశారు......"

"సరైన పంథా లేనంతకాలం వారు ఒకరికి వ్యతిరేకంగా మరొకరు బూటకపు పోరాటం చేసుకొన్నారు. కాని సరైన పంథా ప్రతిపాదించబడిన వెంటనే వారిద్దరూ రెండు పరస్పర విరుద్ధ కోణాలనుండి దానిపై దాడికి దిగారు. మన పార్టీ చరిత్ర మనకు నేర్పుతున్న పాఠమిది."

**(పార్టీ సభ్యులకు లేఖ)**

అజయ్‌ఘోష్ నాయకత్వాన మూడవధోరణిగా ముందుకువచ్చిన మధ్యేవాదం పార్టీలో తలెత్తిన అతి అతివాద, అతి మితవాదాలను వ్యతిరేకిస్తున్నట్లుగా పోజుపెడ్తూ చంద్ర రాజేశ్వరరావుగారి నాయకత్వాన రూపుదిద్దుకొన్న సరైన పంథా అమలును, పురోగతిని అడ్డుకొన్నది. అంతిమంగా పార్టీ పంథాను మితవాద పంథాగా మార్చివేసింది. ఆ విధంగా ఒక పెద్ద మితవాద ముఠాపార్టీలోపల బాగా తిష్టవేసింది.

## మూడు ధోరణులు- అంతర్జాతీయ నాయకత్వ సహాయం

1. పి.సి.జోషి ప్రధాన కార్యదర్శిగా "ఐక్య జాతీయ సంఘటన విధానంతో (United National Front) ఆదర్శవాద సంస్కరణవాద-మితవాద పంథా''ను కమ్యూనిస్టు పార్టీ అమలు జరిపింది.

2. 1948 నుండి బి.టి.రణదీవే ప్రధాన కార్యదర్శిగా "పారిశ్రామిక కార్మికుల జనరల్ సమ్మెలు-దేశ వ్యాపిత తిరుగుబాట్ల పంథా'' (Weapon of the General strikes of industrial workers, and country wide insurection)ఒంటెత్తువాదంగా, టెర్రరిస్టు తరహాలో కమ్యూనిస్టు పార్టీ అమలు జరిపింది.

3. 1950లో చంద్ర రాజేశ్వరరావు కార్యదర్శిగా "రైతాంగం ప్రజా యుద్ధ పంథాను-చైనా విప్లవ పంథాను (Partisan war of the peasantry) అమలు జరిపింది.

ఈ మూడు ధోరణులు పార్టీ లోపల ప్రముఖంగానే చర్చించబడ్డాయి. పి.సి.జోషి ప్రధాన కార్యదర్శిగా వున్న కేంద్రకమిటీ విధానాలు తిరస్కరించబడ్డాయి. రణదివే ప్రధాన కార్యదర్శిగా వున్న కేంద్ర కమిటీ విధానాలు తిరస్కరించబడ్డాయి. చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా వున్న కేంద్ర కమిటీ ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వ్యవసాయ విప్లవ పంథాను ప్రజాయుద్ధ పంథాలో అమలు జరిపింది. గెరిల్లా యుద్ధతంత్రాన్ని అనుసరించింది.

అజయ్‌ఘోష్ నాయకుడిగా 3p's కామ్రేడ్స్-రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా వున్న కేంద్ర కమిటీ విధానాలను, ఆంధ్ర కామ్రేడ్స్ కార్యాచరణను, తెలంగాణా పోరాటాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇది ఒక రకంగా జోషిగారి జాతీయ ఐక్య సంఘటనా విధానాన్ని-జాతీయ ప్రజాస్వామిక విప్లవ సంఘటనగా అభివృద్ధి చేసిన పంథా. బి.టి.ఆర్ సెక్రటరీగా అమలు జరిపిన సెక్టేరియన్ పంథాను, ఆంధ్రా కామ్రేడ్స్ అమలు జరుపుతూ ప్రతిపాదించిన పంథాను ఒకే గాటన గట్టి విమర్శించింది.

రాజేశ్వరరావు కార్యదర్శిగా, ఆంధ్రా కామ్రేడ్స్ నిర్మించిన తెలంగాణా సాయుధ పోరాటాన్ని టెర్రరిస్టు విధానంగా త్రోసిపుచ్చింది. ఆ విమర్శలోని కొన్ని అంశాలు ఈ విధంగా వున్నాయి.

" 1948 జూన్ నాటి ఆంధ్ర డాక్యుమెంటు అనేక కీలక విషయాల్లో సరిగా వున్నప్పటికీ, అంతర్యుద్ధం విషయంలో తప్పు సూత్రీకరణలు చేసింది. ప్రభుత్వ విధానాల సంపూర్ణ స్వభావాన్ని, ప్రభుత్వం వుపయోగించిన వివిధ ఆయుధాలను చూడడంలో కూడా విఫలమైంది.

ధనికరైతుల, మరియు మధ్య బూర్జువావర్గంపట్ల వైఖరి విషయంలో చూసినట్లుగా, మార్చిన రూపంలోనే ఐనప్పటికీ, పూర్వ పి.బి. యొక్క సెక్టేరియన్ వ్యూహాన్నే కొనసాగించిన పంథా యిది.

పార్టీని, దాని శక్తిని మరింత బలహీనపరిచే, మరింత అధ్వాన్నమైన పంథా ఇది.

పార్టీని నిర్మూలించే పంథా యిది."

అజయ్‌ఘోష్ నాయకుడిగా 3p's కామ్రేడ్స్ అత్యంత తీవ్రంగా ఆంధ్ర డాక్యుమెంటుని విమర్శించడంతో విబేధాలు జఠిలరూపం దాల్చాయి.

ఈ విభేదాలు పరిష్కారం కొరకు అంతర్జాతీయ నాయకుల సహాయం కోసం ప్రతినిధి బృందం వెళ్లింది. అజయ్ ఘోష్, డాంగే, రాజేశ్వరరావు, బసవపున్నయ్య. ఈ ప్రతినిధి బృందంలో వున్నారు.

అంతర్జాతీయ నాయకత్వం ఈ క్రింది సలహా నిచ్చింది.

అంతర్జాతీయంగా సాగుతున్న జాతీయ విముక్తి ఉ ద్యమాల నుంచి, చైనా విప్లవానుభవాన్నుంచి నేర్చుకోవాలనే, ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానూ-ఈ రెండు సామ్రాజ్యావాదాలతో మిలాఖతైన అభివృద్ధి నిరోధక బడా బూర్జువా, ఫ్యూడల్ భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా స్వేచ్ఛ కోసం, జాతీయ స్వాతంత్ర్యం కోసం సమష్టి పోరాట భూమికను సృష్టించమనీ అంతర్జాతీయ నాయకత్వం సలహా యిచ్చింది. మీ దేశ పరిస్థితి కనుగుణమైన పంథాను మీరు నిర్ణయించుకోగలుగుతారు. కానీ శాంతియుత మార్గం మాత్రం కాదని సూచనలిచ్చింది.

> ***బ్రిటిష్ వలసపాలనకు వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజాఉద్యమ వెల్లువలపై నీళ్లు చల్లడానికి, వలస పాలకులతో రాజీబేరాలకోసం ఒక పనిముట్టుగా వుపయోగించడానికి శాంతియుత సత్యాగ్రహ పద్ధతిని గాంధీ నాయకత్వం అత్యంత నైపుణ్యంగా అమలు జరిపింది.***

1951 కార్యక్రమం "ఈ రాజ్యాంగం ప్రజా వ్యతిరేకమైనదనీ, సామ్రాజ్యవాదులకు సేవలందిస్తూ వారి పట్ల లొంగుబాటు వైఖరి కలిగి వుంటుందనీ, భూస్వాములకు, పెట్టుబడిదారులకు ఉపయోగ పడుతుందని నిర్వచించింది. ఇంకా నెహ్రూ నాయకత్వాన వున్న కాంగ్రెసు ప్రభుత్వం పరాన్నభుక్కులయిన భూస్వాముల, రాజుల, సంస్థానాధిపతుల ఆస్తులను కాపాడతానని ప్రతిజ్ఞ చేసింద"ని చెప్పింది.

1951 పాలసీ స్టేట్‌మెంట్ పంథా గురించి ఇలా చెప్పింది:

*"అనేక నెలలపాటు సుదీర్ఘ చర్చ జరిగిన తర్వాత దేశ స్వాతంత్ర్యాన్ని, ప్రజల ఆనందాన్ని సాధించడానికి సరైన పంథాకు సంబంధించిన నూతన అవగాహనకు పార్టీ యిప్పుడు వచ్చింది. ఈ పంథాను రష్యా పంథా అనో లేదా చైనా పంథా అనో మనం పిలవము; పిలవలేము. ఇది మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్‌ల బోధనలకు అనుగుణ్యమైనదిగా, చరిత్రలో జరిగిన అన్ని పోరాటాలు, ప్రత్యేకించి రష్యా, చైనాలు అందించిన గుణపాఠాలను వినియోగించుకొనేదిగా వుండాలి; వుంటుంది.........."*

ఇంకా యిలా చెప్పింది:

"అదే సమయంలో, ప్రతిదేశానికీ, ఆ దేశ విముక్తి పంథాకు వర్తించడంలో విఫలంకాని దాని సహజమైన, సామాజికమైన ప్రత్యేక లక్షణాలు వుంటాయి అన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి."

వ్యక్తిగత హింసావాదం గురించి కూడా "విధాన ప్రకటన" యిలా చెప్పింది:

*"కాని చరిత్ర ఒక చర్యను అనుమతించదు. అదే వ్యక్తిగత హింసావాదం. వ్యక్తిగత హింసావాదం ఒక వర్గం లేదా వ్యవస్థకు సంబంధించిన వ్యక్తులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడుతుంది. వ్యక్తులు లేదా గ్రూపులు మరియు దళాలు దీన్ని సాగిస్తాయి. ఈ చర్యలు జరిపే వ్యక్తులు వీరోచితంగా, స్వార్ధరహితులుగా వుండవచ్చును. జనం వారిని కీర్తించవచ్చును; తాము బాగా ద్వేషించే వ్యక్తులపై చర్య తీసుకొమ్మనికూడా ఆహ్వానించవచ్చును. ఐనప్పటికీ, మార్క్సిజంలో అలాంటి చర్యలు అనుమతించబడవు. ఎందుకని? ఎందుకంటే, ఈ చర్యల్లో ప్రజలుందరు. వీరులు ప్రజలకోసం ఈ పని చేస్తారని యిక్కడ విశ్వాసం కల్పించబడుతున్నది. అట్లా మరిన్ని ఎక్కువ చర్యలు సాగిస్తే మొత్తానికి వర్గాలు లేదా వ్యవస్థ నిర్మూలించబడుతాయని నమ్మకం కల్పిస్తుంది. అంతిమంగా యిది ప్రజల్లో నిరాసక్తతకు, నిర్లిప్తతకు దారితీస్తుంది. విప్లవంవైపుగా సాగాల్సిన వారి చర్యలను, అభివృద్ధిని ఆపి వేస్తుంది. చివరకు ఓటమి తెచ్చిపెడ్తుంది. అందుకే మార్క్సిజం వ్యక్తిగత హింసావాదాన్ని అనుమతించదు; దాన్ని నిషేధిస్తుంది."*

## మితవాద అవకాశవాదం మోసపూరితంగా పై చేయి సాధించింది

అజయ్‌ఘోష్ నాయకత్వాన పార్టీ క్రమంగా పోలసీ స్టేట్‌మెంట్ నుంచి గూడ వైదొలగింది. 1953 డిశంబర్ 1954 జనవరి మధురై పార్టీ కాంగ్రెస్, "స్వాతంత్ర్యాన్ని సాధించాలి" అనే దానికి బదులు "స్వాతంత్ర్యాన్ని రక్షించాలి" అన్న సూత్రీకరణను తెచ్చింది. "పార్లమెంటరీ మార్గంలో ప్రజాస్వామిక ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పాటు" చేయడాన్ని లక్ష్యంగా పేర్కొంది. జనతా ప్రజాస్వామిక లక్ష్యాన్ని ఎత్తివేసింది- ఒక మధ్యంతర మార్గంగా ప్రజాస్వామిక ఐక్య సంఘటన అవగాహనను తెచ్చింది. ఈ విధంగా 1955 నాటికి భారత స్వాతంత్ర్యం గురించి 1951 పాలసీని తిరగదోడింది.

1956 ఏప్రిల్‌లో పాల్ఘాట్ మహాసభ భారతదేశం "నూతనంగా స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం పొందిన దేశం" అన్న సూత్రీకరణ చేసింది. "జాతీయ ప్రజాస్వామిక సంఘటన"; "ప్రజల ప్రజాస్వామిక సంఘటన" అన్న రెండు సూత్రీకరణల ప్రాతిపదికన కేంద్రకమిటీ రెండు సెక్షన్‌లుగా విడిపోయింది. వామపక్షశక్తులూ, పార్టీలూ కలసి ప్రజాస్వామిక సంఘటననూ, ప్రభుత్వాన్నీ ఏర్పర్చాలని పాల్ఘాట్ మహాసభ ప్రతిపాదించింది. 1957లో కేరళ కమ్యూనిస్టు కమిటీ మంత్రివర్గం ఏర్పాటు చేసి ఈ పాలసీకి ఆచరణ రూపమిచ్చింది.

1958లో అమృత్‌సర్ మహాసభ శాంతియుత పద్ధతుల ద్వారా అధికారంలోకి రావడానికి అవకాశాలున్నాయని ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

1960 విజయవాడ మహాసభలో జాతీయ ప్రజాస్వామిక సంఘటనవాదులది పై చేయి అయ్యింది. బూర్జువా వర్గంలోని అభివృద్ధి నిరోధకుల దాడి పెరిగి నెహ్రూ వామపక్షాల వైపు మొగ్గే అవకాశం వుందని, దానికి తగినట్లుగా, అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా నెహ్రూ ప్రభుత్వం నిలబడటానికి తగిన మద్దతుని సమకూర్చాలన్న విధానం చేబట్టింది. దానికనుగుణంగా "ప్రభుత్వ అభివృద్ధికర విధానాలను బలపర్చండి" "ప్రగతికాముక కాంగ్రెసువాదులతోనూ, కాంగ్రెసును అనుసరించే ప్రజలతోనూ ఐక్యతను పెంపొందించండి." "కాంగ్రెసు ప్రభుత్వ సోషలిస్టు అనుకూల, శాంతికాముక విధానాలను బలపర్చండి" "కనీస కార్యక్రమం ప్రాతిపదికపై ప్రజాస్వామిక శక్తుల ఐక్య సంఘటన ద్వారా అధికారంలోకి రావచ్చు" అన్న నినాదాలతో ముందుకు వచ్చింది. పార్లమెంటరీ మార్గానికి గేట్లు తెరచింది. 1962 సరిహద్దు వివాదాలలో చైనా వ్యతిరేక, జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టింది. ఈ సమస్యపై ఒక సెక్షను చైనాను దురాక్రమణదారుగా చిత్రించింది. రెండో సెక్షన్ ఆ విధంగా అనడానికి సిద్ధంగాకుండా సరిహద్దుల రక్షణకు చర్యలు తీసుకొంటూ, శాంతియుతంగా సంప్రదింపులు జరపాలనీ వాదించింది.

1953-54 నుంచి పార్టీలో రెండు సెక్షన్‌ల మధ్య జరుగుతున్న రాజకీయ సిద్ధాంత విభేదాలు, 1962 సరిహద్దు వివాదాలపై జరిగిన ఘర్షణలు ముదురు పాకాన పడ్డాయి. చైనాను దూషించే వారూ-దూషించనివారూ అన్న ప్రాతిపదికపైన దూషించని వారినందరినీ దేశవ్యాప్తంగా డిఐఆర్ కింద నిర్బంధించింది. పార్టీ చీలికను అది త్వరితపరచింది. 1964లో 7వ మహాసభను ఒక సెక్షన్ కలకత్తాలో జరిపితే, రెండవ సెక్షన్ బొంబాయిలో జరిపింది.

## అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చర్చలు (గ్రేట్ డిబేట్)

భారత పాలకవర్గాల గురించి, రాజ్యం లక్షణం గురించిన (characterisation of state) అంచనా, అవగాహనలకు సంబంధంలేనిదిగా భారత విప్లవ మార్గం వుండదు. భారత కమ్యూనిస్టు పార్టీలో జరిగిన చర్చలు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన చర్చలతో సంబంధం లేనివిగానూ వుండవు.

స్టాలిన్ మరణానంతరం రష్యా కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో తలెత్తిన రివిజనిజం 22వ మహాసభతో ఆధునిక రివిజనిజంగా సర్వసమగ్ర రూపం ధరించింది.

"ప్రజలందరి పార్టీ" "ప్రజలందరి ప్రభుత్వం" అన్న నినాదాలు కమ్యూనిస్టు పార్టీ శ్రామికవర్గ అగ్రగామి అన్న సూత్రాన్ని, దోపిడీ వర్గాలపై "శ్రామికవర్గ నియంతృత్వం" అన్న సూత్రాన్ని ఎత్తివేసింది. సామ్రాజ్యవాదం అంతరించే యుగమన్న సిద్ధాంతాన్ని వక్రీకరించి మితవాద లొంగుబాటుకి, మార్క్సిజాన్ని తిరగదోడటానికి పూనుకుంది. "శాంతియుత పరివర్తన", "శాంతియుత ఆర్థిక పోటీ" "శాంతియుత సహజీవనం" అన్న సిద్ధాంతాలను ప్రవేశపెట్టింది. సామ్రాజ్యవాద వ్యతిరేక ఐక్య సంఘటన విధానాలను వక్రీకరించింది. జాతీయ విముక్తి ఉద్యమాలకు సహకారం, సంఘీభావ చైతన్యాన్ని నీరుగార్చే విధానాలను చేబట్టింది.

భారత కమ్యూనిస్టు పార్టీలో మితవాద సెక్షన్‌కి పైన పేర్కొన్న ఆధునిక రివిజనిస్టు సిద్ధాంతాలు బలాన్ని చేకూర్చాయి. భారత ప్రభుత్వంతో రష్యా ప్రభుత్వ సంబంధాలు, భారత పాలకవర్గాల గొప్పదనాన్ని చాటడం లాంటి కృశ్చేవ్ విధానాలు భారత కమ్యూనిస్టు పార్టీ ఆధునిక రివిజనిస్టు సిద్ధాంతాన్ని పైకెత్తిపట్టడానికి దోహదపడ్డాయి. బూర్జువావర్గాన్ని అనుసరించి నడిచే విధానం పై చేయి అయింది.



> ***వ్యక్తిగత హింసావాదం ఒక వర్గం లేదా వ్యవస్థకు సంబంధించిన వ్యక్తులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడుతుంది. వ్యక్తులు లేదా గ్రూపులు మరియు దళాలు దీన్ని సాగిస్తాయి. ఈ చర్యలు జరిపే వ్యక్తులు వీరోచితంగా, స్వార్ధరహితులుగా వుండవచ్చును. జనం వారిని కీర్తించవచ్చును; తాము బాగా ద్వేషించే వ్యక్తులపై చర్య తీసుకొమ్మనికూడా ఆహ్వానించవచ్చును. ఐనప్పటికీ, మార్క్సిజంలో అలాంటి చర్యలు అనుమతించ బడవు. ఎందుకని? ఎందుకంటే, ఈ చర్యల్లో ప్రజలుందరు. వీరులు ప్రజలకోసం ఈ పని చేస్తారని యిక్కడ విశ్వాసం కల్పించబడుతున్నది. అట్లా మరిన్ని ఎక్కువ చర్యలు సాగిస్తే మొత్తానికి వర్గాలు లేదా వ్యవస్థ నిర్మూలించబడుతాయని నమ్మకం కల్పిస్తుంది. అంతిమంగా యిది ప్రజల్లో నిరాసక్తతకు, నిర్లిప్తతకు దారితీస్తుంది. విప్లవం వైపుగా సాగాల్సిన వారి చర్యలను, అభివృద్ధిని ఆపి వేస్తుంది. చివరకు ఓటమి తెచ్చిపెడ్తుంది. అందుకే మార్క్సిజం వ్యక్తిగత హింసావాదాన్ని అనుమతించదు; దాన్ని నిషేధిస్తుంది."***



> ***1920-40 -ఈ మూడు దశాబ్దాలలో మహత్తర ప్రజా ఉద్యమాలు నడిచాయి. అయితే అవి విషాదకరంగా ముగిసినందువల్ల ఏమీ లాభాలు లేవనుకోలేము. ప్రజా చైతన్యం, ప్రజల ఉత్సాహమూ, సహకారమూ, త్యాగమూ కావలసినంత దొరికింది. తాత్కాలిక వైఫల్యాలు ఈ ఫలితాలను వృధా చేయజాలవు. భవిష్యత్ పోరాటాలకు సోపానాలుగా వుంటాయి. వాటిని విశ్లేషించి అర్థం చేసుకోవడమే కమ్యూనిస్టు పార్టీ బాధ్యత.***

అల్బేనియా, చైనా పార్టీలు ఈ ఆధునిక రివిజనిస్టు సిద్ధాంతాలను ఖండించాయి. కొంచెం వెనకా ముందుగా సిద్ధాంత పోరాటాన్ని ప్రారంభించాయి. 1957, 1960 అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల (81 దేశాల) ప్రకటనను గూడా దాటివెళ్లిన ఆధునిక రివిజనిస్టులతో ఇక రాజీలేని పోరాటం చేయడానికి చైనా కమ్యూనిస్టు పార్టీ పూనుకొంది. 81 దేశాల కమ్యూనిస్టు పార్టీల అంతర్జాతీయ మహాసభ అవగాహన యిలా వుంది.

*"సాంఘిక వైరుధ్యాలు పెరుగుతున్న కొద్దీ వెనుకబడిన దేశాల్లోని జాతీయ బూర్జువావర్గం సామ్రాజ్యవాదంతో మరియు దేశీయ అభివృద్ధినిరోధకత్వంతో ఏవిధంగా రాజీకి దిగుతుందో మాస్కో డాక్యుమెంటు ఎత్తి చూపింది."*

*"అమెరికా సామ్రాజ్యవాదులు ప్రధానంగా మిలటరీ కూటములు, ఆర్థిక సహాయం అన్న విధానం ద్వారా అనేక దేశాలను తమ కంట్రోలు కిందికి తెచ్చుకొనడానికి ప్రయత్నిస్తారు."*

ఇంకా:

*"వలస విధానానికి అమెరికా సామ్రాజ్యవాదం ఈనాడు పట్టుకొమ్మగా వున్నది. అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాదులు పూర్వపు వలసల వలసదోపిడీని కొత్త పద్ధతుల్లో, కొత్తరూపాల్లో నిలబెట్టడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తారు. గుత్తాధిపతులు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో ఆర్థిక కంట్రోలు, రాజకీయ పలుకుబడి స్థాయిలపై తమ పట్టును నిలబెట్టుకొనడానికి ప్రయత్నిస్తారు. రాజకీయ స్వాతంత్ర్యం పొందిన దేశాలలో తమ ఆర్థిక పట్టును నిలబెట్టుకొనడానికి, ఆర్థిక సహాయం ముసుగులో నూతన స్థానాలను ఆక్రమించడానికి ఈ ప్రయత్నాలు వుద్దేశించబడుతాయి."* (81 కమ్యూనిస్టు పార్టీల ప్రపంచ మహాసభ ప్రకటన 1960)

*"మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలన్నీ స్వతంత్రమైనవి, వాటన్నింటికీ సమాన హక్కులున్నాయి. అవి ఆయా దేశాల నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాలను ఆధారం చేసుకొని తమ పాలసీలను తీర్చి దిద్దుకుంటూ, పరస్పరం సహాయం చేసుకుంటాయి." అంతేగాక "ప్రతి పార్టీ ఆ దేశంలోని కార్మికుల, కష్టజీవుల ప్రయోజనాలకు బాధ్యత వహించుతూ, అంతర్జాతీయ కార్మికవర్గానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి గూడా బాధ్యత వహించుతుంది".* (81 పార్టీల స్టేట్‌మెంట్)

81 దేశాల కమ్యూనిస్టు పార్టీల మాస్కో ప్రకటనకు గూడా విరుద్ధంగా రష్యా కమ్యూనిస్టు పార్టీ వ్యవహరించ సాగింది. అమెరికా సామ్రాజ్యవాదంతో "శాంతి స్నేహ" సంబంధాలను మొదలుపెట్టింది. అత్యంత నగ్నంగా ఆధునిక రివిజనిజాన్ని ప్రబోధించసాగింది. జాతీయ విముక్తి ఉద్యమాలను నీరుగార్చబూనుకొంది. వియత్నాంకి సహాయాన్ని ఆపేసింది. ఇతర దేశ పార్టీల వ్యవహారాలలో జోక్యం చేసుకొనసాగింది. భారత కమ్యూనిస్టు పార్టీలో రివిజనిస్టు సెక్షన్‌కి ఊతమిచ్చింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ఆధునిక రివిజనిజానికి వ్యతిరేక పోరాటానికి నాయకుడుగా నిలబడాల్సి వచ్చింది.

## భారత కమ్యూనిస్టు పార్టీలో రివిజనిజానికి ప్రతిఘటన

భారత కమ్యూనిస్టు పార్టీలో గూడ ఆధునిక రివిజనిజాన్ని వ్యతిరేకించే గ్రూపు నాయకత్వం క్రిందనే వివిధ రాష్ట్రాలలో అనేకమంది కామ్రేడ్స్ వివిధ వేదికల ద్వారా సిద్ధాంత పోరాటం మొదలెట్టారు. బెంగాల్, ఆంధ్రప్రదేశ్, కేరళ, బీహార్, ఉత్తరప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌లలో రహస్యంగా పార్టీ అధికారిక విధానాలను వ్యతిరేకించే సాహిత్యాన్ని పంచారు. పత్రికలను నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన వివిధ మహాసభల వేదికలలో సంఘర్షణ పడ్డారు. బాహాటంగానే బూర్జువా వర్గంతో రాజీపడే ఈ వైఖరికి వ్యతిరేకంగా రాజకీయ, సిద్ధాంత ప్రచారం సాగింది. రాజీపడే పంథా, పోరాడే పంథాకి మధ్య విభజనగీత ఏర్పడింది. ఇదే కాలంలో భారత ప్రజల స్థితిగతులు దుర్భరంగా మారడానికి వ్యతిరేకంగా అనేక రాష్ట్రాల్లో ప్రజాపోరాటాలు ఏదో ఒక స్థాయిలో సాగుతూనే వున్నాయి.

రివిజనిజం తెచ్చిపెట్టిన స్తబ్దత పార్టీ శ్రేణులను వెంబడిస్తూ వున్నప్పటికీ అనేక ప్రజాపోరాటాలు సాగాయి. 1959లో ఆహార సమస్యపై తమిళనాడు, ఉత్తరప్రదేశ్, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో ఆందోళనోద్యమాలు జరిగాయి. నీటి తీరువా బెటర్‌మెంట్ లెవీకి వ్యతిరేకంగా పంజాబ్ రైతాంగం ఆందోళన చేసింది. పశ్చిమ బెంగాల్‌లో (సిలిగురి) బినామీ భూములను తిరిగి ఆక్రమించు కోవడానికి రైతాంగ ఆందోళనలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధిక శిస్తులకి వ్యతిరేకంగా ఆందోళనలు జరిగాయి. అటవీ భూములు, ప్రభుత్వ బంజర్ల కోసం గ్రామీణ పేదల ఆందోళనలు, సత్యాగ్రహాలు జరిగాయి. భూస్వాముల దౌర్జన్యాలను తట్టుకొంటూ ఎన్నికల క్యాంపెయిన్‌లు సాగాయి.

1953-1965ల మధ్య దశాబ్దంలో పెరిగిన నిరుద్యోగం, ఉద్యోగ భద్రతలేమికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు సమ్మె, పోరాటాలు నిర్వహించారు. 1961-62లో జాతీయోన్మాదానికి వ్యతిరేకంగా విద్యార్థి, యువకులు అనేక కళాశాలలు, యూనివర్సిటీలలో సమరశీలంగా నిలబడ్డారు.

విస్తృతమైన తెరాయ్ ప్రాంతంలో ఆదివాసీలు, టీ తోట కార్మికులు ఉద్యమించారు. సమూహాలుగా వేలాదిగా కదలబారారు.

రైతాంగం వారి పోరాట క్రమంలో వివిధ పోరాట రూపాల్ని అనుసరించారు. వారి స్వంత ప్రజాసంఘాన్ని నిర్మించుకొని దాన్ని బలోపేతం చేసుకొని భూస్వాములకు వ్యతిరేకంగా దాని అధికారాన్ని చెలాయించారు. తమ విప్లవ చొరవ, నిర్మాణము పోరాట పటిమల బలాన్ని ఆధారం చేసుకొని, జోతేదార్ల రాజకీయ, ఆర్థిక పట్టును ధ్వంసం చేయడానికి రూపొందించబడిన 10 అంశాల కార్యక్రమాన్ని అమలు జరిపారు. ఈ ఉద్యమం, కార్మికవర్గం, రైతాంగం మధ్య పోరాట సంఘీభావాన్ని సమన్వయాన్ని పెంచింది. కార్మిక కర్షక మైత్రిని సాధించింది. ఆ ప్రాంత నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా రైతాంగ విప్లవోద్యమానికి కార్మికవర్గ నాయకత్వాన్ని నెలకొల్పడానికి సంబంధించిన విలువైన అనుభవాల్ని సమకూర్చింది. 18మంది రైతాంగ కార్యకర్తలను, ప్రజలను ప్రభుత్వ తుపాకులు పొట్టనబెట్టుకున్నాయి. ఈ సమాచారం దేశవ్యాపితంగా వున్న విప్లవకారులకు ఈ ఉద్యమం ఎదురు దెబ్బకు గురవుతున్నపుడే తెలిసింది.

ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలలో కరువుకి వ్యతిరేకంగానూ, భూస్వాముల దౌష్ట్యాలకు వ్యతిరేకంగా గ్రామీణ పేదలు కదిలారు. గిరిజన ప్రాంతాలలో ముఖ్యంగా శ్రీకాకుళంలో 1956 నుంచి గిరిజనోద్యమం పై కేంద్రీకరించి కృషి సాగించిన దాని ఫలితంగా గిరిజన రైతాంగం అనేక విజయాలు సాధించుకున్నారు. సంఘం నిర్మాణాన్ని పటిష్ట పరచుకొన్నారు. ముందునుంచీ భూస్వామ్య శక్తుల దుష్ట పథకాలను ఎదుర్కొంటూ వస్తున్న ఉద్యమంపై 1967 అక్టోబర్‌లో ఇద్దరు కామ్రేడ్స్‌ని భూస్వామ్య శక్తులు తుపాకులకు గురిచేశారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భూస్వామ్య శక్తులు దుర్మార్గాలు, హత్యాకాండతో పేట్రేగిపోయారు.

**భూమి సమస్యలు అపరిష్కృతంగా వుండడం, ఫ్యూడల్ పెత్తందారీ అహం పేట్రేగడంతో పాటు, ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు జో హుకుందారీ విధానాలు ప్రజా జీవితాలను కల్లోలపరిచాయి.** ప్రపంచ ఆర్థిక సంక్షోభ భారం ప్రజలపై మోపబడింది. 1966 రూపాయి విలువ తగ్గింపు, నాటి ఆర్థికమాంద్య (recession) పరిస్థితి ప్రజా జీవితాలను అతలాకుతలం చేసింది. ఆహార సంక్షోభం సహజంగానే తోడయింది. ఆహారాందోళనలు, ఆహార పదార్థాల ధరల తగ్గింపుకై ఆందోళనలు తీవ్రమయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతుకూలీలు, కార్మికులు ఆందోళనోద్యమాల బాటలో వున్నారు. భూస్వామ్య దోపిడీ వర్గాల దౌష్ట్యాలు పెరిగాయి.

1965-66 జైళ్లలోనే సిపిఎం నాయకుల అవకాశవాద వైఖరులు ప్రశ్నించబడ్డాయి. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిపై భూస్వామ్య శక్తుల దౌష్ట్యాలకి పరిష్కారమేమిటి అన్న చర్చలు మొదలయ్యాయి. శాంతియుత ఆందోళనలేనా? అంతకుమించిన సమరశీల కర్తవ్యాలేమైనా ఉన్నాయా? లేవా? కాశ్మీర్ సమస్యకు పరిష్కారమేమిటి? భారత పాలకుల వర్గ స్వభావం గురించిన అంచనా, సామ్రాజ్యవాదంతో దాని సంబంధ బాంధవ్యాల గురించి అవగాహనలపై బెంగాల్, కేరళ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో ఆంతరంగిక చర్చలు తీవ్రమయ్యాయి. జైళ్ల నుంచి విడుదల అనంతరం రివిజనిస్టు వ్యతిరేక పోరాట శక్తులు ఎక్కడికక్కడ పరస్పర సంప్రదింపులతోను, బెంగాల్ లాంటి చోట్ల గ్రూపులుగా

**(తరువాయి 10, 11 పేజీలలో)**

***బ్రిటీష్ వలసపాలకులు భారత ప్రజల పోరాటాలను కాలరాచి వేయడానికి అనేక ఎత్తుగడలను అనుసరించారు. అణచివేత-సంస్కరణలు- విభజించు-పాలించు అన్న పద్ధతిని నాజుకుగానూ, మెరటుగానూ ఉపయోగించారు. ప్రజలు తమ హక్కుల కోసం దోపిడీ వర్గాలపై సాగించిన పోరాటాలు, వారి ఎత్తులను పూర్తిగా పారనీయలేదు. ప్రజా పోరాటాలను ప్రక్కదారులు పట్టించే శక్తులను బ్రిటీష్ పాలకులు పెంచి పోషించారు. నేటి పాలకులు అదే దారిలో వున్నారు.***

**భారత...** (9వ పేజీ తరువాయి)

వేదికలు ఏర్పాటు చేసుకొనీ డాక్యుమెంట్లు విడుదల చేశారు. కమిటీల బయట చర్చల రూపంలోనూ ప్రతిఘటన మొదలయ్యింది.

1967 జనరల్ ఎన్నికలలో 11 రాష్ట్రాల్లో కాంగ్రెసు ఓడిపోయింది. స్వల్ప మెజారిటీతో కేంద్రంలో అధికారం నిలుపుకోగలిగింది. కేరళ. బెంగాల్‌లో 'వామపక్ష' మిశ్రమ ప్రభుత్వాలేర్పడ్డాయి. పాలక గ్రూపుల మధ్య వైరుధ్యాలు పెరిగాయి. కాంగ్రెసు రెండుగా చీలే దశకు చేరింది.

కార్మికవర్గం, గ్రామీణ పేదలు, ఉద్యోగ వర్గాలలో అసంతృప్తి పెరిగిపోయింది. 1967లో కార్మికులు, ఉద్యోగులు ఆటోమేషన్‌కి వ్యతిరేకంగా చేసిన ఆందోళన, 1968లో కేంద్ర ప్రభుత్వోద్యోగుల చారిత్రాత్మక సమ్మెలు జరిగాయి. ఈలాంటి ఆందోళనా పోరాటాలు తీవ్రమయ్యే పరిస్థితిని ప్రక్కదారి పట్టించడానికి దోపిడీ వర్గాలు, మతతత్వాన్ని, ప్రాంతీయ తత్వాన్ని ప్రేరేపించాయి. మహారాష్ట్రలో శివసేన, అస్సాంలో అజిత్‌సేన, ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక తెలంగాణావాదం పాలక పార్టీలలోని సెక్షన్‌లు ప్రేరేపించి నాయకత్వం వహించాయి. సి.పి.ఐ, సి.పి.ఐ(యం)లు ఐక్య సంఘటనా ప్రభుత్వాలలో భాగస్వాములుగా చేరిపోయాయి. 1967 నాటికి రెండు పార్టీలూ శ్రామిక వర్గం అధికారం సాధించే విషయంలో ఒకే అభిప్రాయానికొచ్చి, దిగజారి ఒకే చోటికి చేరుకున్నాయి. సిపిఐ(ఎం) బెంగాల్‌లో తెరై ప్రాంత రైతాంగ ఉద్యమ సమస్యల్ని పరిష్కరించడానికీ, రైతులకనుకూలంగా వ్యవహరించడానికి పూనుకోలేదు. పైగా నక్సల్‌బరీలో రైతాంగ పోరాటాన్ని బుల్లెట్లతో అణచివేయడానికి పూనుకొంది. అది ఐక్య సంఘటనా ప్రభుత్వాలను కాపాడుకోవడమే ముఖ్యమని, పార్టీ శ్రేణులను ఆదేశించింది.

"ప్రస్తుతాభివృద్ధి దశలో మొత్తం పార్టీ యొక్క భవిష్యత్ ఈ మంత్రివర్గాలను జయప్రదంగా నిర్వహించడంతో సన్నిహితంగా ముడిపడి వుంది. అలాగే మంత్రివర్గాల్లోని మన పార్టీ పాత్రతో అది ముడిబడి వుంది."

"మిశ్రమ ప్రభుత్వాల ద్వారా శాంతియుత విప్లవానికి గొప్ప అవకాశాలున్నాయి."

(నూతన పరిస్థితి-నూతన కర్తవ్యాలు, సిపియం డాక్యుమెంటు 1967).

సిపిఐ(యం) 1964 కార్యక్రమంలోనే దీనికి పునాదులేసుకొని వుంది. 1964 కలకత్తాలో జరిగిన 7వ కాంగ్రెసు కార్యక్రమం 112, 113 క్లాజుల్లో యిలా చెప్పింది:

*"112. అందువల్ల, పరివర్తనా స్వభావం గల, ప్రజలకు తక్షణ సహాయం అందించగల, ఆ విధంగా ప్రజా వుద్యమాలను బలోపేతం చేయగల అలాంటి ప్రభుత్వాల ఏర్పాటుకోసం వున్న అన్ని అవకాశాలనూ వినియోగించుకొంటూనే బడాబూర్జువా వర్గ నాయకత్వాన వున్న ప్రస్తుత బూర్జువా-భూస్వామ్య రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని మార్చవలసిన అవసరం గూర్చి పార్టీ జనబాహుళ్యాన్ని విజ్ఞానవంతం చేస్తూవుంటుంది.*

*"113. భారత కమ్యూనిస్టు పార్టీ శాంతియుత పద్ధతులద్వారా జనతా ప్రజాస్వామ్యం ఏర్పాటును, మరియు సోషలిస్టు పరివర్తనను సాధించడానికి ప్రయత్నిస్తుంది. బలమైన విప్లవ ప్రజావుద్యమాభివృద్ధి ద్వారా, పార్లమెంటరీ మరియు పార్లమెంటేతర పోరాట రూపాలను జోడించడం ద్వారా కార్మికవర్గం, దాని మిత్రులు అభివృద్ధి నిరోధకత్వపు ప్రతిఘటనను అధిగమించడానికి, శాంతియుత పద్ధతుల్లో ఈ పరివర్తనలు తీసుకొనిరావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తాయి.*

*ఏమైనప్పటికీ, పాలక వర్గాలు ఏనాడూ తమ అధికారాన్ని ఐచ్ఛికంగా వదులుకోరన్న విషయాన్ని అన్ని వేళలా మన మనస్సులో వుంచుకోవాల్సిన అవసరం వున్నది. వారు ప్రజల అభీష్టాన్ని ధిక్కరించ జూస్తారు; చట్టరహితంగా, హింసద్వారా దాన్ని వెనక్కి కొట్టడానికి ప్రయత్నిస్తారు. కనుక జాగరూకతతో వుండటం; అన్ని పరిణామాలను, మరియు దేశ రాజకీయ జీవితంలో వచ్చే ఎలాంటి మలుపులు-మార్పులనైనా ఎదుర్కొనడానికి తగినట్లుగా వారు తమ పనిని రూపొందించుకోవాలి."*

సిపిఐ నుంచి విడిపోయిన సిపిఐ(యం) భారత బూర్జువా వర్గాన్ని బడా బూర్జువా వర్గంగా, సామ్రాజ్య వాదంపై ఆధారపడేదిగా వుంటుందని చెప్పినప్పటికీ దాని దళారీ స్వభావాన్ని గుర్తించదలచుకోలేదు. బడా బూర్జువా, భూస్వామ్య రాజ్యం యొక్క నియంతృత్వ స్వభావాన్ని గమనంలోకి తీసుకోదలచలేదు. శాంతియుత పరివర్తనా మార్గాలలో శ్రామిక వర్గాధికారాన్ని నెలకొల్పడానికుండే అవకాశాలను గురించి వారికి వున్న ఆశలపైనే నమ్మిక ముంచమంది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సమస్యలపై మధురై డాక్యుమెంటులో తమ నయా రివిజనిస్టు అవతారాన్ని బయటపెట్టుకున్నారు. సిపిసిని, సిపిఎస్‌యుని ఒకే గాటన కట్టి గొంతు మార్చారు. కేంద్ర కమిటీ స్థాయిలో తీవ్ర విబేధాలు మొదలయ్యాయి.

నక్సల్‌బరీ కార్మిక రైతాంగ ఉద్యమం ప్రతిఘటనా స్థాయికి చేరి వుంది.

శ్రీకాకుళం, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో భూస్వామ్య శక్తుల దాడులను ఎదుర్కొంటూన్న పరిస్థితి కొనసాగింది. కేంద్ర కమిటీల స్థాయిలో మరో రూపంలో ముందుకొచ్చిన నయా రివిజనిజానికి వ్యతిరేకంగా ప్రతిఘటన మొదలయ్యింది. 7వ మహాసభ డాక్యుమెంట్ల పునఃపరిశీలన మొదలయ్యింది. ఆ తర్వాత వచ్చిన డాక్యుమెంట్లు విమర్శకు గురిచేయబడుతున్నాయి.

డార్జిలింగ్ జిల్లాలో జోతేదారులను ప్రతిఘటించడంతో వసంతకాల మేఘం గర్జించి నట్లయింది. అంతకు ముందునుంచే నయా రివిజనిస్టు నాయకత్వ విధానాలనుంచి విడగొట్టుకొని వ్యవహరిస్తూ వస్తున్న దాని ఫలితంగా యిది భారత పాలకవర్గాలపైనే గాక నయా రివిజనిస్టు విధానాలపై తిరుగుబాటు బావుటాగా వెలిగింది. భారత దేశానికే క్రాంతిదర్శి అయ్యింది.

నక్సల్‌బరీ రైతాంగం భూమి, భుక్తి, విముక్తి అన్న చైతన్యంతో చేసిన తిరుగుబాటు నయా రివిజనిజాన్నుండి ఆచరణాత్మక తెగదెంపులను త్వరితపరిచింది. బెంగాల్‌లో బీర్‌భూమ్, గోపీవల్లభపూర్, డేబ్రా, బీహారులో ముషాహరి, యు.పి.లో లఖింపూర్ ఖేరి, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా సరిహద్దులు-తూర్పు కనుమలు, దండకారణ్య ప్రాంతంలో ఆదివాసీ రైతాంగాన్ని విప్లవోన్ముఖులను చేసే కర్తవ్యం చేపట్టారు.

## టెర్రరిస్టు సెక్టేరియన్ పోకడలు, అరాచక, కుట్రదారీ నిర్మాణ పద్ధతులు

మావో ఆలోచనా విధానానికి గాని, భారతదేశంలో జరిగిన తెలంగాణా, తెభాగా, తదితర పోరాటానుభవాలకు గానీ, తెరై ప్రాంత రైతాంగ ఉద్యమ అనుభవాలకుగానీ సంబంధంలేని పంథా ప్రబోధించబడింది. బెంగాల్‌లో అతివాద ఒంటెత్తు నాయకత్వం తెలంగాణా పోరాటాన్ని విస్మరించింది. భారతదేశంలో కమ్యూనిస్టుల నాయకత్వాన నక్సల్‌బరీయే తొలి సాయుధ పోరాటంగా స్వీయాత్మకంగా ప్రకటించింది. బి.టి.రణదివే అతివాద టెర్రరిస్టు పంథాతో ప్రభావితులైన నాయకులే మావో ఆలోచనా విధానానికి భిన్నమైన పంథాను ప్రబోధించారు. తాము నాయకత్వం వహించిన ఉద్యమాల నుండి గూడ స్వీయాత్మక అంచనాలను ప్రకటించారు. మార్క్సిజం-లెనినిజాలకు భిన్నమైన అనేక రాజకీయ వైఖరులు ప్రకటించారు. వీటి గురించి మన కేంద్ర కమిటీ నియమించిన చరిత్ర కమిటీ సవివరమైన కథనాలను తయారు చేయగలదు.

**అతివాద ఒంటెత్తువాద పోకడ, మితవాద లొంగుబాటు విధానాలు భారత విప్లవోద్యమానికి అత్యంత తీవ్రమైన హాని చేశాయి. మితవాద అవకాశవాదం గురించి "ఆచరణ" అన్న తన వ్యాసంలో కామ్రేడ్ మావో యిలా వివరించాడు:**

*"అయినప్పటికీ తరచుగా యిట్లా జరుగుతుంది; ఆలోచన వాస్తవం కంటే వెనుకబడుతుంది. ఎందుకంటే మానవుడి గ్రాహ్యశక్తి అనేక సామాజిక పరిస్థితులచేత పరిమితం చేయబడుతుంది. మారుతున్న భౌతిక పరిస్థితులతో పాటుగా తమ ఆలోచనల్ని ముందుకు తీసుకుపోలేని, చారిత్రకంగా మితవాద అవకాశవాదంగా ప్రస్ఫుటమైన విప్లవ శ్రేణుల్లోని మొండి వారికి (Dichards) మేము వ్యతిరేకం. వీరు తమ జ్ఞానం పాత దశలోనే ఆగిపోగా, విరుద్ధాంశాల మధ్య సాగే పోరాటం అప్పటికే భౌతిక క్రమాన్ని ముందుకు నెట్టిందన్న విషయాన్ని చూడలేక పోతున్నారు. మొండివాళ్లందరి (Dichards) పాత ఆలోచనా స్వభావం ఇదే. వారి ఆలోచన సామాజిక ఆచరణ నుండి వేరుపడిపోతుంది. సమాజ రథానికి సారధ్యం వహించడానికై వారు ముందుకు రాలేరు; వారు కేవలం, అది చాల వేగంగా పోతున్నదని గొణుక్కుంటూ వెనక నడుస్తారు. దాన్ని వెనక్కు లాగడానికి, లేదా వ్యతిరేక దిశకు మళ్లించడానికి ప్రయత్నిస్తారు."*

***అంతిమ పరిశీలనలో అతివాద ఒంటెత్తువాదం, మితవాద లొంగుబాటువాదం-రెండూ విప్లవ ప్రజా ఉద్యమాన్ని బలి తీసుకున్నాయి. అందుకే లెనిన్ మహాశయుడు అతివాద అవకాశవాదం, మితవాద అవకాశవాదం బొమ్మా-బొరుసుల్లాంటివనీ, కవలపిల్లలనీ నొక్కి చెప్పాడు. విప్లవ పక్షం వహించేవారు అతివాద అవకాశవాదం పట్ల ఉదారంగా ఉండటం విప్లవానికి హాని కలిగిస్తుంది. అతివాద అవకాశవాదం రివిజనిజాన్ని వ్యతిరేకించేంతవరకూ విప్లవ పక్షంగా కనబడుతుంది. కానీ అంతిమ పరిశీలనలో రెండూ ఒక తల్లి బిడ్డలే కాదు, కవల పిల్లలుకూడా.***

విప్లవ నిర్మాణాల బయట నుంచి ఈ ప్రమాదం అత్యంత తీవ్రంగా వుంది. విప్లవోద్యమం పరుగులు తీయడం లేదనే నిస్పృహకు గురయి, వున్న విప్లవ నిర్మాణ శక్తులను గూడ ఇది పట్టి పీడిస్తున్నది. ఇది అనేక రూపాలలో వ్యక్తీకరించబడుతున్నది. ఏ నిర్దిష్ట పరిస్థితిలో, ఏ నిర్దిష్ట సందర్భంలో యిది ఏ విధంగా వ్యక్తమవుతుందో గమనించి దానిపై పోరాటం చేయాలి. మన సిపిఐ (ఎం-ఎల్)లో గూడ పోరాట అవసరం వుంది.

మితవాద అవకాశవాదం మీద మన పోరాటం కేంద్రీకరించి వున్నపుడు సరిగ్గా అదే సమయంలో, దాని ప్రక్కనే అతివాద అవకాశవాదం పొంచి కూర్చొని తలపైకి ఎగరేస్తూ వుంటుంది. ఒక్కోసారి మితవాదాన్ని అలా కాసేపు పక్కనుంచి ఈ అతివాదాన్ని ఎదుర్కోవలసి రావచ్చు.

## అతివాద అవకాశవాదం- 'ఆచరణ' అన్న వ్యాసంలో మావో వివరణ

*"మనము "అతివాద" వాగాడంబరానికి కూడా వ్యతిరేకం. అతివాదుల ఆలోచనా విధానం భౌతిక క్రమం యొక్క ఒకానొక అభివృద్ధి దశను దాటవేస్తుంది. కొందరు తమ ఊహలను నిజమని భావిస్తారు. మరికొందరు భవిష్యత్‌లో మాత్రమే సాధించగలిగే ఒక ఆశయాన్ని యిపుడే సాధించడానికి శ్రమ పడతారు. తమకు తామే అత్యధిక ప్రజల ప్రస్తుత ఆచరణ నుండి మరియు నేటి వాస్తవాల నుండి వేరుపడతారు. తమను తాముగా తమ చర్యల్లో దుస్సాహసికులుగా చూపెట్టుకొంటారు."*

*"భావవాదం-యాంత్రిక భౌతికవాదం, అవకాశవాదం-దుస్సాహసిక వాదం-వీటన్నిటికీ భౌతిక వాస్తవికత, స్వీయాత్మకతల మధ్య అగాధం ఏర్పర్చడం, జ్ఞానాన్ని ఆచరణ నుండి విడదీయడం అనే లక్షణా లుంటాయి. మార్క్సిస్టు-లెనినిస్టు జ్ఞానసిద్ధాంతం, తన శాస్త్రీయ సామాజిక ఆచరణ అనే విశిష్ట లక్షణం మూలంగా ఈ తప్పుడు భావజాలాలను అంగీకరించక పోవడమే గాక నిశ్చయాత్మకంగా వ్యతిరేకిస్తుంది".*

*"విశ్వం తాలూకు సంపూర్ణమైన, సాధారణమైన అభివృద్ధి క్రమంలో ప్రతి ప్రత్యేక క్రమం యొక్క అభివృద్ధి సాపేక్షికమైనదేననీ, అందువలన అనంతమైన సంపూర్ణ సత్య ప్రవాహంలో ఒకానొక అభివృద్ధి దశలో వున్న, ఒకానొక అభివృద్ధి క్రమానికి సంబంధించిన మానవ జ్ఞానం, సాపేక్షిక సత్యం మాత్రమేనని గుర్తిస్తారు. అసంఖ్యాక సాపేక్షిక సత్యాల సమగ్ర మొత్తమే సంపూర్ణ సత్యమవుతుంది".*

కనుక పైన పేర్కొన్న అతివాద, మితవాద ధోరణులు ఈ వెలుగులో పరిశీలించాలి. కేవలం భౌతిక పరిస్థితి అనుకూలతలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని స్వీయాత్మక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకపోవటం మూలంగానూ, ఆచరణను సిద్ధాంత అవగాహన నుండి వేరు చేసే పద్ధతి మూలంగానూ ఈ మితవాద అవాకాశవాదం, అతివాద అవకాశవాదం మన భుజాలపైకెక్కి కూర్చుంటాయి. ఈ రెండు ధోరణులూ తీవ్ర హాని కలిగించేవే. వీటిపై రాజకీయ సిద్ధాంత పోరాటం సాగించడం ద్వారానే విప్లవ ప్రజా ఉద్యమాన్ని పురోగమింపచేయగలం. అవకాశవాదంతో పోరాటాన్ని పట్టించుకోకపోవటంగానీ, వాయిదా వేయటంగానీ అంటే ప్రజా ఉద్యమ నిర్మాణానికి తీవ్ర విఘాతం కలిగించుకోవడమే. అంతేకాదు; ప్రజా విముక్తి పోరాటాన్ని వాయిదా వేయడం కిందకే వస్తుంది.

## ముగింపు

దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాట వెల్లువలొచ్చాయి. భారత ప్రజలు సాత్విక పోరాటాల దగ్గిర నుంచి సమరశీల పోరాటాల వరకు ఎన్నో కష్టాలకోర్చి, త్యాగాలు చేసిన ఫలితమే అవి. చరిత్రలో అవి గొప్ప పోరాటాలుగా నిలిచి వుంటాయి. కమ్యూనిజాన్ని సాధించాలనే లక్ష్యం గల కమ్యూనిస్టు పార్టీ తన పాత్రనెలా నిర్వహించిందో గూడ కొంతవరకు పరిశీలించాం. నేడు విప్లవ కమ్యూనిస్టులు తమ పోరాట పద్ధతులను రూపొందించుకునే టప్పుడు ఒకటీ, రెండు విషయాల్ని దృష్టిలోకి తీసుకోవలసి వుంది. అవి:

1) విప్లవ స్థావరాల నిర్మాణం గురించి మనం జాగ్రత్తగా ఆలోచించాలి. నేటి మన దేశ పరిస్థితిలో వివిధ ఏరియాలలో వివిధ ఎత్తుగడలను అనుసరించి బేస్ ఏరియా నిర్మాణం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అది ఎంతో సంక్లిష్టమైన, కష్ట సాధ్యమైన పని. కనుక దానికి తగిన క్రమం తీసుకోవలసి వుంటుంది.

2) మనం ప్రజాసంఘాలను వ్యవసాయ విప్లవోద్యమ పురోగమనానికి దోహదపడేవిగా, మన కేంద్రీకృత ప్రాంతాలలోనూ, వాటి చుట్టూ నిర్మించాలి. అదే సందర్భంలో వీటికి దూరంగానూ, అఖిల భారత స్థాయిలోను నిర్మించే ఈ సంఘాలు విస్తృత ప్రాంతాలలో విప్లవోద్యమ శక్తులను పెంచుకోడానికి దోహదపడాలి. ఈ రెండు ప్రతిపాదనల్లో ఒక దానిలో ఖచ్చితమైన నిర్దిష్ట ప్రయోజనం వుండగా రెండవ దానిలో దీర్ఘకాలిక, విస్తృత ప్రయోజనాన్ని ఆశిస్తున్నాం. అంటే మనం నిర్మించే ప్రజాసంఘాలు, లాంఛనప్రాయమైనవిగా, కేవలం చట్టపరమైనవిగా, బహిరంగమైనవిగా మాత్రమేగాక; సందర్భాన్ని బట్టి అవి మరింత లోతు, బరువు కలిగిన పాత్ర నిర్వహించగలగాలి.

3) ప్రత్యేకంగా కార్మికవర్గం నిర్వహించవలసిన విప్లవకర పాత్రను దృష్టిలో పెట్టుకొన్నప్పుడు వారిని రాజకీయంగా అభివృద్ధి చేయాలి. కార్మిక సంఘాలకు రాజకీయం వాటంతట వాటిలోనే ఉండదు. బయటి నుంచే అంటే పార్టీ ద్వారానే వారికి రాజకీయా లందించాలి.

4) ఒక నిజమైన విప్లవ పార్టీ లేకుండా, విప్లవోద్యమ నిర్మాణం సాధ్యం కాదు. రివిజనిస్టు, నయా రివిజనిస్టు, అతివాద ఒంటెత్తువాద పార్టీలకు భిన్నమైన పార్టీ కావాలి. విప్లవాన్ని విజయవంతం చేయాలంటే సరైన, నిజాయితీ చిత్తశుద్ధి గల శక్తులతో పార్టీ నిర్మాణం చేయాలి. పార్టీ నిర్మాణం లేకుండా; ఆ పార్టీలో విప్లవమే వృత్తిగా అంకితమైన వారు లేకుండా మనం నిర్వచించుకొన్న, రూపొందించుకున్న కర్తవ్యాలను పరిపూర్తి చేయలేం. "కమ్యూనిస్టు పార్టీ అంటే శ్రామికవర్గ అగ్రగామి దళమనీ, నాయకుల నిర్మాణమనీ" కామ్రేడ్ లెనిన్ చెప్పిన దానిని దృష్టిలో వుంచుకోవాలి. నాయకులు లేకుండా విప్లవోద్యమ బహుముఖ కర్తవ్యాలను నిర్వహించడం చాలా కష్టంతో, అత్యంత శ్రమతో కూడిన పనవుతుంది.

ప్రస్తుత పరిస్థితిలో కొన్ని కర్తవ్యాలపై నిర్దిష్ట కార్యక్రమం రూపొందించాలి.

1. విప్లవోద్యమానికి హానికరమైన తప్పుడు పంథాలపై నిరంతరం సిద్ధాంత, రాజకీయ, పోరాటం చేయాలి.
2. అభ్యుదయ ప్రజాతంత్ర శక్తులతో గూడిన విశాల వేదికలను రూపొందించాలి.
3. ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, విద్యా, ఆరోగ్య వికాసాల పట్ల శ్రద్ధ వహించాలనే అవగాహనను ఆచరణాత్మకం చేయటానికి తగిన చర్యలు తీసుకోవాలి.
4. గ్రామ, బస్తీ, ఫ్యాక్టరీ, పని ప్రాంతం ప్రాతిపదికపై ప్రజలను వివిధ సంఘాలలో నిర్మాణయుతులను చేయాలి. రాష్ట్ర సంఘాలకు అఖిల భారత సంఘాలకు జవమూ, జీవమూ నిచ్చే ఈ గ్రాస్‌రూట్ నిర్మాణాల పట్ల శ్రద్ధ పెట్టాలి.
5. ప్రత్యర్థులు, వర్గ శత్రువులు చేసే దాడులనుండి రక్షించుకొనడానికి అన్ని వేళలా సిద్ధంగా వుండాలి.
6. ప్రజలపై ఆధారపడి పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి.
7. ప్రచార యంత్రాంగాన్ని బహిరంగంగాను, ఆంతరంగికంగానూ ఏర్పాటు చేసుకోవాలి.
8. నిజమైన విప్లవ శక్తులతో, సంస్థలతో స్నేహపూర్వక సంబంధాలు నెరపడం ద్వారా ఐక్యతకు మార్గం సుగమం చేయాలి.

మన ప్రజలకు మహోన్నత పోరాట సాంప్రదాయం వుంది. వారి పోరాటాలాల అనుభవాల నుండి విప్లవకారులు నేర్చుకోవాలి.

1. భారత ప్రజలు గొప్ప పోరాట సాంప్రదాయాలు గల వారనేది నిర్వివాదం.
2. గదర్‌పార్టీ భారత స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సాయుధ ప్రతిఘటనే మార్గమని విశ్వసించింది. విద్యార్జనకోసం అమెరికా, కెనడాలకు వెళ్లిన భారత యువకులకు స్వాతంత్ర్యయోధులుగా శిక్షణనిచ్చి, వారిని భారత దేశానికి పంపించి, భారత దేశంలో బ్రిటిష్ సేనలకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలన్న లక్ష్యంతో ఈ పార్టీ అమెరికా, కెనడాల్లో పనిచేసింది. కాని వారి పంథా విజయాన్ని సాధించలేకపోయింది. దీనికీ-ఆనాడు భారతదేశంలో సాగుతున్న జాతీయ విముక్తి

**(తరువాయి 11వ పేజీలో)**

# సఫాయి కార్మికులు

# ఎవరికొచ్చిందీ స్వాతంత్ర్యం?!

ప్రతి సంవత్సరం మన దేశ పాలకులు పెద్దఎత్తున ఆర్భాటాలతో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలుకానీ, 'స్వాతంత్ర్యం' 'సమభావం' గురించి వారు గొప్పగా ప్రవచించే వాఖ్యానాలు కానీ మనదేశంలోని విశాల ప్రజారాశులు కనీసపాటి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలకు నోచులేదనే విషయాన్ని మరుగుపరచలేవు. మన దేశంలో అణచివేతకు గురౌతున్న వివిధ సెక్షన్ల ప్రజానీకం, గడచిన ఆరుదశాబ్దాలపైగా కాలంలో పొందిన అతి చేదైన జీవితానుభవాలనుండి తమకు స్వాతంత్ర్యం రాలేదనీ, నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకోసం పోరాడవలసే వుందని భావిస్తున్నారనేది వాస్తవం. దేశంలోని వివిధ ప్రాంతాలలో వాల్మీకి దళితులు, ఆస్టమ్, హేలా, హాది, అరుంధతియార్, మాదిగరెల్లి, పాకీ, చెక్కిలియార్, భంగీలు, తదితర పేర్లతో పిలవబడుతూ, పాకీదొడ్లలో మానవ మలాన్ని చేతులతో ఎత్తిపోస్తూ ఈ దేశంలో ఏమాత్రం స్వాతంత్ర్యం, కనీసపాటి గౌరవంలేక దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు.

మనదేశంలో అనాదిగా కొనసాగుతున్న దుర్మార్గమైన కులవ్యవస్థ–పాకీ పనివారికి మానవ మలమూత్రాలను కక్కసుదొడ్ల నుండి చేతులతో ఎత్తి గంపలలో, బక్కెట్లలో తలపై మోసుకొని దూరంగా తీసుకొనివెళ్ళే అమానవీయ, జుగుప్సాకరమైన పనులను నిర్దేశించింది. మానవ మలమూత్రాలను మోసుకెళ్ళే ఈ పాకీపనివారు ఈ నాగరిక సమాజానికి అత్యావశ్యకమైన పనిని చేస్తూ, మురికిని తొలగిస్తూవున్నారు. వీరంతా అత్యధికులు నిరక్షరాస్యులు. కరుడు గట్టిన కులవ్యవస్థ వీరిని అంటరానివారిగా చూస్తున్నది. దళితులకంటే కూడా దిగువగా వీరు చూడబడుతున్నారు. సమాజం వీరిని తుచ్ఛమైనవారిగా చూస్తున్నది. ఈ పనిలోనున్న ఆడవారు మరింత ఘోరమైన స్థితిలో వున్నారు. వీరి భర్తలు తమకు కలిగే అవమానాలన్నింటినీ ఏవిధంగా ప్రతిఘటించాలో, అణచుకోవాలో అర్థంకాని స్థితిలో వారి భార్యలను తిట్టటం, కొట్టడంద్వారా కొంత ఉపశమనం పొందుతారు. జీవిత కాలమంతా మానవ మలమూత్రాలను ఎత్తివేసే పనులలో వుండే వీరు ఎన్నోరకాల జబ్బులకు, దీర్ఘవ్యాధులకు గురౌతూ, ఏవిధమైన వైద్య సహాయానికి నోచుకోకున్నారు. ఈ విధంగా కులవ్యవస్థ వారిని మరో గత్యంతరంలేని చట్రంలో బందీ చేసింది.

సమాజంలో పాకీపనివారు ఒక్కరోజు పనిమాని వేస్తే గగ్గోలుపెట్టేంతగా, అత్యవసరమైన పనిని చేస్తూ కూడా వీరు అంటరానితనానికి గురైవున్నారు. రాజ్యాంగం అంటరానితనాన్ని నిషేదించటం లేదా తత్సంబంధ చట్టాలు, శాసనాలుచేయటం కానీ; సమాజంలో పౌరులందరూ సమానమేననే ధర్మపన్నాలు కానీ పాకీపనివారి అమానవీయ, జుగుప్సాకర పనిని ఖండించి రద్దుచేయగల స్థితిలో లేవు. పౌరహక్కుల పరిరక్షణచట్టం (1955) కానీ, షెడ్యూల్ కులాల, తెగల (అత్యాచార నిరోధక)చట్టం(1989) కానీ, మానవ మలాన్ని శుభ్రపరిచే పాకీపని వారికి ఉద్యోగాల కల్పన, ఆ విధమైన కక్కసుదొడ్ల నిర్మాణాన్ని నిషేధించే చట్టం(1993) కానీ... ఆచరణలో నిరుపయోగంగా మిగిలిపోయాయి. మానవ మలాన్ని మనుషులే ఎత్తివేసే విధానం ఏవిధమైన నియంత్రణా లేక కొనసాగుతున్నది. దీన్ని నిషేదిస్తూ చట్టాలు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ శాఖలలోనూ, భారత రైల్వే శాఖలోనూ మనుష్యులద్వారా మానవ మలమూత్రాలను ఎత్తివేయించే విధానాన్ని కొనసాగిస్తూ మరోవైపున రాజ్యాంగం, సమానత్వం గురించి గొప్పగా చెబుతున్నాయి. కొన్ని ప్రైవేటు కంపెనీలు కూడా ఇదే బాటలో సాగుతున్నాయి. మురుగు కాల్వల 'మాన్‌హోల్స్'లోకి మనుషులు దిగి పని చేయటమనే దానిని చట్టం నిషేదించినప్పటికీ మనదేశంలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలూ, మాన్‌హోల్స్‌లో గుండా దిగి శుభ్రంచేసేందుకు పాకీపని వారిని పనుల్లోకి తీసుకుంటున్నాయి. ఇలాంటి అనేక సందర్భాలలో మాన్‌హోల్స్‌లో వెలువడే విషవాయువుల ఫలితంగా ప్రతిరోజూ ఏదో ఒక చోట కార్మికులు ప్రాణాలొదటాన్ని చూస్తున్నాం.

ఈ పాకీ పనివారికి కేటాయించిన పునరావాస పథకాలు కూడా నిరుపయోగంగా మిగిలిపోయాయి. మునిసిపాలిటీలలో వీరిని రోజువారీ కూలీలుగా ఉపాధి కల్పిస్తూ తిరిగి వీరిని మురుగు కాల్వలు, మురికిని శుభ్రపరిచే పనులకు మాత్రమే కేటాయిస్తున్నారు. అత్యంత ప్రమాదకర పనులలో వుంటున్న వీరికి పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ.వంటి కనీసపాటి పథకాలు కూడా వర్తింపజేయటంలేదు. ఈ పాకీ పనిచేసే వారి పిల్లల జీవితాలను మెరుగుపరిచేందుకు విద్య, శిక్షణ గరపటం అనేవి ప్రస్తుత వ్యవస్థలో ఏనాటికీ నెరవేరని కలలుగానే మిగిలిపోయాయి.

ఈ వ్యవస్థ తమపై రుద్దిన ఈ అగౌరవమైన, అమానవీయమైన పాకీ పనిని నిరసిస్తూ గత ఆరు దశాబ్దాలపైగా పాకీ పనివారు ఆందోళనలు, నిరసనలు, పోరాటాలు చేపడ్తూవస్తున్నారు.

మూడుమాసాల క్రితం కర్ణాటక రాష్ట్రంలో సావనూర్ మునిసిపాలిటీలో పనిచేస్తున్న భంగీలు (పాకీ పనివారు) మానవ మల మూత్రాలను తమ నెత్తిపై పోసుకుని ఎంతటి భయంకరమైన, అమానవీయమైన, జీవితాన్ని తాము గడుపుతున్నామనే దానిని ఎత్తి చూపుతూ తమ తీవ్ర నిరసనను, ఆందోళనను వ్యక్తంచేశారు. వీరు తమకు ఇంటి సౌకర్యం కల్పించాలని, తమ బిడ్డలకు ఉద్యోగాలు కల్పించాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

2010 మే నెలలో హర్యానా రాష్ట్రం, అంబాలా మునిసిపాలిటీ పరిధిలో పాకీ పనిచేసేందుకు తీసుకోబడినవారు, పునరావాస పథకం క్రింద తమకు రావలసిన సౌకర్యాలకోసం, స్థానిక ప్రభుత్వ అధికార యంత్రాంగపు అవమానకర ప్రవర్తనను నిరసిస్తూ అంబాలా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా మానవ మలమూత్రాలను ఎత్తుకెళ్ళే బక్కెట్లు, గంపలను తగులబెట్టారు. ఈ కార్యక్రమం చేపట్టిన పనివారు పనిలో మందకొడిగా వ్యవహరిస్తున్నారని, ఆషామాషీగా వ్యవహరిస్తున్నారనే కారణంతో, పనులనుండి తాత్కాలికంగా తొలగింపబడ్డారు. మానవ మల మూత్రాలను ఎత్తుకెళ్ళే ఆ పనిని చేయటానికి నిరాకరిస్తూ వారే ఆ పనులనుండి తప్పుకొని తామే ఆవిధంగా స్వేచ్ఛను పొందుతున్నామని ప్రకటించారు.

ఏమైనా, ఈ పాకీపనినుండి విముక్తి పొందుతామని ప్రతిజ్ఞచేసి, మునిసిపాలిటీ విధులనుండి తప్పుకున్న ఆడవారు కొందరు తిరిగి తాము తగులబెట్టిన తట్టలను, బక్కెట్లను తీసుకొని తమ కుటుంబాల, బిడ్డల మనుగడకోసం ఈ కరుడు కట్టిన కులవ్యవస్థ తమపై రుద్దిన అమానవీయమైన పాకీపనిని చేయకతప్పలేదు.

ఈ పాకీ పనివారి అమానవీయ జీవితాలను, పని పరిస్థితులను వెల్లడిచేస్తూ, మన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఈ పాకీ వృత్తిచేసే కుటుంబాలకు చెందినవారు, 'సఫాయి కర్మచార్ ఆందోళన్' నాయకత్వంలో ఐదు బస్సులలో ఢిల్లీ చేరుకొని తమ గౌరవం, విముక్తి గురించి నినదిస్తూ నవంబర్ 1వ తేదీన 'సామాజిక్ పరివర్తన్ ర్యాలీ' నిర్వహించారు. అవమానకరమైన, లజ్జాకరమైన ఈ వృత్తిలోకి తిరిగి వెళ్ళబోమని ఈ సందర్భంగా వారంతా ప్రతినబూనారు. తమకు తిండిలేక బ్రతకలేకపోయినప్పటికీ ఈ అమానవీయమైన పాకీ పనిచేయబోమని ప్రకటించారు.

ఉపన్యాసకులలో కొందరు నిజంగా మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందా అని ప్రశ్నించారు. మేమంతా ఇతరులతో సమానంగా చూడబడిననాడే మాకు స్వాతంత్ర్యం వచ్చిందని భావిస్తామని మరో పాకీ పనిచేసే అతను ప్రకటించాడు.

ఈ నిరసన ధర్నాకు హాజరైన సామాజిక కార్యకర్త అరుణారాయ్ నాల్గవ తరగతి ఉద్యోగాలలోకాక, విద్యలోనూ, ఉన్నత అధికార స్థానాలలోనూ ఈ వృత్తిలోని వారికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

సోనియాగాంధీ నేతృత్వంలోని జాతీయ సలహామండలి ఈ నిరసనల నేపథ్యంలో పాకీ పనివారల స్థితిగతులు ఆ సందర్భంలోనే తమ దృష్టికి వచ్చిన విధంగా స్పందించింది. స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్దాలపైగా సాగుతున్న ఈ అమానవీయ పనివిధానాన్ని 11వ పంచవర్ష ప్రణాళిక అంతానికి రాష్ట్ర, కేంద్ర, స్థానిక ప్రభుత్వాలు, రైల్వేలతో సహా నిషేదించాలని పేర్కొంది. దాదాపు అర్థశతాబ్దకాలంగా ఈ దేశాన్ని ఏలిన కాంగ్రెస్‌పార్టీ లజ్జాకరమైన ఈ విధానాన్ని కొనసాగించటంలో తమ పాత్ర ఏమీ లేదన్నట్లుగా, దీనికి వేరెవరో ఇతరులు కారణమన్నట్లుగా వ్యవహరించింది. ఈ విధంగా అణచివేతకు గురిచేయబడుతున్న పాకీ పనివారలను పునరావాస పథకాలు, చర్యల గురించి ప్రకటించి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మభ్యపరిచే ప్రయత్నం చేసింది.

'సఫాయి కర్మచార్ ఆందోళన్' అంచనా ప్రకారం దేశంలో 3 లక్షల మందికిపైగా మానవ మలమూత్రాలను చేతులతో ఎత్తివేసే పాకీ పనివారు వున్నారు. స్వీపర్ల పేరిట ఉపాధి కల్పించిన అతి కొద్దిమందిని కూడా ఇదే పనులకు ఉపయోగిస్తున్నారన్నది స్పష్టం.

అరుణారాయ్ వంటి సామాజిక ఉద్యమ కార్యకర్తలు ప్రస్తుత సామాజిక–ఆర్థిక చట్రానికి లోబడిన విషయంగా దీనిని భావిస్తున్నారు మినహా దీనికి కారణమైన అమానవీయ కులవ్యవస్థ లోతుపాతులలోకి చూడడంలేదు. ప్రస్తుత దోపిడీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసం కాకుండా దోపిడీలేని, సమానత్వం కలిగిన నూతన సామాజిక వ్యవస్థ స్థాపన జరగనంతవరకూ, ఈ అమానవీయ, దౌర్భాగ్యకరమైన విధానాన్ని రూపుమాపటం సాధ్యంకాదు.

కులవ్యవస్థ ఆధారితంగా ప్రస్తుతం ఉనికిలోవున్న సామాజిక–రాజకీయ–ఆర్థిక వ్యవస్థలో ఇతర అన్ని కులాలనుండి శుభ్రపరిచే ఉద్యోగాలకు తీసుకోవటం అనేది చేయరు. అతి దిగువస్థాయిలోనున్న పాకీ పనివారికి రిజర్వేషన్ అందకుండా, అందులోనున్న నోరుగలిగిన సెక్షను ప్రయోజనం పొందటాన్నుండి ఆపటమూ జరగదు.

అమానవీయమైన ఈ తరహా పాకీపని మన దేశంలోని కులవ్యవస్థతో ముడిపడివున్నదనే విషయాన్ని అర్థంచేసుకోవటంవరకే కాకుండా, వారి దుర్భరమైన జీవన, పని పరిస్థితులను, వారిపట్ల దశాబ్దాలుగా పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య, దుర్మార్గపూరిత విధానాలను వెల్లడిచేయటంద్వారా, వారి విముక్తికి అవసరమైన విప్లవోద్యమంలోకి సమీకరించాలి. దోపిడీ అసమానతలులేని ఒక నూతన సామాజిక వ్యవస్థ సాధనకోసం, ప్రస్తుత దోపిడీ వ్యవస్థను కూలద్రోసేందుకు ఇతర వర్గాల, సెక్షన్ల ప్రజానీకం సాగిస్తున్న పోరాటాలతో అనుసంధానం చేయాలి. ★

---

**భారత...** (10వ పేజీ తరువాయి)

పోరాటాలకు సంబంధం లేకపోవడమే దీనిక్కారణం. ఆ తర్వాత, వీరిలో కొందరు కమ్యూనిస్టు పార్టీలో చేరిపోయారు.

3. భగత్‌సింగ్, తదితరులు బ్రిటిష్ వలసపాలననుండి స్వాతంత్ర్యం సాధించడానికి సాయుధ ప్రతిఘటనే మార్గమని విశ్వసించారు. ఉద్యమంయొక్క తొలికాలంలో వారు టెర్రరిస్టు పద్ధతులను అనుసరించారు. జైలులో వున్న సమయంలో భగత్‌సింగ్ మార్క్సిజాన్ని, యితర దేశాల విప్లవ చరిత్రలను, ముఖ్యంగా రష్యా విప్లవ చరిత్రను శ్రద్ధగా అధ్యయనం చేశాడు. కార్మిక–కర్షక విప్లవ ప్రజాపోరాటాలద్వారా మాత్రమే భారతదేశం స్వాతంత్ర్యం సాధించగలదన్న అవగాహనకు వచ్చాడు. ఐతే, ఆయన అమరుడైన చాలా సంవత్సరాల తర్వాతే ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి.

4. కొమరం భీం, బిర్సాముండా, అల్లూరి సీతా రామరాజు, రాంజీ గోండ్, తిలకా మాజీ, సైదియా ఖాన్ ఆదివాసీ ప్రజలను మేలుకొలిపి ప్రజా విప్లవ పంథాను అనుసరించారు. ఈ పోరాటాలు స్థానిక ఫారెస్టు అధికారుల, రెవిన్యూ అధికారుల జులుంకి బ్రిటీష్ కాంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా మాత్రమే కాక ఫ్యూడల్ మహల్వారీ తదితర విధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు జరిగాయి. వీటిలో అత్యధిక పోరాటాలు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానే జరిగాయి. వీరి పోరాటాలు భౌగోళికంగా పరిమిత ప్రాంతంకావటం, కేవలం బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేకంగా మాత్రమే కావటం వలనా – సమగ్ర రాజకీయ దృక్పథమూ, ఆధునిక ఆయుధాలు సాధన సంపత్తి గూడా లేని యుద్ధాలుగా జరిగి ఓటమి చెందాయి.

5. కాంగ్రెస్ సంస్థ స్థాపన తర్వాత సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎన్నో నిర్మాణాలు రూపొంది మరెన్నో రైతాంగ కార్మికవర్గ పోరాటాలు జరిగాయి. కాంగ్రెసు అహింసా సిద్ధాంతం తోటి సామ్రాజ్యవాదులకి నొప్పి తగలకూడదని వాటిని పురోగమించనీయలేదు. బ్రిటీష్ నిరంకుశత్వానికి బలయ్యాయి.

6. కమ్యూనిస్టు పార్టీ కార్మిక కర్షకులను ఆర్గనైజ్ చేసినప్పటికీ శ్రామిక వర్గ నాయకత్వాన రాజ్యాధికారంలోకి రావాలన్న అవగాహనను ప్రక్కనుంచింది. బూర్జువా వర్గానికి తోకగా వ్యవహరించింది. తెలంగాణా రైతాంగ పోరాటాన్ని నీరుగార్చి ద్రోహం చేసింది. పార్టీలో మితవాద, సంస్కరణవాద నాయకత్వం తిష్టవేసుకొని ప్రజా పోరాటాలను సమరశీలంగా ముందుకు తీసుకెళ్ల డానికి ఆటంకంగా నిలిచింది. అంతర్జాతీయంగా ఆధునిక రివిజనిస్టుల సహకారంతో శాంతియుత సూత్రాలను భుజాన వేసుకొంది. నెహ్రూ ప్రభుత్వంపై భ్రమలు, ఆశలతో పోరాడే ప్రజలనూ, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధించే విప్లవకర మార్గాలను వదిలివేసింది. వర్గ పోరాటాలపై నీళ్లు చల్లింది. కొద్దికాలంలోనే, సరైన పంథాను అనుసరిస్తున్న నాయకత్వాన్ని అస్థిరపరచడంలో, కూలద్రోయడంలో మితవాద సంస్కరణవాద, అతివాద వొంటెత్తువాద శక్తులు ఏకమయ్యాయి.

7. సి.పి.ఐ(యం) మితవాద అవకాశవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కనబడుతూ అంతిమంగా అదే విధానాలను అమలు జరిపింది. శాంతియుత మార్గాలకుండే అవకాశాలను వదులుకోనంది. నిర్బంధం వచ్చినపుడు జైలు నుండి నందాకి వ్రాసిన లేఖలో సిపిఐ ప్రోగ్రాంకి తమ ప్రోగ్రాంకి తేడా లేదని చెప్పింది. భూస్వామ్య శక్తుల దాడులనుంచి ప్రజలు రక్షించుకొనే మార్గాలను మూసివేసింది. వామపక్ష మిశ్రమ మంత్రి వర్గాలను కాపాడే బాధ్యత కష్టజీవులపై మోపింది. పార్టీకి విప్లవ పంథా లేకుండా చేసింది. పార్లమెంటరీ ఊబిలోకి దిగింది.

8. సి.పి.ఐ(యం) నయా రివిజనిస్టు విధానాలపై తిరుగుబాటు చేసిన విప్లవశక్తులు విడివిడిగా సిద్ధాంత పోరాటం చేశాయి. పార్టీ ఆంతరంగిక పోరాటం సాగడానికి వీలులేని పరిస్థితిని పోలిట్‌బ్యూరో కల్పించినప్పటికీ బర్ద్వాన్ కేంద్ర ప్లీనం దాకా సిద్ధాంత పోరాటం కొనసాగించారు కొంతమంది. కొన్ని అస్పష్ట వైఖరులు వ్యక్తమయినప్పటికీ (ప్రధాన వైరుధ్యం, సెమికాలనీ, న్యూకాలనీ విషయాలపైన) పార్లమెంటరీ పంథా కాదని, చైనా విప్లవ పంథాను తమ పంథాగా ప్రకటించారు.

9. చైనా విప్లవ పంథాయే మన పంథా అని ప్రకటించిన కొంతమంది విప్లవకారుల్లో సెక్టేరియన్ పోకడలు తలెత్తాయి. దీని మూలంగా విప్లవ పరిస్థితిని ఉపయోగించుకొనే విప్లవ ఎత్తుగడల గురించి, విప్లవ నిర్మాణం గురించీ, ప్రజా నిర్మాణాల గురించి సమగ్ర అవగాహన రూపొందించు కోలేకపోయాయి. ప్రభుత్వ యంత్రాంగమూ, రివిజనిజం ఒక వేపున దాడి చేస్తూండగా దోపిడి వ్యవస్థ నిర్మూలన నినాదం స్థానంలో చారు మజుందార్ వర్గ శత్రువులను వ్యక్తులుగా ఖతం చేసే సిద్ధాంతం పై చేయి సాధించింది. టెర్రరిస్టు, సెమీ టెర్రరిస్టు పోకడలు మితవాద లొంగుబాటుకి దారితీశాయి. ఈ యాక్షన్ ఓరియంటెడ్ గ్రూపు అనేక గ్రూపులుగా చీలిపోయింది. లిన్‌పియావో "ప్రజాయుద్ధ విజయం చిరస్థాయియగు గాక" సిద్ధాంతాన్ని అనుసరించి నిలకడైన ప్రజా కార్యాచరణలేని గ్రూపులుగా ప్రజాశత్రువులపై వ్యక్తిగత దాడుల పరంపరనే ప్రజాయుద్ధంగా అమలు పరిచారు. బొలీవియాలో విప్లవాన్ని తనదైన పద్ధతిలో సాగించిన చిగువేరా విప్లవ పంథాను అనుసరించేవారూ వున్నారు. వీరందరూ మన దేశ నిర్దిష్ట పరిస్థితికి తగిన విధంగా మార్క్సిజం– లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని అన్వయించుకోవడంలో విఫలమయ్యారు. విప్లవ స్థావరాల నిర్మాణం, గెరిల్లా యుద్ధతంత్రం, విప్లవం యొక్క తక్షణ, దీర్ఘకాలిక లక్ష్యాలను గందరగోళపరిచే వాదనలు, సిద్ధాంతాలు పెద్ద ఎత్తున వ్యాపింప చేశారు. సిపిఐ(యం) నుండి విడగొట్టుకొన్న వివిధ ప్రాంతాలకు చెందిన కమ్యూనిస్టు విప్లవ కారులందరూ ఒకచోటికి చేరి; చేరి నిలబడటానికి అఖిల భారత సమన్వయ కమిటీ నాయకత్వం అవకాశం లేకుండా చేసింది. ఆ విధంగా శ్రామికవర్గ పార్టీ అయిన ఒక కమ్యూనిస్టు విప్లవకారుల పార్టీ నిర్మాణం గావించడానికి ఆటంకంగా నిలిచింది. సరైన ఎత్తుగడల పంథాని ఆచరణకు రానీయకుండా అడ్డుకొంది.

> **ఒక నిజమైన విప్లవ పార్టీ లేకుండా, విప్లవోద్యమ నిర్మాణం సాధ్యం కాదు. రివిజనిస్టు, నయా రివిజనిస్టు, అతివాద ఒంటెత్తువాద పార్టీలకు భిన్నమైన పార్టీ కావాలి. విప్లవాన్ని విజయవంతం చేయాలంటే సరైన, నిజాయితీ చిత్తశుద్ధి గల శక్తులతో పార్టీ నిర్మాణం చేయాలి. పార్టీ నిర్మాణం లేకుండా; ఆ పార్టీలో విప్లవమే వృత్తిగా అంకితమైన వారు లేకుండా మనం నిర్వచించుకొన్న, రూపొందించుకున్న కర్తవ్యాలను పరిపూర్తి చేయలేం.**

**ఈ అనుభవాలు మనకెంతో విలువైనవి. ఎంతో విలువైన మన కాలాన్ని, విలువైన మన జీవితాలను పణంగా పెట్టి విప్లవం కోసం నిలబడిన మనకు యివి మార్గదర్శకంగా వుంటాయి. ఈ అనుకూల, ప్రతికూల పాఠాలను మన జీవితం మనకు నేర్పింది. మనం సంఘటితమై ముందుకే వెళ్దాం, విప్లవం జయించి తీరుతుంది.** ★

# ప్రపంచంలోని వివిధ దేశాలలో ప్రజల నిరసనాందోళనలు

### ఐక్యరాజ్యసమితి నిర్వహించిన 'వాతావరణ మార్పులపై' సదస్సుకు రైతుల నిరసన

**ఐక్యరాజ్యసమితి** ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులపై' కాన్‌కున్‌లో నిర్వహించిన సదస్సును వ్యతిరేకిస్తూ జీవనం, పర్యావరణం, సామాజిక న్యాయాల కోసం పోరాడే 'ప్రత్యామ్నాయ ప్రపంచ వేదిక' అదే ప్రాంతంలోని ఒక బాస్కెట్‌బాల్ కోర్టులోని వ్యాయామశాలలో మరొక సభను నిర్వహించింది. ఈ ప్రత్యామ్నాయ వేదిక నిర్వహించిన సభలకు 70 దేశాల నుండి రైతులు, కార్మికులు, వివిధ సెక్షన్ల ప్రజానీకం హాజరయ్యారు. వారంతా తమ హక్కులకోసం ఎలుగెత్తి నినదించారు.

నవంబర్ 28వ తేదీ నుండి ప్రారంభించి 'అంతర్జాతీయ రైతు ఉద్యమం' సంస్థ నాయకత్వంలో మెక్సికోను చుట్టివచ్చి రైతులు ఈ సభలలో పాల్గొన్నారు. డిసెంబరు 7వ తేదీన ఐక్యరాజ్య సమితి మరియు సభ్య దేశాల ప్రభుత్వాలు సూచించిన మార్కెట్ ఆధారిత తప్పుడు పరిష్కారాలకి నిరసన వ్యక్తం చేశారు.

అమెరికా మరియు ట్రాన్స్‌నేషనల్ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడే మెక్సికన్ ప్రభుత్వ విధానాలను ఆ దేశం నుండి హాజరైన ఆందోళనకారులు నిరసించారు. మెక్సికన్ భూభాగంలో 70 శాతాన్ని గనుల తవ్వకానికి కేటాయించారనీ 25 శాతాన్ని కెనడా కంపెనీలు ఆక్రమించుకున్నాయని వారు ఆరోపించారు. మెక్సికోలోని నదులన్నీ కలుషితమయ్యాయి. ప్రతివిషయమూ ఆఖరుకు నీరూ, చెత్తాచెదారమూ కూడా వ్యాపారమయమై పోయాయి. ఈ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రభుత్వాలు వాతావరణ మార్పులపై చేసిన ప్రతిపాదనలు, ఆ సమస్యలను పరిష్కరించటంకంటే మరింతగా ఆ సమస్యలను డబ్బు సంపాదనకు సాధనాలుగా మలుచు కోవటానికి ఉపయోగించుకున్నాయని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి నిర్వహించిన సదస్సు గాలిని, అడవులను ప్రైవేటీకరించటాన్ని బలపరుస్తూ కర్బన వ్యాపారం పేరిట ఆదాయాలను పొందుతూ దానినే ఒక పరిష్కార మార్గంగా ప్రకటిస్తున్నది.

తీవ్రంగా సాగిన అడవుల నరికివేత, గనుల తవ్వకం కారణంగా, జల విద్యుత్ పథకాల కారణంగా వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, భూభాగంపై పీడనం మరింతగా పెరుగుతున్నదని, వ్యవసాయానికి తోడ్పడే వాతావరణ విధానాలకోసం, భూమిపై హక్కుల కోసం గ్వాటిమలా రైతులు పోరాడుతున్నారనీ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావరణ మార్పులపై జరిగిన సదస్సు మరింతగా ప్రైవేటీకరణను పెంచేందుకే తోడ్పడుతోందని వారు పునరుద్ఘాటించారు.

### బుష్ పాలనా కాలంలోని పన్నుల కోతల పొడిగింపుకు నిరసన

ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ఒబామా రిపబ్లికన్ ప్రతిపక్షంతో రాజీ పడటం ద్వారా బుష్ పాలనా కాలంలో విధించిన పన్నుల కోతలను 2011 జనవరి 1 నుండి మరో రెండు సంవత్సరాల పాటు పొడిగించేందుకు అంగీకరించాడు.

బుష్‌పాలనా కాలంలో విధించిన పన్నుల కోత కారణంగా దేశంలో 2 శాతంగావున్న అత్యంత ధనికులు ఈ ఫలితాలను అనుభవిస్తున్నారు. ఈ పన్నులలో కోత కాలపరిమితి 2010 డిసెంబరు 31తో ముగుస్తున్నది. ఒక రాజీ ఒప్పందం ద్వారా దేశంలో అత్యంత ధనికులైన వారికి మరో రెండు సం॥ల పాటు ఈ పన్నుల కోతలను వర్తింపజేస్తూ ఒబామా నిర్ణయం తీసుకున్నాడు. ఈ కారణంగా నిరుద్యోగ బీమాను మరో సంవత్సరం పాటు వాయిదా వేయగలిగానని తన చర్యలను ఒబామా సమర్ధించుకున్నాడు. మధ్యతరగతి ప్రజానీకానికి కళాశాల విద్యపన్ను, బాలలపన్ను, ఆదాయపుపన్నులలో పరపతి సౌకర్యాలను కల్పించానని ప్రకటించాడు.

అత్యంత సంపన్నులకు ఈ పన్నుల కోతలను పొడిగించటాన్ని నిరసిస్తూ డిసెంబర్ 2వ తేదీన ఒక ప్రదర్శన నిర్వహించారు. న్యూయార్క్ నగరంలో లక్షాధికారులకు ఎటువంటి ఉద్దీపనలూ వద్దనే ప్లకార్డులను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

### లండన్, ఇటలీలలో విద్యార్థుల నిరసనలు

విశ్వవిద్యాలయాల్లో బోధనా రుసుము పెంపుదలకు బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదం తెలపటాన్ని నిరసిస్తూ విద్యార్థులు సమ్మె చేశారు. నవంబర్ 31న, డిసెంబరు 9న లండన్‌లో విద్యార్థులు నిరసన ధర్నాలు నిర్వహించారు. దేశవ్యాపితంగా వున్న వేలాదిమంది ప్రజలు లండన్ చేరుకొని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నిరసన, ధర్నా కార్యక్రమాలలో ట్రేడ్ యూనియన్లు కదలివచ్చి డిసెంబరు 9 కార్యక్రమంలో పాల్గొనటంతో పాటుగా విద్యార్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు నందించారు. పోలీసులు సాగించిన లాఠీఛార్జీని ఎదుర్కొని విద్యార్థులు పోలీసులతో తలపడ్డారు. డిసెంబరు 9వ తేదీన నిరసన కారులు రీజెంట్ వీధిలో ప్రిన్స్‌ఛార్లెస్ కారుపై దాడి చేశారు.

విద్యా బడ్జెట్‌లో కోతలను నిరసిస్తూ ఇటలీ విశ్వవిద్యాలయాల విద్యార్థులు రోమ్‌లో డిసెంబరు 23న నిరసన ధర్నాలను నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమాలలో ట్రేడ్‌యూనియన్లు, ప్రజాసంఘాలు కూడా మద్దతుగా పాల్గొన్నాయి. తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా కెంట్ విశ్వవిద్యాలయ విద్యార్థులు యూనివర్శిటీని దిగ్బంధనం చేసి నిరవధిక బైఠాయింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కాటర్‌బర్రీ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 8న విద్యార్థులు సెనేట్ భవనాన్ని ఆక్రమించుకున్నారు. మిలన్, పాలెర్మో నగరాలలో విద్యార్థుల నిరసనలను అణచటానికి ప్రయత్నించిన పోలీసులతో విద్యార్థులు తలపడ్డారు.

### జాతి వివక్ష, ఫాసిజాలను నిరసిస్తూ ఇజ్రాయిల్‌లో నిరసన

హక్కుల సంఘాలకు అందే విరాళాలు ఎక్కడనుండి ఏ విధంగా అందుతున్నాయనే దానిపై ఒక విచారణకు ఆదేశిస్తూ సెనేట్ నిర్ణయించటాన్ని నిరసిస్తూ జనవరి 15వ తేదీన వామపక్షాలకు, హక్కుల సంఘాలకు చెందిన 15 వేలమంది కార్యకర్తలు-ఒక పెద్ద ప్రదర్శన నిర్వహించారు.

టెల్-అవీవ్‌లోని ప్రధాన పార్క్ నుండి ఈ ప్రదర్శన ప్రారంభమైంది. యూదుల, అరబ్బుల కార్యకర్తలు కూడా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. జాతివివక్ష, ఫాసిజాలకు వ్యతిరేకంగానూ; అరబ్బుల,యూదుల ఐక్యత వర్ధిల్లాలని ప్రదర్శనకారులు నినదించారు. ప్రజాస్వామ్యాన్ని, భావ ప్రకటనా స్వేచ్ఛను వారు డిమాండ్ చేశారు. 'ప్రజాస్వామ్యానికై వేచి చూస్తున్నాం' 'ప్రమాదకర ప్రజాస్వామ్యం ముగియనుంది'. 'ప్రతీఘాతుక పాలనకు వ్యతిరేకంగా పోరాటం' 'సహాయం కోసం ప్రజాస్వామ్యం ఆక్రందన' వంటి నినాదాలతో బ్యానర్లను నిరసన కారులు ప్రదర్శించారు.

ఊరేగింపు ముగింపుగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రజాస్వామ్య హక్కులకోసం, భావ ప్రకటనా స్వేచ్ఛకోసం, యూదుల -అరబ్బుల హక్కుల సమానత్వం కోసం పిలుపు నివ్వటంతో పాటుగా మెక్‌కార్థిజమ్, ఫాసిజం, జాతివివక్షలను అంతమొందించాలని పిలుపునిచ్చారు.

### గ్రీసులో నిరసన ప్రదర్శనలు

డిసెంబరు 8వ తేదీన గ్రీసులోని ఏథెన్స్ నగరంలో ఒక పెద్ద నిరసన ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ స్ట్రాస్‌కాన్ యొక్క పర్యటనను వారు నిరసించారు. గ్రీసు దేశానికి సహాయం పేరుతో ఐ.ఎం.ఎఫ్. విధిస్తున్న షరతులను వారు వ్యతిరేకించారు. వేలాది మంది కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏథెన్స్ నగరంలోని కాన్‌స్టిట్యూషన్ స్క్వేర్‌లో అతి పెద్దదైన బ్యానర్‌ను వారు ప్రతిష్టించారు. దానిపై 'యూరప్ ప్రజలారా, లేవండి' అని రాశారు. మరొక బ్యానర్‌పై 'స్ట్రాస్‌కాన్‌కు గ్రీసులో ప్రవేశంలేదు. ట్రియోకా ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి' అని రాసి బహిరంగసభ వేదికపై వుంచారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీతో కలసి వామపక్ష ట్రేడ్ యూనియన్‌లు, ఇతర ప్రజాసంఘాలు ఈ ప్రదర్శన, ధర్నాలను నిర్వహించాయి.

### చిలీలో ప్రభుత్వ రంగ కార్మికుల సమ్మె

డిసెంబరు 7వ తేదీన 40 వేలమందికి పైగా చిలీ ప్రభుత్వ రంగ కార్మికులు వారి పనులను నిలిపివేసి తమ వేతనాలను 8.9 శాతం పెంపుదల చేయాలని, లేఆఫ్‌లు చేయరాదనీ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, పౌర సంబంధ ఉద్యోగులు, ట్రెజరీ కార్మికులు, జైలు గార్డులు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

### మెక్సికో కార్మికుల సమ్మె

35వేలమంది ఆరోగ్య సిబ్బంది డిసెంబరు 15న మెక్సికోలోని వెరాక్రూజ్ రాష్ట్రంలో తమ పనులను నిలుపుదల చేశారు. ఒక నెల కాలంగా తమ జీతాలను చెల్లించక పోవటాన్ని, క్రిస్టమస్ బోనస్‌ను, సంవత్సరాంత ప్రత్యేక బోనస్‌ను చెల్లించకపోవటాన్ని వారు నిరసించారు.

### మెక్సికోలో మునిసిపల్ భవనాన్ని ఆక్రమించుకొన్న కార్మికులు

మెక్సికోలోని రేనోసా, టాంపికో నగరాలకు చెందిన 600 మంది పైగా కార్మికులు సంవత్సరాంత బోనస్‌ల చెల్లింపును డిమాండ్ చేస్తూ మునిసిపల్ భవనాన్ని ఆక్రమించారు. కార్మికులు మునిసిపల్ భవన ముఖ ద్వారాన్ని దిగ్బంధించారు. ఆ వీధిమొత్తాన్ని చెత్తను సేకరించే ట్రక్కులతో నింపివేశారు.

### స్పెయిన్‌లో విమానయాన సిబ్బంది సమ్మె

స్పెయిన్ విమానయాన సిబ్బంది అందరూ డిసెంబరు 3వ తేదీన సామూహికంగా సిక్‌లీవ్ పెట్టి సమ్మెలోకి వెళ్ళారు. స్పెయిన్ ప్రభుత్వం తీసుకుంటున్న పొదుపు చర్యలను, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం చేపట్టటం ద్వారా విమాన ప్రయాణాలన్నింటినీ అడ్డుకున్నారు. సమ్మె రెండవ రోజున జాతీయ అత్యయిక పరిస్థితిని ప్రకటిస్తానని ప్రభుత్వం హెచ్చరించింది.

డిసెంబరు 18వ తేదీన వేలాదిమంది కార్మికులు తమ పదవీ విరమణ వయసును 65 నుండి 75కు పెంచటాన్ని, ఇతర పొదుపు చర్యలను నిరసిస్తూ దేశ వ్యాపితంగా ప్రదర్శనలు నిర్వహించారు.

### ఈజిప్టులో ట్రక్కు కార్మికుల సమ్మె

ఈజిప్టులో 70 వేల మంది ట్రక్కు డ్రైవర్లు, యజమానులు డిసెంబరు 10 నుండి నిరవధిక సమ్మె చేపట్టారు. పన్నుల పెంపుదలను; గురు, శుక్రవారాలలో జాతీయ రహదారులపై ట్రక్కులు ప్రయాణించరాదనే నిబంధనలను వీరు తీవ్రంగా వ్యతిరేకించారు. డిసెంబరు 16, 20 తేదీల్లో వందలాదిమంది సమ్మెకారులు కైరోలోని పార్లమెంట్ భవనం వద్ద నిరసనలు తెలిపారు.

### ఇజ్రాయిల్‌లో పరిశ్రమ ద్వారాల్ని మూసివేసిన కార్మికులు

డిసెంబరు 23న అగ్ని మాపక వాహనాలను, తదితర పరికరాలను తయారు చేసే కార్మికులు నజారత్ కర్మాగార ద్వారానికి తాళాలు వేసేశారు. గత ఆరు వారాలుగా తమకు జీతాలను చెల్లించకపోవటాన్ని, కార్మికుల పెన్షన్లలో యాజమాన్యం వైపునుండి చెల్లించాల్సిన భాగాన్ని చెల్లించకపోవటాన్ని వారు నిరసించారు. తమ డిమాండ్లను నెరవేర్చేవరకూ పరిశ్రమ గేట్లకు వేసిన తాళాలు తీయబోమని హెచ్చరించారు.

### అర్జెంటీనాలో బానిస తరహా స్థితిగతులు

అర్జెంటీనాలోని సామ్‌పెడ్రో నగరశివారులోని వ్యవసాయ క్షేత్రంలో బానిస తరహా పరిస్థితులు వెలుగులోకి వచ్చాయి. సదరన్ సీడ్ కంపెనీ వద్ద డిసెంబరు 15-29 మధ్య కార్మికులు చేరుకున్నారు. వారు అపరిశుభ్రమైన, అమానవీయమైన పరిస్థితులలో జీవిస్తున్నారని వెల్లడైంది. మొక్కజొన్న పొలాల్లో వారిచే రోజుకు 12 గంటల చొప్పున పనిచేయిస్తున్నారు. అతి తక్కువ జీతాలు వారికిస్తూ, అత్యంత తక్కువ ఆహారాన్ని వారికిస్తున్నారు. వారు గుడిశలను వీడి బయటకు వెళ్ళరాదని ఆంక్షలు విధించారు. అతిసార తదితర రోగాలతో వారిలో అనేకులు బాధలు పడ్డున్నారు.

జనవరి 8వ తేదీన మరో వ్యవసాయ క్షేత్రం శాన్‌నికోడాస్ వద్ద 120 మంది తమ పిల్లలతో సహా ఈ విధమైన బానిస తరహా జీవనాన్ని గడుపుతుండటం వెలుగులోకి వచ్చింది.

### ఇరాన్‌లో టైరు కార్మికుల సమ్మె

ఇరాన్‌లోని బారెజ్ టైర్ల పరిశ్రమ కార్మికులు తమకు నెల వారీ జీతాల ఒప్పందాలు కాకుండా శాశ్వత వేతన ఒప్పందాలు కావాలని డిమాండ్ చేస్తూ ఓవర్ టైము తాలూకు 70 గంటల పనికి పూర్తి వేతనాన్ని ఇవ్వాలని, వారంలో రెండు రోజులు శలవు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, బోనస్‌లకు ఉత్పత్తితో అనుసంధానించటాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెచేపట్టారు.

### పొదుపు చర్యలకు వ్యతిరేకంగా గ్రీసులో సమ్మె

గ్రీసు దేశ వ్యాపితంగా డిసెంబరు 15వ తేదీన ప్రభుత్వ పొదుపు చర్యలను నిరసిస్తూ 7వ సారి చేపట్టిన సార్వత్రిక సమ్మెతో దేశం స్తంభించింది. ప్రభుత్వం పెన్షన్లతో, వేతనాలలో కొత విధించింది. పన్నులు పెంచింది. పదవీ విరమణ వయసు పెంచింది. డిసెంబరు 13న సరికొత్తగా ఒక 'సంస్కరణ'ల ఒప్పందాన్ని పార్లమెంట్ ఆమోదించింది. దీని ఫలితంగా మరింతగా జీతాలు, వేతనాలలో కోత, ప్రభుత్వ రంగంలో నిర్బంధ బదిలీలను ఈ కొత్త ప్యాకేజీలో పొందుపరిచారు. ట్రేడ్ యూనియన్లు ప్రైవేటు రంగంలో యాజమాన్యంతో బేరసారాలాడే విధానాన్ని తగ్గించి వేసింది.

నిరసన ప్రదర్శనలు, ధర్నాలు గ్రీసులోని అన్ని పట్టణాలలోనూ జరిగాయి. ఏథెన్స్‌లో 30 వేలమంది నిరసనకారులు పార్లమెంటు వరకు ప్రదర్శన చేసి ప్రభుత్వ విధానాల పట్ల తమ అసమ్మతిని వ్యక్తం చేస్తూ రోజురోజుకూ దిగజారుతున్న తమ జీవన పరిస్థితులను ఎలుగెత్తి చాటారు.

---

**సూక్ష్మరుణ...** (5వ పేజీ తరువాయి)

ప్రత్యక్షంగానో వడ్డీరేట్లు పెంచాలి. అప్పుడు విదేశీ పెట్టుబడి దారులు షేరు మార్కెట్లను బట్టి ఈ సంస్థలకు డబ్బును సమకూర్చుతారు. పేదల నుండి లాభాలను పిండుకుంటారు.

ఇక విషయం స్పష్టమే. పేదరికం గుత్త పెట్టుబడికి లాభసాటి ఆదాయవనరు అవుతుంది. స్వయం సహాయక బృందాలతో మొదలుపెట్టి సూక్ష్మరుణ సంస్థలుగా ఎదిగించారు. ఇప్పుడు గుత్త పెట్టుబడికి స్వర్గధామమైన షేరుమార్కెట్టు జూదగృహంలోకి వాటిని ప్రవేశపెట్టేందుకు రంగాన్ని సిద్ధం చేస్తున్నారు. నియంత్రణ, క్రమబద్ధీకరణ తదితర మాటల సారాంశమిదే. సామ్రాజ్యవాద వ్యవస్థలో నానాటికీ వృద్ధి చెందుతున్న ద్రవ్య పెట్టుబడికి గల లాభార్జనాదాహాన్ని తీర్చేందుకు సరికొత్త వ్యూహాలనూ, మార్గాలనూ రూపొందిస్తున్నది. అదే పేదరికాన్ని కూడా లాభాల వనరు చేయటం.

ఈ లాభాల వేట గుత్త పెట్టుబడిని సంక్షోభంలోకి నెడుతుంది. రిజర్వుబ్యాంకు గవర్నర్ వై.వి. రెడ్డి ఇది మరొక సబ్ ప్రైమ్ కాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించాడు. అడిగిన వారి కల్లా గృహరుణాలిచ్చి, అవి తీర్చలేక కుటుంబాలు ఇళ్ళు వదిలి రోడ్డు మీద పడితే ఆ యిళ్లు కొనేవారు లేక అమెరికా బ్యాంకులు తెల్లమొహం వేసినట్లు, సూక్ష్మరుణాలలో కూడా జరిగే ప్రమాదం గురించి ఆయన మాట్లాడుతున్నాడు. కుట్టుపని నేర్పకుండా కుట్టుమిషన్లకు రుణాలిచ్చి అంతా సజావుగా నడుస్తున్నదని సూక్ష్మరుణ సంస్థలు మునిగిపోయే ప్రమాదముందన్నదే ఆయన భయం. ఇప్పటికే సాగిన ఆత్మహత్యలు ఈ సంక్షోభానికి ఒక సూచన మాత్రమే. మాలేగావ్ నాచన అమలులో ఇది మరింత తీవ్రమౌతుంది. సూక్ష్మరుణ సంస్థల అధిపతులకొచ్చేలోటు లేకపోయినా, భారత ప్రజలు మరింతగా దారిద్ర్యంలో కూరుకుపోతారు.

---

## పెట్రోల్ ధరల పెంపుకు నిరసన

**మంగళగిరి, 25-1-11 :**

పెట్రోలు ధరల పెంపుదలకు నిరసనగా సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో పట్టణంలో ప్రదర్శన-మిద్దెసెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥ జగ్గారపు సుబ్బారావు మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసిన భారత పాలకులు చమురు ధరలపై నియంత్రణను ఎత్తివేయడంతో గత 6 నెలల కాలంలో 8 సార్లు చమురు ధరలు పెరిగాయన్నారు. సామ్రాజ్యవాద, బడాకంపెనీల ప్రయోజనాల కోసం, వారి లాభాలను గ్యారంటీ చెయ్యడం కోసం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్న పాలకుల విధానాలపై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలన్నారు. చమురు ధరల భారంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు మండిపోతున్నాయనీ, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆకలి చావులకు నెట్టబడతారని అన్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల ఆర్థిక సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలందరిపై రుద్ద చూస్తున్నారని, దాని ఫలితాన్ని నేడు మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఈ పరిస్థితులలో ప్రజలంతా కలసికట్టుగా నిలవాలని, వామపక్షాలు, ప్రజాసంఘాలు, ప్రగతిశీల శక్తులంతా ఆందోళనకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ప్రదర్శనలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు ఎం. అంజిరెడ్డి, డి.భాస్కర్, ఏపిఎఫ్‌టియు నాయకులు కె. ఆదినారాయణ, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం కన్వీనర్ కె. కోటేశ్వరరావు, సానా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాలో భారత విద్యార్థులకు బేడీలు :

# అమెరికా పాలకుల అహంకారం-భారతపాలకుల బేలతనం

**భారతదేశం** నుండి అమెరికా వెళ్ళి అక్కడి ట్రైవాలీ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులపై అక్రమ నేరారోపణలు చేసి ఆ దేశ పోలీసు అధికారులు విద్యార్థుల చీలమండలకు రేడియో కాలర్‌ట్యాగ్స్ (బేడీలు) వేశారనే వార్త ఇటీవల ప్రముఖంగా చర్చల్లో చోటు చేసుకుంది.

అమెరికాలో-శాన్‌ఫ్రాన్సిస్కో తీరంలోని ప్లీసన్‌టన్‌లో వున్న ట్రైవాలీ యూనివర్శిటీ విద్యార్థులు వీసా అనుమతులను దుర్వినియోగపరిచారనే నేరారోపణపై అమెరికా ఫెడరల్ ఇన్‌వెస్టిగేటింగ్ అధికారులు కేసులు నమోదు చేశారు. ట్రైవాలీ యూనివర్సిటీలో మొత్తం 1555 మంది విద్యార్థులుండగా వారిలో 95 శాతం భారతీయులే వున్నారు. ఈ ఆరోపణలతో యూనివర్సిటీని మూసివేయటంతో విద్యార్థులందరూ రోడ్డున పడ్డారు.

చైనా సంతతికి చెందిన సువాన్ క్సియావో పింగ్ ఛైర్‌పర్సన్‌గా 2009లో ట్రైవాలీ విశ్వవిద్యాలయం ప్రారంభించారు. కోర్సులకు హాజరుగాకపోయినా ఈ యూనివర్సిటీలో విద్యార్థులుగా నమోదై కోర్సు పూర్తి చేసుకునే అవకాశం వున్నదని ఈ యూనివర్సిటీ పెద్దఎత్తున ప్రచారం కూడా చేసుకున్నది.

యూనివర్సిటీకి హాజరవుతూ చదువుకునే షరతుపైనే స్టూడెంట్ వీసా (ఎఫ్-1)లను అమెరికా అధికారికంగా ఇస్తుంది. ఈ వీసాలను పొందినవారు తరగతులకు హాజరౌతూ అవసరమైతే మిగిలిన సమయంలో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసుకుంటారు. కానీ ట్రైవాలీ యూనివర్సిటీ విద్యార్థులు తరగతులకు హాజరుకాకుండానే దేశంలోని వివిధ ప్రాంతాల్లో పూర్తికాలపు ఉద్యోగాలు చేసే అవకాశాన్ని కల్పించటమే దీని ప్రత్యేకత! దీనితో పాటుగా ఆ యూనివర్సిటీ ఛైర్‌పర్సన్‌కే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలను ఇచ్చే అధికారమూ కల్పించారు. ఎఫ్-1 స్టూడెంట్ వీసాలకు విధిగా అవసరమయ్యే ఐ-20 అనుమతి పత్రాల్ని మంజూరు చేసే అర్హతలను కూడా ఈ యూనివర్సిటీ 'సంపాదించుకున్నది'! ఈ యూనివర్సిటీలో చేరితే క్లాసుల బాదరబందీ లేకపోవటం, చదువు అంతా ఆన్‌లైన్‌లో సాగించే అవకాశముందని భావించటంతో పాటుగా ఇతర విశ్వవిద్యాలయాల్లో ఒక్కో సెమిస్టర్‌కు 7 వేల నుండి 8వేల డాలర్ల ఫీజులు చెల్లించాల్సివుండగా ట్రైవ్యాలీ విశ్వవిద్యాలయంలో 2,500 డాలర్లకే ఒక సెమిస్టర్ పూర్తవుతుందని ప్రలోభపెట్టటంతో అనేకమంది ఈ విశ్వవిద్యాలయంలో చేరేందుకు మొగ్గుచూపారు.

అమెరికాలో హెచ్-1బి వీసాతో ఉద్యోగాలు చేస్తున్న వారి కాల పరిమితి ముగిసిన తర్వాత అమెరికా ప్రభుత్వం వాటిని పునరుద్ధరించటానికి నిరాకరిస్తున్నది. ఈ కారణంగా కూడా అనేకమంది ట్రైవాలీ విశ్వవిద్యాలయంలో ఎఫ్-1 స్టూడెంట్ వీసా పొంది ఉద్యోగాలు సాగించే పరిస్థితి ఏర్పడింది. ఇతర దేశాల నుండి వచ్చిన వారేగాక, పూర్తికాలం ఉద్యోగం చేసుకుంటూ చదువుకునే అవకాశం వుండడంతో ఆ దేశంలోని ఇతర యూనివర్సిటీ విద్యార్థులు కూడా కొందరు ఈ ట్రైవాలీకి బదిలీ అయ్యారు.

ప్రపంచంలో మారు మూల ప్రాంతాల్లో నిక్షేపాల్ని ఆట్టే పసికట్టగలిగే అమెరికా పాలకులకు 2009 నుండీ బహిరంగ ప్రకటనలతో, బాహాటంగా విద్యార్థులను చేర్చుకుంటున్న ఈ తతంగమంతా తెలీదంటే ఏమర్థం చేసుకోవాలి? ఏజంట్లు, బ్రోకర్లను నమ్ముకొని, అప్పోసొప్పో చేసి విద్యనభ్యసించటానికి వచ్చిన వారిపై నేరారోపణ చేసి అమెరికా పాలకులు చేతులు దులిపేసు కోవటం క్షంతవ్యంకాదు. ఈ మోసంతో తమకు ఎలాంటి సంబంధమూ లేదనీ, ఆ యూనివర్సిటీ చేతిలో తామే మోసపోయామని విద్యార్థులు మొరపెట్టు కుంటున్నా అమెరికా అధికారులు పట్టించుకోక పోవటం క్షమార్హంకాదు.

పైగా జంతువుల కదలికలను, ప్రవర్తనలు పసిగట్టేందుకు, మతిస్థిమితం లేని వారిని నియంత్రించేందుకు ఉపయోగించే ఎల్రక్టానిక్ ట్రాకింగ్ పరికరాలను విద్యార్థుల మడమలకు అమర్చటం అత్యంత గర్హనీయం. ఇది అమెరికా అగ్రరాజ్య దురహంకార నిదర్శనం కూడా! భారతవిద్యార్థుల పట్ల అమెరికా వైఖరిని నిరసించిన సందర్భంలో హైదరాబాద్‌లో వున్న అమెరికా దౌత్యవేత్త ఇలియట్ పుర్ 'జైల్లో మగ్గడం కంటే ఇలాంటి యాంక్లెట్స్‌ను ధరించటం ఫ్యాషన్‌గా భావించాల'నటం కంటే వారి కండకావరానికింకేం రుజువుకావాలి!?

భారతదేశంలో ఈ సంఘటనపట్ల పెల్లుబికిన వ్యతిరేకతతో కేంద్రప్రభుత్వం, విద్యార్థులకు అమానుషంగా కట్టిన రేడియో ట్రాకర్లను తొలగించాలని అమెరికా ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తులు చేసినా వీరి మాటలనేమీ అమెరికా లక్ష్యపెట్టనేలేదు. ఔను మరి! వేలాదిమంది ప్రత్యక్ష మరణానికి, లక్షలాదిమంది రోగగ్రస్తులవటానికి కారణమైన యూనియన్ కార్బైడ్ అధినేత అండర్సన్‌ను అతిథి మర్యాదలతో ప్రత్యేక విమానంలో సాగనంపిన వారికింతకంటే విలువే ముంటుంది?

విద్యా, వుపాధికోసం విదేశాలకు వెళ్ళే భారతీయులు అనేక మోసాలకు గురవుతూనేవున్నారు. దాడులు, వేధింపులు, వివక్షతలు సాగుతూనే వున్నాయి. ఈ సంవత్సరం అమెరికాకు వెళ్ళిన భారతీయ విద్యార్థుల సంఖ్య ఒక లక్షా పదివేలు. కాగా ప్రతి సంవత్సరమూ ఇది 13 శాతం పెరుగుతున్నది ఆస్ట్రేలియాలో చదువుతున్న భారత విద్యార్థులు 2008 నాటికే దాదాపు లక్షమందిదాకా వున్నారు. ఇంగ్లండ్, ఆస్ట్రియా, జర్మనీ, చైనా, గల్ఫ్, తదితర దేశాలకు ఏటా 5 లక్షలమందికి పైగా భారత విద్యార్థులు చదువులు, ఉద్యోగాలకోసం వెళుతున్నారు. ఇతర దేశాలు వెళ్తున్న విద్యార్థులందరూ వేల, లక్షల డాలర్లు చెల్లించి ఆయా దేశాలకు ఆదాయాన్ని సమకూర్చటమేకాక అక్కడి వ్యాపార సంస్థల్లో కారుచౌకగా పార్ట్‌టైమ్ ఉద్యోగులుగా కూడా సేవలను అందిస్తూవున్నారు.

ఇక, మన దేశంలో ఉన్నత విద్యలో సంస్కరణల పేరిట విదేశీ విశ్వవిద్యాలయాలు బ్రాంచీలు స్థాపించు కునేందుకు ప్రభుత్వం అనుమతించటంతో అవి తామర తంపరగా వెలిశాయి. దీనివల్ల అంతర్జాతీయ ప్రమాణాలుగల విద్య భారతదేశంలోనే అందుబాటులోకి తీసుకువస్తామని భారత ప్రభుత్వం తన భుజాలు తానే చరచుకుంది. వాస్తవంలో విదేశాల్లో ప్రఖ్యాతి చెందిన విశ్వవిద్యాలయాలేవీ ఇంతవరకూ రాలేదు, రావు కూడా. వచ్చినా తమ దేశంలో పాటిస్తున్న ప్రమాణాలను అవి యిక్కడ పాటించవు. ఇప్పటికి వచ్చినవన్నీ దాదాపు రెండవశ్రేణికి చెందినవే. వీటి ప్రమాణాలు భారతీయ యూనివర్సిటీల కంటే తక్కువే.

అమెరికా, బ్రిటన్ తదితర సామ్రాజ్యవాద దేశాలలో ఆర్థిక మాంద్యత కారణంగా ప్రభుత్వాలు వున్నత విద్యకు నిధులను తగ్గించాయి. దీనితో చాలా విశ్వవిద్యాలయాలు దివాళాతీసే స్థితిలో పడ్డాయి. అవి ఫీజులను పెంచి వేశాయి. అమెరికాలోని 30 రాష్ట్రాలలో 100 విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులూ, విద్యార్థులూ ఫీజుల పెంపుపై నిరసిస్తూ 2010 మే 4న ప్రదర్శనలు చేశారు. కాలిఫోర్నియాలో జాతీయ రహదారిని బందు చేశారు. బ్రిటన్‌లో పరిస్థితి ఇంకా ఘోరంగా వుంది. ఉన్నత విద్యాలయాల విద్యార్థులందరూ 2010 సెప్టెంబరులో ఫీజుల పెంపకాన్ని నిరసిస్తూ సమ్మెలు చేశారు.

ఆర్థిక యిబ్బందుల్లో పడ్డ విదేశీ యూనివర్సిటీలు వెనుకబడిన దేశాల విద్యార్థులను చేర్చుకొనటాన్ని ఆదాయ వనరుగా చేసుకున్నాయి. అవి ఈదేశాలలో తమ ఏజంట్లను నియమించుకుని, వారిద్వారా విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. 2009లో విదేశాలలో విద్యకోసం వెళ్ళిన 5 లక్షల భారతీయ విద్యార్థులు 400 కోట్ల డాలర్లను వెచ్చించారు.

వెనుకబడిన దేశాలలో తమ విద్యాలయపు శాఖలను తెరవటం లేదా అక్కడి విద్యాలయాలతో మిలాఖత్తు ఒప్పందాలతో సేవలందించటం అన్న రూపాలలో కూడా విదేశీ విశ్వవిద్యాలయాలు ఆదాయాన్ని పెంచు కుంటున్నాయి. వీటితో పాటే వీటిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షలకు శిక్షణనిచ్చే సంస్థలు కూడా విదేశాలనుండి ఇక్కడి కొచ్చి తమ షాపులు తెరిచాయి.

మంచి ఉపాధితో వెలుగైన జీవితం పొందవచ్చునన్న భారత విద్యార్థుల ఆశలను ఇవి సొమ్ము చేసుకుంటున్నాయి. ఉన్నత విద్యను వాణిజ్య సరుకును చేశాయి. ఎక్కువ లాభం సంపాదించటమన్నదే వాటికి గీటురాయి అయింది. ఈ క్రమంలో విద్యారంగం నెరవేర్చవలసిన సామాజిక బాధ్యతలూ, విలువలూ మట్టిగొట్టుకుపోతున్నాయి. దేశపు, ప్రజల ప్రయోజనాలు తీర్చటం వీటి లక్ష్యం కాకుండా పోయింది. ఫలితంగా దేశంలో-వున్నవారికీ, లేనివారికీ మధ్య వ్యత్యాసం మరింత పెరిగిపోయింది.

విద్యను వాణిజ్య సరుకుగా మార్చిన తమ విధానాన్ని కప్పిపుచ్చుకుంటూ, ట్రైవాలీ లాంటి యూనివర్సిటీవంటి కొన్నింటిపై దాడిచేయటంద్వారా అమెరికా తన జాతివివక్ష విధానాన్ని బయటపెట్టుకొంది. అక్కడి దోపిడీ వ్యవస్థకు వలసవస్తున్న వారు ప్రమాదకరంగా మారకుండా వుండేందుకు వలసవస్తున్న వారిలో వివిధ జాతులను విడదీస్తున్నది. చైనీయుల సంఖ్య పెరిగితే, వారికి పోటీగా భారతీయుల సంఖ్య పెంచుకుంది. వీరు పెరిగితే లాటినోల సంఖ్య పెంచుతుంది. ఒకరు ఎక్కువ సంఖ్యలో వుండి సంఘటిత పడి రాజకీయ వత్తిడి తేకుండా, వలసవస్తున్న వివిధ దేశాలవారి మధ్య కృత్రిమ పోటీ సృష్టించి ఐక్యంకాకుండా చేస్తుంది. కొంత కాలంపాటు భారత్‌నుండి వచ్చేవారి సంఖ్య తగ్గించేందుకు ఇలా దాడులుచేసి భయపెట్టడం అది అనుసరించే పద్ధతుల్లో ఒకటి. అందుకనే ఇన్నాళ్లూ తన కళ్లముందే ట్రైవాలీ అక్రమాలు సాగుతున్నా మిన్నకుంది. ఇప్పుడు ఎంపిక చేసుకుని దాడిచేసింది.

☆

# 'పోరాటమే దళితుల జీవితాల్ని రక్షిస్తుంది'

**జైపూర్‌లోని** దళితుల హక్కుల వేదిక సహకారంతో దళితుల ప్రస్తుత స్థితిగతులపై ఒక అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ నివేదికపై 2010 డిసెంబరు 2వ తేదీన జైపూర్‌లోని నెహ్రూ సహకార భవన్‌లో ఒక ప్రాంతీయస్థాయి సెమినార్‌ను నిర్వహించారు. రాజస్థాన్‌లో షెడ్యూల్ తెగల హక్కుల పరిరక్షణ అంశంలో రాజ్యాంగపరమైన నిష్క్రియ కారణంగా, ఎలాంటి ప్రయత్నమూ చేయబడటం లేదని ఈ అధ్యయన రిపోర్టు తెలుపుతోంది.

2009-10 సుప్రీంకోర్టు వార్షిక రిపోర్టులో సామాజిక న్యాయం, సామాజిక హక్కుల పరిరక్షణ అంశాల ప్రస్తావనలో దళితులపై జరుగుతున్న పాశవిక అత్యాచారాలకు సంబంధించిన అంశాలు ప్రచురింప బడ్డాయి. 2008వ సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ యాక్టు క్రింద 4302 కేసులు నమోదు చేయబడినాయి. రాజస్థాన్‌లో ఒక లక్షమంది ప్రజలను పరిగణించి నట్లయితే, వారిలో ప్రతివందమందిలో 45 మందిపై అత్యాచారాలు జరుగుతున్నాయి. భారత దేశం మొత్తంలోనే అత్యంత గరిష్టస్థాయిలో ఈ అవమానకర పరిస్థితి ఇక్కడ నెలకొని ఉంది.

నిర్వహింపబడిన సెమినార్‌లో ప్రాంతీయంగా జరిగిన 31 సంఘటనలపై చర్చ జరిగింది. దళితుల హక్కుల పరిరక్షణ బాధ్యత అప్పచెప్పబడిన రాజ్యాంగ యంత్రం కానీ న్యాయ విభాగం కానీ ఆ దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. అవి పూర్తిగా క్రియా రహితంగా మిగిలాయి. నివేదిక ప్రకారం, ఏ ఉద్దేశ్యంతో నైతే దళితుల హక్కుల రక్షణ, వారి అభివృద్ధి ఈ రాజ్యాంగ యంత్రానికి అప్పచెప్పబడిందో, దానిని నిర్వర్తించడంలో అవి పూర్తిగా విఫలమయ్యాయి-వాటి ప్రయత్నం పరిమిత హద్దుల్లోనే కొనసాగింది.ఫలితంగా అవినిష్ప్రయోజనంగా మిగిలాయి. క్రింది స్థాయిలో అయితే ఈ పరిస్థితి ఇంకా దయనీయంగా ఉంది. పరిస్థితి మెరుగు పరచడానికి ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

దళితులు ఈ నాటికీ భయంకరమైన పేదరికానికీ, అసమానతలకూ గురవుతూనే ఉన్నారని ఈ రిపోర్టు చెబుతోంది. రాజస్థాన్ స్టేట్ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ విజయ్ శంకర్ వ్యాస్ సెమినార్ ప్రారంభోపన్యాసం చేస్తూ తన ప్రసంగంలో "ఈ అధ్యయనంలో ప్రస్తావించిన ఘటనలు అత్యంత విచారకరమైనవి. దళితులపై అత్యాచారాలు నేటికీ కొనసాగటం అత్యంత దౌర్భాగ్యకరమైన విషయం. దీనిని ఆపాల్సిన బాధ్యత చట్టంపైన, ప్రభుత్వంపైనా ఉన్నా కూడా అవి విఫలమవుతున్నాయి." అన్నారు.

దళిత హక్కుల వేదిక నాయకులు శ్రీ పి.ఎల్. మిమరోట్ మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న అత్యాచారాలకు రాష్ట్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని ఆరోపించారు. ప్రాంతీయ స్థాయిలో మానవ హక్కుల కమీషన్, మహిళా హక్కుల కమీషన్, యస్.సి.,యస్.టి. కమీషన్ పూర్తిగా నిష్క్రియాపరంగా మారాయని, అవి పెత్తందారీ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళాయని ఆయన ఆరోపించారు. షెడ్యూల్డు కులాల, తెగల రిజర్వేషన్ కమిషన్ ఇప్పటివరకూ తమ వార్షిక నివేదికలను వెలువరించకపోవడం ఆశ్చర్యకరం.

రిజర్వేషన్ల మత్తులోపడి, తమ దయనీయ స్థితిని మరచిపోవద్దని మేం దళిత సోదరులకు వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాం. "మీరంతా కలిసి ఏకమై పోరాడితే మీపై జరుగుతోన్న అత్యాచారాల నుండి విముక్తిని పొందుతారు. అందుకే మీరంతా పోరాటానికి సిద్ధం కండి. మీశక్తి సామర్థ్యాలతో భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయండి. సామ్యవాద వ్యవస్థ నిర్మించండి" అన్న భగత్‌సింగ్ పిలుపును గుర్తు చేశారు.

నిర్వహింపబడిన సెమినార్‌లో దళితులపై అణచివేత, అలా జరిగిన సందర్భాలలో ప్రభుత్వ రక్షణ వ్యవస్థల ద్వారా వారిని రక్షించాల్సిన సమయంలో ఉదాసీన వైఖరి నవలంబించిన ఎన్నో ఉదాహరణలు ప్రస్తావించబడ్డాయి. మేం పాఠకుల కోసం ఇక్కడ 2 ఉదాహరణలు ఇస్తున్నాం.

భరత్‌పూర్ జిల్లాలోని నంగలాయా గ్రామానికి చెందిన ఒక దళిత మహిళ గిరిజాదేవి 28.11.2009న అగ్రకులాలవారికి దళితులకు మధ్య జరిగిన ఒక సంఘర్షణలో మరణించింది. ఆమె ఈ ఘర్షణలో ఇరుక్కున్న తన కుమార్తెను రక్షించుకోవడానికి వెళ్ళిన సందర్భంలో ఆమెను కొట్టి చంపారు. ఆమె భర్త ఈ విషయాన్ని స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంతేకాక రాష్ట్ర మానవ హక్కుల కమీషన్‌కు కూడా రిపోర్టు చేశారు. 2010 మేలో 36వ అధికరణ ప్రకారం, మానవ హక్కుల కమీషన్ ఈ కేసును ముగించింది. పీడితులకు ఎటువంటి న్యాయమూ జరగలేదు; దోషులకు ఎటువంటి శిక్షా పడలేదు.

అజ్మీర్‌లో ఒక దళిత మహిళ, శ్రీమతి సంతోష్ తన ఇంటికి దగ్గరలోని పబ్లిక్ హేండ్ పంప్ నుండి నీళ్లు తెచ్చుకొంటున్న సమయంలో అగ్రకులాలకు చెందిన ఒక వ్యక్తి ఆమెను నిర్దాక్షిణ్యంగా చావబాదాడు. ఈ ఘటన జరిగిన ఒక నెల తర్వాత ఆమె ఫిర్యాదును ఫైల్ చేశారు. మానవ హక్కుల కమీషన్ 36వ అధికరణ ప్రకారం, ఫిర్యాదును ఫైల్ చేయడాన్ని నిరాకరిస్తూ దానిని ఆపివేసింది.

**('భగత్ సింగ్ కే సపనే' 15-12-10 సంచిక నుండి)**

★

# ఎంసెట్‌కు ఇంటర్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరనే నిబంధనను రద్దు చేయాలి!

**మంగళగిరి,11-2-11 :** ఎంసెట్‌కు ఇంటర్‌లో 50% మార్కులు తప్పనిసరిగా ఉండాలనే ఏపిసెటి నిబంధనలు పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను దూరంచేసే విధంగా ఉన్నాయని, దీన్ని నిరసిస్తూ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక విటిజెఎం & ఐవిటిఆర్ డిగ్రీ కళాశాల నుండి ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె బాజి సైదా మాట్లాడుతూ ఏపిసెటి విధించిన ఈ నిబంధనలు ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులు సాంకేతిక విద్యకు వెళ్లకుండా నిరోధిస్తున్నాయని, ప్రభుత్వ కళాశాలల్లో సరైన సిబ్బందిని నియమించక, అధ్యాపక పోస్టులు భర్తీ చేయక, ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవడానికి చూస్తున్నదనీ. ఈ కొత్త నిబంధనల వలన ప్రయివేటు, కార్పోరేటు విద్యా సంస్థలకు ప్రయోజనం చేకూరుతుందే తప్ప ప్రభుత్వ కళాశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఒరిగేది ఏమీలేదనీ. కావున ఈ నిబంధనలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రీను, మహేష్, హేమసుందర్, వదన్ తదితరులు పాల్గొన్నారు.

★

# శ్రమ సంస్కృతిని ప్రతిబింబించే ఆటల, పాటల-పోటీలు



గుంటూరులో NYS, PDSO సభలో ప్రసంగిస్తున్న కా॥లక్ష్మారెడ్డి; విజయవాడ సభలో ప్రసంగిస్తున్న శ్రీ వామనరావు

**విజయవాడ, జనవరి 11,12 తేదీలు :**

స్థానిక న్యూగిరిపురంలోని తరిమెల నాగిరెడ్డి భవనం వద్ద నవయువ సమాఖ్య, స్త్రీవిముక్తి సంఘటనల ఆధ్వర్యంలో ఆటల, పాటల సంబరాలు జరిగాయి. మరుగున పడుతున్న ప్రజాసంస్కృతిని గురించి చైతన్యపరిచే కృషిలో భాగంగా ఈ ఆటల, పాటల సంబరాలను నిర్వహించారు. 11వ తారీఖున లెమన్ & స్పూన్, స్లో సైక్లింగ్ పోటీలు జరిగాయి. దీనిలో 40 మంది పాల్గొన్నారు. సాయంత్రం 4 గంటలకు 30 మంది మధ్య ముగ్గుల పోటీ జరిగింది. కా॥ నిర్మల, సుజాత టీచర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. 12వ తారీఖున సాయంత్రం 4 గం॥లకి స్త్రీ, పురుషులకు విడివిడిగా నిర్వహించిన మ్యూజికల్ ఛైర్స్ పోటీలలో దాదాపు వందమంది పాల్గొన్నారు. ఆ తర్వాత 30 మంది మధ్య పాటల పోటీ జరిగింది. శ్రీదేవి, రాధిక, అరుణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది.

ఈ సభకు ఆటల, పాటల నిర్వహణ కమిటీ కన్వీనర్ కా॥ దుర్గారావు అధ్యక్షత వహించారు. విశ్రాంత జిల్లా జడ్జి సత్యన్నారాయణ రెడ్డిగారు, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం నాయకులు వేములపల్లి వామనరావుగారు, జనసాహితి ప్రధాన కార్యదర్శి దివికుమార్‌గారు , ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబుగారు, టీచర్ సుజాత విజేతలకు బహుమతులు అందజేశారు. స్త్రీవిముక్తిసంఘటన రాష్ట్ర కార్యదర్శి కా॥ టి. శ్రీదేవి, ఎన్‌వైఎస్ నాయకులు కా॥ బాషావలి, ఒపిడిఆర్ జిల్లా నాయకులు కా॥ ఏసు ఉపన్యసించారు.

ముందుగా కా॥ ఏసు మాట్లాడుతూ ప్రస్తుత ఈ తరుణంలో ఇటువంటి ఆటల, పాటలలో ప్రజలంతా కలసి పంచుకుని ఆనందించే సంబరాలు జరగటం, ఇక్కడ మొదటిసారిగా జరుపుకోవటం ఆనందంగా వుందనీ, ఇలాగే ప్రతిసంవత్సరం జరుపుకోవాలని అన్నారు. కా॥ దివికుమార్‌గారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రేక్షక సంస్కృతి ప్రబలిపోయి ఉందనీ–ఇది కాలక్షేపాన్ని కలిగిస్తుందేగానీ–మానసిక ఆనందాన్ని ఇవ్వలేదనీ–ఈ ఆటలు, పాటలే–శ్రమనుండి పుట్టినవే ఆనందాన్ని ఇస్తాయని అన్నారు. ఇలా మీరు సంబరాలు జరుపుకోవటం ఆనందంగా ఉందన్నారు. కా॥ శ్రీదేవి మాట్లాడుతూ టి.వీల్లో యాడ్స్, సీరియల్స్‌లోని డొల్లతనాన్ని ఎత్తిచూపుతూ ప్రజాసంస్కృతి, ప్రజా కళలు వర్ధిల్లాలని నినదించారు. విజయవాడ పట్టణంలోని ముఖ్యంగా గిరిపురం ప్రజల సహాయ సహకారాలతో ఈ రెండు రోజులూ ఒక పండుగలా జరిగాయి. కొప్పుల నర్సింహారెడ్డిగారి జ్ఞాపకార్థం వారి మనవడు రాహుల్ బహుమతులను ప్రాయోజితం చేశారు. ఇంకా ఆటలు, పాటల పోటీ నిర్వహణకమిటి సభ్యులు కామ్రేడ్ లక్ష్మణ, సాజిద్, తదితరులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో కృషి చేశారు.

## ప్రజల ఆట పాటలను, ప్రజాసంస్కృతిని కాపాడుకుందాం!

**గుంటూరు, జనవరి 14,15 తేదీలు:**

సంక్రాంతి సందర్భంగా **NYS - PDSO** యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 14వ తేది కబడ్డీ, వాలీబాల్ పోటీలను కె.ఎస్.ఆర్.టి. మున్సిపల్ హైస్కూల్, కొండావెంకటప్పయ్య కాలనీల్లో నిర్వహించారు. 15వ తేది స్లోసైక్లింగ్, లెమన్ అండ్ స్పూన్, స్కిప్పింగ్, ముగ్గులు, మ్యూజికల్ ఛైర్స్, పాటల పోటీలు నిర్వహించి అనంతరం సాయంత్రం 5 గం॥లకు కె.వి.పి.కాలనీలో సభ నిర్వహించారు. ఈ సభలో పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

ఈ సభకు ముఖ్యవక్తగా విచ్చేసిన రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ కర్షకుల, శ్రమజీవుల పండుగనీ, కుల, మతాలకు అతీతంగా ఈ పండుగను జరుపుకుంటారనీ, వ్యాపార క్రీడలను వ్యతిరేకిస్తూ, గ్రామీణ క్రీడలను, సమిష్టితత్వాన్ని పెంపొందించే క్రీడలను ప్రోత్సహిస్తూ విద్యార్థి, యువకులు ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం చేపట్టి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను అభినందించారు.

ప్రజాకళాకారుల సమాఖ్య నాయకులు కాట్రగడ్డ హనుమంతరావు మాట్లాడుతూ భూస్వామ్య, సామ్రాజ్యవాద విషసంస్కృతి మన ప్రజాకళలను, సంస్కృతిని, జానపద నృత్యాలను, సాహిత్యాన్ని కలుషితం చేస్తున్నాయనీ, మనుషుల మధ్య ఉండవలసిన మానవ సంబంధాలను టీవీ మాధ్యమం పనిగట్టుకుని విచ్ఛిన్నం చేస్తున్నదనీ, ప్రపంచీకరణతో గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజనలు, కోలాటం, డప్పులు, హరికథలు, బుర్రకథలు ఈ రోజున కనుమరుగై పోతున్నాయనీ, మనది కానటువంటి సంస్కృతిని మన మెదళ్ళకు పనిగట్టుకుని ఎక్కిస్తున్నారనీ కావున ప్రజాసంస్కృతిని, శ్రమసంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిమీద ఉందన్నారు.

నవయువ సమాఖ్య(ఎన్‌వైఎస్) జిల్లా కార్యదర్శి కా॥కె.దేవా మాట్లాడుతూ యువత పూనుకుంటే దేశ స్వరూప స్వభావాలే మారిపోతాయనీ, అందుకే దోపిడీ పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు యువతలో పెరుగుతున్న ఆగ్రహాన్నీ, ఆవేశాన్నీ, అసంతృప్తిని వివిధ రూపాల్లో ప్రక్కదారి పట్టిస్తున్నారనీ, సినిమా, మీడియా, టీవీల ద్వారా "ప్రేమే" సర్వస్వమని, ప్రేమలేనిదే జీవితం లేదని, ప్రేమను కాదంటే ఏమైనా చెయ్యాలి అన్న తప్పుడు సాంస్కృతిక విలువను యువత మెదళ్ళలోకి చొప్పిస్తూ ప్రేమోన్మాదులుగా తయారుచేస్తున్నారనీ, ఇటువంటి దోపిడీ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజాసంస్కృతికోసం యువతరం ముందుభాగాన నిలబడి ఉద్యమించాలని విజ్ఞప్తిచేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర సహాయ కార్యదర్శి కా॥ ఎం.సురేష్ వక్తలను వేదికమీదకు ఆహ్వానించగా, ఎన్‌వైఎస్ నగర అధ్యక్షులు కా॥ పి.మల్లి సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర నాయకులు ఎ.బలరాంరెడ్డి, నాగేశ్వరరావు, పిడిఎస్‌ఒ జిల్లా నాయకులు సిహెచ్.సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలను ప్రారంభించిన డా॥చదలవాడ రవీంద్రనాథ్‌గారికి, విజేత పబ్లిక్‌స్కూల్ కరస్పాండెంట్ గారికి, ఆటల పోటీలను నిర్వహించిన పి.ఇడి.మాస్టర్ సురేష్‌గారికి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించినవారికి, పిడిఎస్ఒ, ఎన్‌వైఎస్ కమిటీలవైపునుండి కృతజ్ఞతలు తెలియజేశారు.

**పిడుగురాళ్ళ, 14-1-11 :**

**సంక్రాంతి** సందర్భంగా స్థానిక లెనిన్ నగర్ స్థూపంవద్ద ఎన్‌వైఎస్–పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడల పోటీలు జరిగాయి. కబడ్డీ జూనియర్స్, సీనియర్స్, స్లోసైక్లింగ్, పరుగుల పోటీ, మహిళలకు ముగ్గులపోటీలను డ్రిల్ మాస్టర్లు గేరా ప్రభాకరరావు, సుశాంతరావుగార్లు నిర్వహించారు. ఆటల అనంతరం జరిగిన సభకు అధ్యక్షులుగా ఎన్‌వైఎస్ లెనిన్ నగర్ కమిటి అధ్యక్షులు ఎస్‌కె. జానీ, ఉపాధ్యక్షులు జి. రాజు వ్యవహరించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ మాజీ రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. అజిత మాట్లాడుతూ కష్టజీవుల పండుగ అయిన సంక్రాంతి సందర్భంగా శ్రమజీవులందరూ సమిష్టిగా జరుపుకునే పరిస్థితికి తిరిగిరావాలనీ, ఎవరికి వారే అన్నట్టుగా ప్రజల ఆలోచనలను మార్చివేస్తున్న దోపిడీ సంస్కృతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు.

రైతుకూలీసంఘం (అం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి పి. కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు, కళలు కనుమరుగవుతున్న నేటి పరిస్థితులలో అందరూ సంతోషంగా, సమిష్టిగా ఆడుకునే →

→ ఆటలను నేడు వ్యాపార క్రీడలుగా, జూదంగా మార్చివేసి విద్యార్థి, యువకుల ఆలోచనలను మార్చివేస్తూ ప్రజాహిత కార్యక్రమాలకు దూరంగా ప్రజలను దూరం చేస్తున్నారని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నాయకులు వెంకయ్య, శ్యామ్, ఎం. రవి, సలీమ్ పిడిఎస్‌ఒ నాయకుడు, కె. శ్రీను, రాజేష్ చిట్టి తదితరులు పాల్గొన్నారు. ఆటల పోటీలలో పాల్గొని గెలుపొందిన వారికి ఈసందర్భంగా బహుమతులను అందజేశారు.

**కారంపూడి, 15-1-11 :**

**సంక్రాంతి** పండుగ సందర్భంగా స్థానిక పోతురాజు గుట్టకాలనీలో గ్రామీణ క్రీడలయిన కబడ్డీ, జూనియర్స్; సీనియర్స్, పరుగులపోటీ, స్కిప్పింగ్, మహిళలకు ముగ్గులపోటీలు, జానపద, అభ్యుదయ పాటల పోటీలు ఎన్‌వైఎస్–పిడిఎస్‌ఒల ఆధ్వర్యంలో జరిగాయి ఉదయం నుండి విద్యార్థి, యువకులు, కాలనీ ప్రజలందరూ సంతోషంగా, ఉత్సాహంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం సాయంత్రం జరిగిన సభకు అధ్యక్షత వహించిన పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి కా॥ కె. శ్రీను మాట్లాడుతూ నేడు గ్రామీణ క్రీడలు, జానపద కళలు కనుమరుగవుతున్న పరిస్థితులలో విద్యార్థులు, యువకులు ప్రజలందరూ ఈ విధంగా పాల్గొనటం చాలా సంతోష కరమయిన విషయమని, నేడు ఆటలను సరదాగా ఆడుకునే వాటిని వ్యసనంగానూ, వ్యాపారంగానూ మార్చివేసి వీటి అర్థాన్నే మార్చివేసిన ప్రభుత్వాలు, ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టిస్తున్నాయని ఇలాంటి దోపిడీ సంస్కృతికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. రైతుకూలీసంఘం జిల్లా సహాయకార్యదర్శి కా॥ పి.కోటేశ్వరరావు; పద్మ, మరియదాసు తదితరులు ప్రసంగించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

### పిడిఎస్‌ఓ–ఎన్‌వైఎస్ ఆటల పోటీలు

**మంగళగిరి, 16-1-11 :**

సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక శ్రామిక నగర్‌లోని కా॥ పాతర్ల నాగయ్య సెంటర్ వద్ద పిడిఎస్‌ఓ–ఎన్‌వైఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఆటల–పాటల పోటీలు నిర్వహించారు. శ్రామిక నగర్, సుందరయ్య నగర్, సూర్యనారాయణనగర్, లక్ష్మి నరసింహస్వామి కాలనీ తదితర కాలనీల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆటల పోటీలు, ఉత్సాహంగా జరిగాయి. మొత్తం శ్రామిక ప్రజలంతా ఎంతో సంతోషంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆటల్లో పాల్గొన్న వారిని ప్రోత్సహించారు. అనంతరం జరిగిన




మంగళగిరి–బహుమతి ప్రదానసభలో పాల్గొన్న ప్రజలు

సభకు కా॥ ఎస్‌కె. సైదా, కా॥ రవి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఎన్‌వైఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ దేవా ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతియేటా సంతోషాలను తీసుకొచ్చే సంక్రాంతి ఈ ఏడాది అధిక వర్షాలు, ముంపు సమస్యలతో కష్టాలను, కడగళ్ళను తీసుకొచ్చిందనీ, ఇన్ని కష్టాలమధ్య కూడా ఈ సంక్రాంతిని అందరం కలిసి సమిష్టిగా నిర్వహించుకున్న తీరుగానే పాలకుల దుర్మార్గపూరిత విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధంకావాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మలా విద్యాసంస్థల డైరెక్టర్ వి.వి. ప్రసాద్‌గారు మాట్లాడుతూ కష్టాలను, కడగళ్ళను విషాదాన్ని మరిపించేలా శ్రమజీవుల సంతోషాన్ని ప్రకటించేలా సాగిన పోటీలు ప్రజలందరికీ కొత్త చైతన్యం ఇచ్చాయనీ, అదే శ్రమజీవుల సంస్కృతి అనీ, దీనికి భిన్నమైన పాలకవర్గ, సినిమా, టి.వి. విషసంస్కృతికి వ్యతిరేకంగా మనమంతా ఇలా ఒక్కటై మనది శ్రమజీవన సంస్కృతి అని ప్రకటించాలనీ, మన జీవన పరిస్థితులపై పాటలు, కళారూపాలు తయారు చేసుకుని ముందుకు తీసుకుపోవాలని విజ్ఞప్తి చేసారు.

కార్యక్రమంలో అడ్వకేట్ శ్రీ ఎన్. వరలక్ష్మి, అరవిందా స్కూలు అధ్యాపకులు ధనలక్ష్మి, వడ్లపూడి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నాయకులు కా॥ దుర్గాప్రసాద్, కా॥ బాజీ, పిడిఎస్‌ఓ నాయకులు కా॥ శ్రీను, కా॥ సింధు తదితరులు పాల్గొన్నారు. ★

# దళిత మహిళపై వేధింపులకు నిరసన

**మచిలీపట్నం, 27-1-11 :**

బంటుమిల్లి మండలం శివగణేశ్ కాలనీకి చెందిన దళిత మహిళ పడిగే మంగను అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన ఎస్.ఎస్.ఆర్ ఆంజనేయులు, తనతో గడిపితేనే ఆమెకు ఇళ్ళస్థలం పట్టా ఇప్పిస్తానని, ఆమె ఒప్పుకోక పోవటంతో రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై ఆమె పూరిపాకను కూల్చివేశాడు. ఈ విషయంపై బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసినా డి.ఎస్.పి. గార్ని కలిసి చెప్పినా ఎస్.ఎస్.ఆర్. ఆంజనేయులును అరెస్టుచేయక పోవటంపై స్త్రీవిముక్తిసంఘటన(ఆం.ప్ర.), దళిత సంఘాల ఆధ్వర్యంలో కలక్టరు ఆఫీస్ ఎదుట నిరసన తెల్పుతూ ధర్నా చేపట్టారు.

ఈ ధర్నాను ఉద్దేశించి స్త్రీవిముక్తిసంఘటన (ఆం.ప్ర.) బందరు ఏరియా కార్యదర్శి తిరుమలశెట్టి నాగలక్ష్మి మాట్లాడుతూ 'శివగణేష్ కాలనీలో 22 ఇళ్ళపట్టాలకు అర్హత పొందాయి. వాటిలో 16 మందికి పట్టాలు ఇచ్చారు. ఆరుగురుకి పట్టాలు ఇవ్వలేదు. అందులో భాగంగా పట్టా అడిగిన పడిగ మంగతో అసభ్యంగా వ్యవహరించటమే గాక ఏంచేసుకుంటావో చేసుకో ఎరికలదానివి నీకు ఎవరు సపోర్టు చేస్తారుఅని బెదిరించి, తను 7 సం॥ల నుంచి నివశిస్తున్న పూరిపాకను పీకివేసి బూతులు తిట్టాడు. ఈ విషయం పోలీసు స్టేషన్‌లో కేసుపెట్టినా న్యాయం చేయలేదు. కాబట్టి వెంటనే ఆమెకు పట్టా ఇప్పించి, ఎస్‌ఎస్‌ఆర్ ఆంజనేయులుపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసుపెట్టి, అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

దళిత సంఘం నాయకులు భూపతి అంబేద్కర్ మాట్లాడుతూ, దళిత మహిళను కులం పేరుతో దూషించి, నీకు దిక్కుఎవరు వస్తారని బెదిరించిన ఎస్‌ఎస్‌ఆర్ ఆంజనేయులను ఎస్సీ. ఎస్టీ కేసుపెట్టి అరెస్టు చేసి బాధితురాలైన మంగకు ఇళ్ళపట్టా ఇప్పించాలని లేని పక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



బందరులో ధర్నా

ప్రముఖ లాయర్ వడ్డే జితేంద్రగారు మాట్లాడుతూ 'నిరుపేదరాలైన దళిత మహిళను లైంగికంగా వేధించిన అగ్రకుల దురహంకారంతో ఆమె ఇంటిని పీకి నిలువ నీడలేకుండా చేసి పైగా ఆమె మంచిదికాదని, ఎస్పి గార్కి, కలెక్టరు గారికి పిటీషన్లు పెడుతూ తిరుగుతున్నారు. ధనబలంతో, రాజకీయ అండతో పెత్తనం చలా యిస్తున్నారు. ఆంజనేయులుపై 3/11కేసు నమోదు అయినా నేటికీ అరెస్టు చేయకపోవటం పోలీసుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నది. వెంటనే బంటుమిల్లి ఎస్సైను సస్పెండ్ చేయాలని, ఎస్‌ఎస్‌ఆర్ ఆంజనేయులును తక్షణమే ఎస్సీ, ఎస్టీ కేసుపెట్టి అరెస్టు చేయాలనీ డిమాండ్ చేశారు. స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు కా॥ నాగమణి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, వరకట్న వేధింపులూ రోజు రోజుకు తీవ్రమౌతున్నాయనీ యిలాంటి సంఘటనలు జరగకుండా సంబంధిత అధికార్లు తక్షణం చర్య తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమానికి దళిత నాయకులు బేతపూడి రవి, శ్రీనివాస్; రైతుకూలీ సంఘం జిల్లా నాయకురాలు పి. అంజమ్మ, ఎన్.వై.ఎస్. నాయకుడు జి. మల్లేశు, ఈపూరి రాంబాబు పాల్గొని మాట్లాడారు. 60 మంది పేద దళిత మహిళలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ★

# కెసిపి యాజమాన్య రైతాంగ వ్యతిరేక విధానాలపై సమైక్య పోరాటం సాగిద్దాం!

## చెరకు రైతుల బహిరంగసభలో వక్తల పిలుపు

**ఉయ్యూరు, 25-01-11:**

చెరకు రైతుల అఖిలపక్ష కార్యాచరణ కమిటీ నాయకత్వాన స్థానిక ట్రావలర్స్ బంగ్లా ఆవరణలో బహిరంగసభ జరిగింది. ముందుగా రైతులకు ఆహ్వానం పలుకుతూ కార్యాచరణ కమిటీ నాయకులు కా॥ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ, గత చెరకు సీజన్లో చెరకు రైతుల అఖిలపక్ష కార్యాచరణ కమిటీ నాయకత్వాన సభలు, ధర్నాలు, 28రోజుల నిరవధిక రిలే నిరాహారదీక్షలు, 26వ రోజున ఉయ్యూరులో భారీ నిరసన ప్రదర్శన కొనసాగింపుగా కెసిపి ఫ్యాక్టరీ లోపలి మెయిన్‌గేట్‌ముందు 7 గంటలపాటు సాగిన రైతాంగ బైఠాయింపు ఫలితంగా జిల్లా కలెక్టర్‌తో చర్చలకు అంగీకరించటం, హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి మొదలు అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులను కలవటం తదితర రూపాల్లో అంచెలవారీగా సమైక్య ఉద్యమాన్ని సాగించిన ఫలితంగా కెసిపీ యాజమాన్యం రెండుసార్లుగా చెరకు టన్నుకి రు.250 పెంచక తప్పలేదు. పెంచిన ధరను దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్‌కి రైతులు రెట్టింపు ప్లాంటేషన్ వేశారు. అయితే రైతుల ఆశలను అడియాశలు చేస్తూ గత సీజన్‌లో ఇచ్చిన ధర (రు.2100)కు రు.200 కోతపెట్టి యాజమాన్యం చెరకు ధర(రు.1900) ప్రకటించటంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలతో వున్నారని, ఇలాంటి నేపథ్యంలో ఈ బహిరంగసభ జరుగుతుందని చెప్పి వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

సభకు అధ్యక్షత వహించిన కార్యాచరణ కమిటీ కన్వీనర్ వెలగపూడి అజాద్ ఉయ్యూరు ప్రాంతంలో చెరకు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను, కెసిపి యాజమాన్యం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను వివరించారు.

సభకు ముఖ్యవక్తగా విచ్చేసిన తెలంగాణా జిల్లాల చెరకు రైతుల కన్వీనర్ యం.అప్పిరెడ్డిగారు మాట్లాడుతూ తొలుత కృష్ణాజిల్లా కమ్యూనిస్టు ఉద్యమంలో నేలకొరిగిన అమరవీరులను స్ఫురణకు తెచ్చి వారికి నివాళు లర్పించారు. తర్వాత తమ సంఘం నాయకత్వాన తెలంగాణా జిల్లాల్లోని చెరకు రైతాంగం సాగిస్తున్న నిరవధిక ఆందోళనా కార్యక్రమాలను వివరించారు. దక్షిణ భారత దేశంలో పంచదార ఫ్యాక్టరీల సిండికేట్‌కు ఉయ్యూరు కెసిపి యాజమాన్యం నాయకుడిగా వ్యవహరిస్తూ చెరకు రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ వున్నదని, కావున కెసిపి యాజమాన్యంపై పోరాటాన్ని ఎక్కుపెట్టాల్సిన అవసరం వుందన్నారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగానే రైతులకు సరైన ధర ఇవ్వలేకపోతున్నామని కెసిపి యాజమాన్యం చేస్తున్న వాదనలను త్రిప్పికొడుతూ, భార్గవా ఫార్ములాను ఎత్తివేయటంవలన, లెవీ సుగర్ శాతాన్ని 20శాతం నుండి 10 శాతానికి తగ్గించటం వలన, లెవీ సుగర్ ధరను క్వింటాల్‌కు రు.1375 నుండి రు.1826లకు పెంచటం వలన, ముడిచక్కెర దిగుమతులను పెంచటంవలన పెద్దఎత్తున లాభాలు దండుకొంటున్నా తమ విధానాలను కప్పిపుచ్చుకోవటానికి, రైతులను ప్రక్కదారి పట్టించటానికి ఇటువంటి తప్పుడు ప్రచారాలు లంకించుకొంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను నిలదీయాలని, యాజమాన్య అనుకూల సంఘాల నాయకుల చర్యలను ఎండగట్టాలని చెప్పారు. గత పోరాటాలనుంచి అనుభవాలు తీసుకొని చెరకు రైతుల న్యాయమైన డిమాండ్లను సాధించుకొనే వరకూ రైతాంగం సమైక్యంగా ముందుకు కదలాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయశాఖ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు మాట్లాడుతూ కెసిపి యాజమాన్యానికి వందల కోట్ల లాభాలు వస్తున్నా, రు.100 కోట్ల రిజర్వు ఫండ్‌వున్నా, రైతులను మాత్రం దగాచేస్తూనే వున్నదన్నారు. 60శాతంగా వున్న కౌలు రైతుల పరిస్థితి చాలా దారుణంగా వుందని, కావున కౌలు రైతులను ఆదుకొనే విధంగా ప్రభుత్వం సరైన విధానాలు చేపట్టాలన్నారు. కెసిపిలో వున్న చెరకు రైతుల సంఘం గత సీజన్‌లో రైతులు పెద్దఎత్తున ఆందోళన చేసినా జనరల్‌బాడీ వేయలేదని, ఈ సీజన్‌లో యాజమాన్యం టన్నుకి రు.200లు కోతపెట్టినా ఇంతవరకు జనరల్‌బాడీవేయలేదని, రైతులందరి ప్రయోజనాలను తాకట్టుపెట్టే అధికారం వీరికెవరు ఇచ్చారని ఆగ్రహంతో ప్రశ్నించారు. రైతాంగం మొహమాటాలు ప్రక్కనపెట్టి న్యాయమైన డిమాండ్ల సాధనకోసం ఐక్యంగా కదలాలని పిలుపుచ్చారు.

రైతుకూలీసంఘం రాష్ట్రకార్యదర్శి కె.కోటయ్యగారు మాట్లాడుతూ, చెరకు రైతులను ఏవిధంగా అయితే ధరలు తగ్గించి దివాళాతీయించాలని చూస్తున్నారో ఇతర పంటల రైతులను కూడా అదేవిధంగా దివాళాతీయించి వేలాది మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకొనే వైపు నెట్టివేస్తున్నారని; సెజ్‌లు, కారిడార్‌ల పేరుతో లక్షలాది ఎకరాలను రైతాంగంనుండి గుంజుకొని రైతులను భూమినుండి గెంటివేయిస్తున్నారని, ఆ విధంగా వ్యవసాయం దండగని తేల్చి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న పాలకుల సరళీకరణ విధానాలపై పోరాటాన్ని ఎక్కుపెట్టాలని పిలుపిచ్చారు.

మరో ముఖ్యవక్తగా వచ్చిన లోక్‌సత్తాపార్టీ అధ్యక్షులు జయప్రకాష్ నారాయణగారు మాట్లాడుతూ, ఇంధనం-ఆహారం అవసరాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో భూమివిలువ పెరిగేదేకానీ తరిగేదికాదని చెప్పారు. భూమిపై ఆధారపడ్డ చెరకు రైతు కన్నీళ్ళు పెట్టుకోవాల్సిన దుస్థితి ఎందుకు వస్తున్నదని ప్రశ్నించారు. ఇందుకు కెసిపి యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలు రైతాంగ వ్యతిరేకంగా వున్నాయని విమర్శించారు. కౌలు రైతులు నానాటికీ పెరిగిపోతున్నారనీ కౌలురైతు, ఎకరానికి రు.10వేలు నష్టపోతున్నారని, ఒక ప్రక్కన చెరకు పంట, ఉప ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంటే ఆ పంట పండించే రైతు దివాళాతీసే పరిస్థితులు ఎందుకొచ్చాయో ఆలోచించాలని చెప్పారు. చెరకు రైతులు తమ సమస్యలనుండి బయటపడాలంటే-రాష్ట్రప్రభుత్వ సలహా ధరను సాధించు కోవాలని, పంటను ఫ్యాక్టరీకి తోలకుండా బెల్లం ఆడించాలని, వచ్చే సీజన్‌కి రు.2500 ఇస్తామని వ్రాతపూర్వకంగా అగ్రిమెంట్ ఇస్తేనే పంటవేస్తామని చెప్పాలని, అప్పుడు మాత్రమే యాజమాన్యం దిగివస్తుందని, పులినోట్లో తలపెట్టి కూర్చొంటే మిగిలేది ఏమీలేదని, 'మీరు బయటకు రండి, మీకు అండగా వుండే బాధ్యత నాది' అని రైతులకు భరోసా ఇచ్చారు.

ఇంకా ఈ సభలో చెరకు రైతు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.గోపాలరావు, వై. కేశవరావు; చెరకు ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్రకార్యదర్శి ఎన్‌వియస్ శర్మ, హనుమాన్‌జంక్షన్ చెరకు రైతుసంఘ నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్, జిల్లా తెలుగురైతు అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, జిల్లా కాంగ్రెస్ కిసాన్‌సెల్ అధ్యక్షులు కామిశెట్టి నాగభూషణం, వైయస్ జగన్ రైతుసంఘం నాయకులు జొన్నల రామ్మోహనరెడ్డి గార్లు చెరకు రైతాంగం తమ న్యాయమైన హక్కులకోసం పోరాడాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. చివరగా కార్యాచరణకమిటీ నాయకులు యం.హరిబాబుగారు సభలో ఉపన్యాసకులకు, వివిధ గ్రామాల నుంచి హాజరైన రైతు మిత్రులకు అభినందనలు తెలియజేశారు.

### ఫ్యాక్టరీ అధికారులను నిలదీసిన రైతులు

బహిరంగసభను విజయవంతంగా జరుపుకొన్న అనంతరం కార్యాచరణకమిటీ నాయకులతో కలిసి రైతులు కెసిపి ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌కి మెమోరాండం ఇవ్వటానికి వెళ్ళారు. మెమోరాండం ఇవ్వటానికి కార్యాచరణ కమిటీ ప్రతినిధులతోనే జీఎమ్ మాట్లాడతారని ఫ్యాక్టరీ ప్రతినిధులు చెప్పటంతో, అలాకాదు రైతుల సమక్షంలోనే జరగాలని పట్టుబట్టడంతో చివరికి అంగీకరించారు. ఫ్యాక్టరీలోని ఆడిటోరియంలో రైతులందరి సమక్షంలో కార్యాచరణకమిటీ నాయకులు ముప్పాళ్ళ భార్గవశ్రీ మెమోరాండం చదివి విన్పించి ఫ్యాక్టరీ జీఎమ్ వెంకటేశ్వరరావుగార్కి మెమోరాండం అందించారు. మెమోరాండం కాపీని కెసిపి యాజమాన్యానికి పంపిస్తానని జీమ్ చెప్పటంతో రైతులు ఆగ్రహంతో యాజమాన్యం ఎప్పుడు సమాధానం ఇస్తుందో చెప్పాలని నిలేశారు. ఫ్యాక్టరీకి వస్తున్న లాభాలను వడ్డే శోభనాద్రీశ్వరరావుగారు లెక్కలతో సహా వివరించి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రైతుల అభిప్రాయాలు తీసుకొని కార్యాచరణ కమిటీ కన్వీనర్ వెలగపూడి ఆజాద్‌గారు యాజమాన్యానికి పదిరోజులు టైమ్ ఇస్తున్నామని, ఈలోపు రైతుల డిమాండ్లపై స్పందించకపోతే భవిష్యత్ ఆందోళనా కార్యక్రమాన్ని చేపడతామని కెసిపి అధికారుల ముందు ప్రకటించారు. ఈ కార్యక్రమం ఆసాంతం రైతుల్లోని పట్టుదల వ్యక్తమైంది. ✡

# 'రైతాంగ ఉద్యమ దృక్పథానికి దర్పణం పడుతున్నరైతుకూలీసంఘం సావనీర్

## రాష్ట్ర మహాసభల సావనీర్ 2010 -ఆవిష్కరణ సభలో కా॥ పరకాల పట్టాభిరామారావు




సభకు హాజరైన ప్రజలు; సావనీర్ ఆవిష్కరణ

**విజయవాడ, 6-2-11:**

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) -2010 రాష్ట్ర మహాసభల సావనీర్ ఆవిష్కరణ సభ స్థానిక స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో జరిగింది. ఈ సభకు రైతుకూలీసంఘం రాష్ట్రకార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య అధ్యక్షత వహించారు. ఆయన అధ్యక్షోపన్యాసంలో 2001 గుంటూరు రాష్ట్ర మహాసభలనుంచి మూడు సావనీర్‌లు, మూడు వార్షిక సంచికలను తీసుకురావటం జరిగిందని, వీటిల్లో మహా సభల్లో పాల్గొన్న వక్తల ఉపన్యాస పాఠాలతోపాటు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో వివిధ రైతాంగ సమస్యలపై జరిగిన ఉద్యమాల రిపోర్టులను పొందుపరచటం జరిగిందని, అలానే వ్యవసాయరంగ సంక్షోభానికి గల కారణాలపై వ్యవసాయరంగ శాస్త్రవేత్తల విశ్లేషణలు; జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయిలో గతంలో జరిగిన ముఖ్యమైన రైతాంగ పోరాటాలు, వాటి అనుభవాలను అందిస్తూ వస్తున్నాం అని వివరించారు.

తర్వాత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కా॥ పరకాల పట్టాభిరామారావు గారు '2010 రాష్ట్ర మహాసభల సావనీర్'ను సభికుల కరతాళ ధ్వనుల మధ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతాంగ ఉద్యమ దృక్పథానికి దర్పణం పడుతున్న సావనీర్‌లను తీసుకొస్తున్న రైతు కూలీ సంఘం నాయకత్వానికి అభినందనలు తెలియజేశారు. తాను 'కమ్యూనిజం' పత్రిక ఎడిటర్‌గా వున్నప్పుడు 2001 గుంటూరు మహాసభల సావనీర్‌ను సమీక్షించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈనాడు కమ్యూనిస్టు ఉద్యమ శక్తుల ఐక్యత తక్షణ అవసరంగా వుందని, ఎవరి పంథా ఏమిటో అన్ని పార్టీలు సమీక్షించుకోవలసిన అవసరం వుందని, ప్రజలు లేని సాయుధ పోరాటాలు ఎవరి కోసమో ఆత్మ పరిశీలన చేసుకోవటం అవసరమని, కోరాపుట్ జిల్లా గిరిజన సంఘం నాయకుడు కేంద్రుక అర్జున్‌ను మావోయిస్టులు చంపటం అన్యాయం అని, ఆ కామ్రేడ్‌కు విప్లవ జోహార్లు తెలుపుతున్నానని, కమ్యూనిస్టు శక్తుల ఐక్యతని సాధించటంలో భాగంగా ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు సాగించటానికి ముందుకు రావాలనీ విజ్ఞప్తి చేశారు.

రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ, వ్యవసాయరంగ సంక్షోభంలో భాగంగా భూమి సమస్యను, భూ సంస్కరణల తీరు తెన్నులను, దళిత, గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి సావనీర్, వార్షిక సంచికల్లో రిపోర్టులను, పరిశీలనలను, నిజనిర్ధారణ కమిటీ రిపోర్టులను అందిస్తున్నామనీ, 1857లో జరిగిన తొలి స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశంలో, మన రాష్ట్రంలో జరిగిన తెలంగాణా, నక్సల్‌బరీ, శ్రీకాకుళాలలో జరిగిన రైతాంగ పోరాటాల అనుభవాలను అందిస్తూ ఆ పోరాటాల వెలుగులో ఉద్యమాలు నిర్మించాల్సిన కర్తవ్యాలను ముందుంచుతున్నామనీ, అన్ని రాజకీయ పార్టీలూ రైతులకోసమే పాటుపడుతున్నామని చెప్తున్నాయనీ, కానీ పంటలకు గిట్టుబాటు ధర రాకపోవటానికి గల మూలకారణాల్లోకి వెళ్ళాల్సి వుందనీ, అలాగే ధరలు విపరీతంగా పెరిగి పోవటానికి, నానాటికీ వెలుగులోకి వస్తున్న కుంభకోణాలకూ, వాటి వెనకగల దోపిడీ రాజకీయవ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం వుందనీ, పాలకవర్గపార్టీలు ప్రజలను ప్రక్క మార్గం పట్టించడానికి పోటీలు పడ్తున్నాయనీ, రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడకుండా సమస్యలకు మూల కారకులైన పాలకులపై పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు.

సమతా జన్ మార్గ్ నాయకులు కా॥ వాసిరెడ్డి కృష్ణారావుగారు మాట్లాడుతూ, ప్రభుత్వాలు నియమించిన స్వామినాథన్ కమిషన్, జయతీఘోష్ కమిషన్, కోనేరు రంగారావు కమిటీలు-ఇవన్నీ ముఖ్యమైన భూమి సమస్యను పరిష్కారం కానీయకుండా ప్రక్క మార్గం పట్టించడానికి ఉద్దేశించినవేనని, అలానే నానాటికీ పెరుగుతున్న కౌలురైతుల సమస్యల పరిష్కారానికి పాలకులు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయటం లేదని, కావున రైతుకూలీ సంఘాలు కౌలు రైతులను సంఘటితం చేసి ఉద్యమాలు సాగించాలని పిలుపు నిచ్చారు.

రైతుకూలీసంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ, సావనీర్‌ల ద్వారా వెలుగులోకి తెస్తున్న రైతాంగ పోరాటాల అనుభవాలను అంది పుచ్చుకోవాలని, 2010 సావనీర్‌లో తీసుకొచ్చిన మునగాల జమీందార్‌కి వ్యతిరేకంగా ఒక దశాబ్దకాలం పాటు సాగిన రైతాంగ పోరాట అనుభవాలు చాలా విలువైనవని, వాటిని అందరూ అధ్యయనం చేయటం అవసరం అని చెప్పారు. ఈ సభలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కా॥ వీరబాబు ప్రసంగించారు. ✡

# 'చెరకు టన్నుకు 2500 రూ॥ చెల్లించాలి'

## రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) డిమాండ్

**చల్లపల్లి, 25-1-11 :**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) చల్లపల్లి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో చల్లపల్లి కె.సి.పి షుగర్ ఫ్యాక్టరీ ఎదురుగా ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. జగన్ మాట్లాడుతూ చెరకు రైతాంగం గత సీజన్‌లో సాధించుకున్న 2050/- నుండి ఈ సీజన్‌లో 1850/- మాత్రం ఇవ్వడం దుర్మార్గమనీ ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన చెరకు రైతాంగం నెత్తిన పిడుగుపాటేననీ, చెరకు ఫ్యాక్టరీల సిండికేట్ 8.5 రికవరి శాతాన్ని 9.5 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించగల్గారనీ, అలాగే భార్గవ ఫార్ములాను రద్దుచేయించడం బడా షుగర్ మిల్లర్ల ప్రయోజనాలు కాపాడే చర్యలేననీ అన్నారు.

ఈ స్థితిలో చెరకు రైతాంగం సమైక్య ఆందోళన చేస్తేనే తగిన ధరను సాదించగల్గుతారని అన్నారు. ఆ తర్వాత రైతు కూలీసంఘం (ఆం.ప్ర.) చల్లపల్లి ఏరియా కార్యదర్శి ఈపూరి రాంబాబు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు తలసిల లీలామనోహర్, పామర్తి అంజమ్మ, కొప్పినేని ఉమామహేశ్వరరావు, కె.సి.పి. యాజమాన్యపు రైతు వ్యతిరేక విధానాలను విమర్శించారు. ఓపిడిఆర్ జిల్లా నాయకులు కొల్లూరి రామాంజనేయులు, ఎన్.వై.ఎస్. నాయకులు మునిపల్లె శ్రీనివాసరావు, జి. మల్లేషు సంఘీభావం తెల్పారు. చెరకు రైతులు, కూలీలు మహిళలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010